RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



10 మే 2025 శనివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:293

# త్రివిధ దళాధిపతులతో రాజనాధ్ మీటింగ్



న్యూఢిల్లీ, మే 9 భారత్-పాకిస్తాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ న్యూఢిల్లీలోని సౌత్ బ్లాక్‌లో త్రివిధ దళాల అధిపతులను కలిశారు. బీహార్‌లోని పాట్నా పర్యటన రక్షణ మంత్రి సింగ్ రద్దు చేసుకున్నారు.

సౌత్ బ్లాక్‌లో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఇక్కడ కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (అఊ), ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ చీఫ్‌లు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (ఆఉఓా)తో భద్రతా పరిస్థితిని సమీక్షించారు. పెరిగిన ఉద్రిక్తతల మధ్య ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయడం, తదుపరి చర్యలను ప్లాన్ చేయడంపై ఈ సమావేశం దృష్టి సారించింది."రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ న్యూఢిల్లీలోని సౌత్ బ్లాక్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశానికి అధ్యక్షత వహించారు, పశ్చిమ సరిహద్దులో భద్రతా పరిస్థితి, భారత సాయుధ దళాల కార్యాచరణ సంసిద్ధతను సమీక్షించారు" అని రక్షణ మంత్రిత్వ శాఖ సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపింది."ఈ సమావేశానికి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, చీఫ్ ఆఫ్ నావల్ స్టాఫ్ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి, చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపి సింగ్, రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ హాజరయ్యారు" అని అది తెలిపింది. జమ్మూ కాశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి పాకిస్తాన్ భారీ దాడులకు పాల్పడటం, అనేక సైనిక స్థావరాలపై డ్రోన్ దాడులను విఫలం చేయడంతో దేశ రాజధానిలో వరుస సమావేశాలు కొనసాగుతున్నాయి.కీలకమైన సైనిక స్థావరాలు, పట్టణ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్తాన్ నుంచి ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌ల దాడిని భారత్ విజయవంతంగా అడ్డుకున్న కొన్ని గంటల తర్వాత ఈ సమావేశం జరిగింది. గురువారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో పాకిస్తాన్ వైమానిక దాడులు ప్రారంభించడంతో రాత్రిపూట నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. జమ్మూ, పఠాన్‌కోట్, ఉధంపూర్‌ను టార్గెట్ చేసుకుంది పాకిస్థాన్ అయితే భారతదేశ రక్షణ వ్యవస్థలు, సాయుధ దళాలు వెంటనే స్పందించి ప్రతి చర్యలు చేపట్టాయి. వైమానిక దాడి మధ్య శ్రీనగర్, జమ్మూ , పంజాబ్, రాజస్థాన్‌లోని వివిధ ప్రాంతాలలో విద్యుత్తు సరఫరా నిలిపేశారు. అనేక ప్రాంతాలు అంధకారంలోకి వెళ్లిపోయాయి. అంతే కాకుండా పాకిస్థాన్‌పై భారత దళాలు శక్తివంతమైన ప్రతీకార చర్య ప్రారంభించాయని, నియంత్రణ రేఖ (ఒూఅ) వెంబడి ఉన్న అనేక పాకిస్తాన్ సైనిక పోస్టులు ధ్వంసం చేశాయని రక్షణ వ్యవస్థలోని వర్గాలు తెలిపాయి. శత్రువు స్థానాలను కూల్చివేసేందుకు యాంటీ ట్యాంక్ గైడెడ్ క్షిపణులు ఉపయోగించారు. మే 8, 9 తేదీల రాత్రి మొత్తం పశ్చిమ సరిహద్దులో పాకిస్తాన్ సాయుధ దళాలు "డ్రోన్లు, ఇతర పేలుడు సామగ్రిని ఉపయోగించి దాడులను" ప్రారంభించాయని భారత సైన్యం ఒక అధికారిక తెలిపారు. డ్రోన్ దాడులతో పాటు, పాకిస్తాన్ దళాలు జమ్మూ, కశ్మీర్‌లోని ఎల్‌ఓసి వెంబడి అనేకసార్లు కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడిచి కాల్పులు చేసినట్టు వెల్లడించారు. డ్రోన్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టారు. కాల్పుల విరమణ ఉల్లంఘనను తగిన రీతిలో స్పందినట్టు " ఆర్మీ తన ప్రకటనలో నొక్కి చెప్పింది. "భారత సైన్యం దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను నిలబెట్టడానికి కట్టుబడి ఉంది.

ప్రతి శత్రు ప్రయత్నాన్ని అఖండ శక్తితో ఎదుర్కొంటుంది." అని వెల్లడించింది. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారతదేశం ఆపరేషన్ సిందూర్ కింద సైనిక చర్య చేపట్టిన తర్వాత పాకిస్థాన్ దుశ్చర్యలకు దిగుతోంది.

# పాకిస్తాన్ కాల్పుల్లో అమరుడైన : తెలుగు జవాన్ మురళీ నాయక్



వార్తా 2 లో

## భారత్ ఆర్మీ కీ సంఘీభావంగా ర్యాలీ ఈసమియా బజార్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో.









**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** శుక్రవారం నాడు ఉమ్మడి రాష్ట్రాల వీరజావణులకు శ్రద్దాంజలి ఘటించి, భారత్ ఆర్మీ కీ సంఘీభావ ర్యాలీ ఈసమియా బజార్ కమ్యూనిటీ హాల్ నుండి కోఠి ఆంధ్ర బ్యాంకు వరకు 500 మంది తో ర్యాలీనీ నిర్వహించినారు. ర్యాలీలో భారత ఆర్మీకి మీరు చేసే పోరాటానికి మేము సమర్థిస్తూ మీరు ముందుకు వెళ్ళండి.మీ వెంట మేము ఉన్నాం . భారత్ మాతాకు జై వీరజవాన్ మురళీనాయక్ ,అమర్‌రహే అంటే నినాదాలు చేస్తూ కోఠి ఆంధ్ర బ్యాంకు వద్ద స్వాతంత్ర్య సమరయోదుడు పండిత్ నరేందర్ జీ విగ్రహంవద్ద వీరజవాన్లకు ఆత్మ శాంతించాలని మీ వీర మరణం దేశం గుర్తించుకు ఉంటుందని=రెండు నిమిషాలు మౌనం పాటించడం జరిగినది.ఈ కార్యక్రమంలో సుల్తాన్ బజార్ పోలీస్ ఇన్స్పెక్టర్ నర్సింహా సబ్ ఇన్స్పెక్టర్ సుదర్శన్ ఇతర పోలీస్ సిబ్బంది మరియు, దిలీప్ ఘనటే, బద్దం సతీష్ గౌడ్, రాంశెట్టి నరేందర్, సంజయ్ యాదవ్, శైలందర్ యాదవ్, నరేందర్, అశోక్, లోహిత్,చలపతి, వెంకట్, డా॥ ఆర్వల్లిశ్రీనివాస్ వంజరి, అజయ్ తులాహన్, నవీన్ గౌడ్, ఉదయ్ శెంకర్, శివ, మోహన్, సోని, పవన్, గోవింద్ రాజ్, విట్టల్,చెతనే, శ్రీనివాస్ గుప్త, పూజ హరి, శేకేర్,బస్తీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# యుద్దానికి సిద్ధం

## -మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** భారత్-పాకిస్థాన్ ల మధ్య ఏర్పడిన యుద్ధ వాతావరణంలో తన అవసరమని భావిస్తే యుద్ధంలో పాల్గొనడానికి తాను సిద్ధంగా ఉన్నానని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

భారత వైమానిక దళంలో పని చేసిన తాను మిగ్-23 వంటి యుద్ధ విమానాలు నడిపిన ఫైటర్ పైలెట్ గా పనిచేసిన అనుభవం తనకుందని ఆయన తెలిపారు.

అదే అనుభవంతో తాజాగా రెండు దేశాల మధ్యన ఏర్పడ్డ ఉద్రిక్తత వాతావరణంలో తన సేవలు అవసరమనుకుంటే వెనక్కి తగ్గేది లేదని ఆయన సుస్పష్టం చేశారు.

శుక్రవారం సాయంత్రం గాంధీభవన్ లో విలేకరులతో జరిగిన చిట్ చాట్ లో ఆయన పాల్గొన్నారు.

తాను 16 ఏళ్ల వయసులోనే సాయుధ దళాల్లో చేరిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.1982 నాటికే మిగ్-21వంటి యుద్ధ విమానాలు నడపడంతో పాటు తరువాత క్రమంలో మిగ్-23 యుద్ధ విమానాలను సమర్ధ వంతంగా నడిపినట్లు ఆయన తెలిపారు.

మిగ్-23యుద్ధ విమానం రెండింతల వేగంతో దూసుకు పోయే యుద్ధ విమానాంగ ప్రసిద్ధి చెందిందని ఆయన తెలిపారు.

20 ఏళ్ల వయస్సులోనే భద్రతా సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఉత్తరప్రదేశ్, శ్రీనగర్, అమృతసర్ వంటి ప్రాంతాల్లో పని చేసినట్లు ఆయన తెలిపారు.

తాజాగా కాశ్మీర్ లో జరిగిన ఘటన పై ఆయన స్పందిస్తూ మతం పేరుతో జరిగే హింసాత్మక చర్యలను సంఘటితంగా ఖండించాలని ఆయన దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. పాకిస్థాన్ అండతో జరిగిన ఈ ఉగ్రవాద చర్యను యావత్ భారతదేశం ముక్తకంఠంతో ఖండించిందన్నారు.

లష్కరే తోయిబాబకు చెందిన గ్రూప్ జరిపిన దుశ్చర్యకు ప్రతిగా భారతదేశానికి ప్రతిస్పందించాల్సిన హక్కు ఉందని ఆయన తేల్చిచెప్పారు.తాజాగా భారత ప్రభుత్వం చేపట్టిన చర్యలు అందుకు నిదర్శనమన్నారు.

కాశ్మీర్ సమస్య పరిష్కారానికి ఆపరేషన్ సిందూర్ పేరుతో రఫెల్ జెట్లు,డ్రోణులు వినియోగించడాన్ని ఆయన సమర్దించారు.

పాక్ ఆక్రమిత భూభాగాన్ని కాశ్మీర్ లో కలుపు కోవడమే ఈ సమస్యకు ముగింపు అని,ఇది నా వ్యక్తిగత అభిప్రాయమన్నారు.

జమ్మూలో జరిగిన దాడిపై భారత్ స్పందించడాన్ని ఆయన సమర్ధిస్తూనే భవిష్యత్ లో ఈ తరహా దాడులు ఉత్పన్నం అయితే పాకిస్థాన్ కు ఏ దేశం సైనిక సహాయం అందించదన్నారు.

యుద్ధమే వస్తే ఏర్పడే పరిస్థితి ఏమిటి అన్న ప్రశ్నకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ పూర్తి స్థాయిలో యుద్ధం వస్తే యుద్ధం లో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు.

## దేశ రక్షణలో ప్రాణాలర్పించిన వీర జవాన్ మురళీ నాయక్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితాడ పంచాయతీకి చెందిన మురళీనాయక్ యుద్ధభూమిలో మరణించారన్న వార్త దిగ్భ్రాంతికి గురి చేసింది

దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీనాయక్ త్యాగం మరువలేనిది

వీర మరణం పొందిన మురళీ నాయక్ కి నివాళులు అర్పిస్తున్నా

మురళీ నాయక్ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి

మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ అదేవున్ని ప్రార్థిస్తున్నా

# అమల్లోకి పౌర రక్షణ చట్టం

వార్తా 2 లో

ప్రజాబలం

10 మే 2025 శనివారం

# కౌలు రైతుల ఆర్థిక ఇబ్బందులు!

మానవ మనుగడకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా పరిగణించే మనం, ఆరుగాలం కష్టపడి వ్యవసాయం చేసే రైతును మాత్రం ఆర్థికంగా ఆదుకోలేకపోతున్నాం. సమస్యలకు కారణాలు ఏవైనా బలిపశువు మాత్రం రైతే. ప్రముఖ తెలుగు దినపత్రికల కథనాల ప్రకారం గత కొన్ని నెలల్లో తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. అందులోను యువ కౌలు రైతుల ఆత్మహత్యలు చేసుకోవడం గమనిస్తున్నాం. ఒక వైపు ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు యువత వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకోవాలని సూచిస్తున్న తరుణంలో ఇలాంటి సంఘటనలు జరగడం మరింత బాధాకరం. తగినంత వ్యవసాయేతర ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల గ్రామీణ యువత ఇలాంటి సంఘటనలు చాలా ప్రభావితం చేస్తాయి. రైతుల ఆత్మహత్యలకు ప్రధాన కారణం అప్పుల భారం. ప్రభుత్వ అధికారికా లెక్కలైన 77వ జాతీయ నమూనా సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఒ)-వ్యవసాయ గృహాల పరిస్థితి అంచనా -2018- 19 ప్రకారం దేశంలోని 50.2 శాతం వ్యవసాయ కుటుంబాలు అప్పుల భారాన్ని మోస్తున్నాయి. అదే విధంగా, మన రాష్ట్రంలో 91.7 శాతం రైతు కుటుంబాలు అప్పులు బారినపడ్డాయి. ఇలా అప్పుల భారాన్ని తట్టుకోలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అందులోను కౌలు రైతులు సాధారణ రైతుల కంటే అధికంగా నష్టపోతున్నారు. దేశవ్యాప్తంగా సుమారుగా 22.804 మిలియన్ల వ్యవసాయ కుటుంబాలు అనగా మొత్తం సాగు కుటుంబాలలో 17.3% శాతం వ్యవసాయ కుటుంబాలు 13% వ్యవసాయ ప్రాంతాన్ని కౌలు రైతులు సాగుచేస్తున్నారు.తెలంగాణ వ్యవసాయ గణన-2021- 22 ప్రకారం రాష్ట్రంలో 63.12 లక్షల హెక్టార్ల భూవిస్తీర్ణంలో మొత్తం భూకమతాల సంఖ్య 70.60 లక్షలు కాగా, భూమిని లీజుకు తీసుకున్న కుటుంబాల శాతం: 12.7 (2018-19). అందులో సుమారుగా 90.1 శాతం కౌలు రైతులు నేరుగా స్థిరమైన డబ్బు చెల్లించి సాగు చేయడం ద్వారా పంటలో నష్టం వస్తే అప్పుతోపాటు వడ్డీ చెల్లించలేక అప్పుల బారినపడుతున్నాడు. ఈ నేపథ్యంలో కౌలు రైతును ఆదుకోవడం ప్రభుత్వాల నైతిక బాధ్యత. ఆర్థిక నిచ్చెనలో అట్టడుగు స్థాయిలో ఉన్న వ్యక్తి కూడా సంతోషంగా ఉన్నప్పుడు మాత్రమే దేశ శ్రేయస్సు స్థిరంగా ఉంటుంది. కౌలు రైతుల సమస్యలు అనేక సంవత్సరాల నుండి కొనసాగుతున్నా ప్రభుత్వాలు కౌలు రైతులను ఆదుకోవడంలో విఫలమవుతున్నాయి. ప్రస్తుత దేశ కౌలు రైతుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని చూస్తే కౌలు వ్యవసాయం అనేది ఒక ఆర్థిక అవసరం, ఇంతకు ముందు అనుకున్నట్లుగా భూస్వామ్య విధానానికి చిహ్నం కాదు. వ్యవసాయం అన్నది భూస్వాములకు, కాడెద్దులు లేదా ఎకరం భూమి ఉన్నా వారికే పరిమితం కాకూడదు. నేటి ఆధునిక వ్యవసాయ విధానంలో యాంత్రీకరణ పెరగడం వల్ల వ్యవసాయం చేసే వారి పరిధి పెరిగింది. సామాన్య వ్యవసాయ కూలి తన శారీరక వ్యవసాయ సామర్థ్యం వల్ల తనకు సెంటు భూమి లేకున్నా కౌలుకు భూమిని తీసుకుని వ్యసాయాన్ని చేయడానికి ముందుకొస్తున్నాడు. అయితే, భూమి లీజుపై చట్టపరమైన ఆంక్షలు విధించడం వల్ల సాగు సామర్థ్యాన్ని అనేక విధాలుగా ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. అందులో ప్రధానంగా భూమి లీజుపై చట్టబద్ధమైన నిషేధం లేదా పరిమితులు వల్ల దేశంలోని చాలా రాష్ట్రాలలో దాచిన లేదా రహస్య కౌలుకు సాగుకు దారితీశాయి. అదే విధంగా కౌలు రైతులకు సంస్థాగత క్రెడిట్, బీమా, ఇతర ప్రభుత్వ సేవలకు దూరమవుతున్నారు. దానివల్ల రోజువారీ వ్యవసాయ పనులకు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నవి. అంతేకాకుండ, చాలా మంది భూయజమానులు తమ భూములను బీడుగా ఉంచడానికి ఇష్టపడుతున్నారు ఎందుకంటే తమ భూములను లీజుకు ఇస్తే భూమి హక్కును కోల్పోతారనే భయం ఉంది. ఈ నేపథ్యంలో, వివిధ రాష్ట్రాలలో ఉన్న వ్యవసాయ కౌలు చట్టాలను సమీక్షించి వేగవంతమైన గ్రామీణ పరివర్తన కోసం భూమి లీజును చట్టబద్ధం చేసి సరళీకరించాల్సిన అవసరం ఉంది. చట్టబద్ధమైన అధికారిక కౌలు వ్యవసాయం దోపిడీకి దారితీస్తుందనేది ఇకపై నిజం కాదు.వాస్తవానికి కౌలు రైతుల బేరసారాల శక్తి కాలక్రమేణా గణనీయంగా మెరుగుపడడంతోపాటు గ్రామీణ ప్రజలకు నియమాలు, చట్టాలపై అవగాహన పెరిగి ప్రజాస్వామ్య ప్రక్రియల ద్వారా రాజకీయంగా మరింత శక్తివంతులుగా మారారు. అందువల్ల, ప్రస్తుతం ఉన్న భూమి లీజును చట్టబద్ధం చేయడం వలన కౌలుదారులకు కాలపరిమితి భద్రతను అందిస్తుంది. భూమి లీజుకు చట్టబద్ధత చేయడం వల్ల కౌలుదారు రైతులకు సంస్థాగత రుణాలు, బీమా, వివిధ రకాల ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారు. దానితో సాగుకు ఎలాంటి ఆర్థికపరమైన అవరోధాలు లేకుండా పంటల ఉత్పత్తి మెరుగుపడుతుంది. భూమిలేని పేదల వ్యవసాయ సామర్థ్యం, సమానత్వాన్ని మెరుగుపరచడం కోసం 2016లో నీతిఆయోగ్ వ్యవసాయ భూమి లీజింగ్‌పై నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి దేశంలోని వివిధ రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోగల వ్యవసాయ భూమి లీజింగ్‌పై నమూనా చట్టం రూపొందించింది. నమూనా చట్టంలో లీజు ఒప్పందం వివరాలు, నిబంధనలు, షరతులు స్పష్టంగా పొందుపర్చి కౌలు రైతులను ప్రభుత్వ అందించే అన్ని రకాల సేవలకు అర్హులుగా చేసే విధంగా రూపొందించింది. అంతేకాకుండా, భూయజమానికి భద్రత కల్పిస్తూ కౌలు రైతు భూమిపై ఎటువంటి హక్కును పొందడు, దీర్ఘకాలం కౌలుకు తీసుకున్న వారసత్వంగా భూమి హక్కును పొందలేరని స్పష్టంగా పొందుపర్చడమే కాకుండా ఎలాంటి సమయంలోనైనా లీజును ముందుగా హెచ్చరించి రద్దు చేయవచ్చని, ఒకవేళ వివాదాలు ఏర్పడినచో ఎలా పరిష్కరించాలో కూడా నమూనా చట్టంలో పొందుపర్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రూపొందించిన ఆంధ్రప్రదేశ్ భూ లైసెన్స్ పొందిన సాగుదారుల చట్టం -2011ను ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 క్రింద తెలంగాణ భూ లైసెన్స్ పొందిన సాగుదారుల చట్టం, 2011 గా స్వీకరించి కొనసాగుతున్నది. ఈ చట్టంలో లైసెన్స్ పొందిన భూమి సాగుదారు అంటే ఎవరు, రుణ అర్హత కార్డు జారీ చేసి ప్రభుత్వ ఆర్థిక సంస్థలు పంట రుణాన్ని మంజూరు చేయవచ్చు అన్న మౌలిక అంశాలను పొందుపర్చినప్పటికీ చాలా అంశాలను స్పష్టంగా నిర్వచించబడలేదు లేదా ప్రస్తావించబడలేదు. ఈ తరుణంలో ప్రస్తుతం ఉన్న చట్టాన్ని నేటి మన రాష్ట్ర సాగు పరిస్థితులకు అనుగుణంగా నీతిఆయోగ్ వ్యవసాయ భూమి లీజింగ్‌పై నమూనా చట్టం ప్రకారం చాలా అంశాలను సవరించాలి. మన దేశంలో వ్యవసాయ భూముల రికార్డులను డిజిటలీకరణం చేయడానికి కేంద్ర ప్రభుత్వ కేబినెట్ డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌ను ఆమోదించింది. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ ద్వారా డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మించనుంది. అందులో అగ్రిస్టాక్ ద్వారా రైతుల పట్టిక, జియో రెఫరెన్సుతో కూడిన గ్రామా చిత్రాన్ని, పంటల విత్తిన పట్టిక రూపొందించి ప్రతి రైతుకు ఒక గుర్తింపు కార్డును ఇవ్వనున్నారు. కేబినెట్ డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌కు అనుగుణంగా మన రాష్ట్రంలో గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం వ్యవసాయ భూములను డిజిటలీకరణం చేయడానికి పూనుకున్నాయి. దీని ద్వారా రైతులకు ఉపయోగపడే అనేక రకాల సేవలను అందించడం సులువడంతో పాటు కౌలు రైతులు యజమానులు, ప్రభుత్వాల మధ్య కౌలుకు సంబంధిత సేవలు అందించడంలో సహాయపడవచ్చు. కౌలు రైతులను ఆదుకోవడంలో భూయజమాన్యులు కీలక పాత్ర పోషించనున్నారు. భూయజమానులు తమ భూములను కాపాడుకుంటూ కౌలు రైతులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను అందించడంలో అన్ని విధాలా సహకరించినట్లైతే కష్టపడి పండించే కౌలు రైతును ఆదుకొని వారి సంక్షేమంలో సహాయపడినవాళ్లవుతారు. స్వాతంత్ర్యం సమయంలో 70 శాతం దేశ జనాభా వ్యవసాయ మీద ఆధారపడి జీవన కొనసాగించేది. 2024 నాటికి వ్యవసాయం మీద ఆధారపడే వారి సంఖ్య 46.1 శాతానికి చేరింది. మరోవైపు పెరుగుతున్న దేశ జనాభాకు సరిపడా ఆహార భద్రతా కల్పించడం రానున్న రోజుల్లో ప్రధాన సమస్యగా మారనుంది. ఈ తరుణంలో వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకునే వారిని ప్రోత్సహించడం ప్రభుత్వాల బాధ్యత. కౌలు రైతుల చట్టపరమైన భద్రత కల్పించి వారికి కూడా సాధారణ రైతులకు ప్రభుత్వాలు అందించే పథకాల సేవలను అందించినట్లైతే సేద్యం చేసేవారి సంఖ్య పెరుగుతుంది. దీనికి మేధోపరమన స్థాయిలోనే కాకుండా చట్టబద్ధమైన విధాన, పరిపాలన స్థాయిలో చర్యలు తీసుకున్నట్లైతే కౌలు రైతుకు మేలు జరుగుతుంది.

# పాకిస్తాన్ కాల్పుల్లో అమరుడైన : తెలుగు జవాన్ మురళీ నాయక్

శ్రీనగర్, మే 9 జమ్మూకశ్మీర్‌లో పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో తెలుగు జవాన్ మురళీ నాయక్ అమరుడయ్యారు. వీర జవాన్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండా. మే 10 శనివారం వీరజవాన్ పార్థివదేహం స్వగ్రామానికి చేరుకోనుంది. దేశ రక్షణలో శ్రీ సత్యసాయి జిల్లా, పెనుకొండ శాసనసభ నియోజకవర్గం, గోరంట్ల మండలానికి చెందిన మురళి నాయక్ అనే సైనికుడు ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళి నాయక్ కు నివాళులు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా కేవలం ఉగ్రవాద స్థావరాలపై మాత్రమే దాడి చేశారు..పాక్ సైనికులకు కానీ, పాక్ పౌరులపై కానీ ఎలాంటి దాడి చేయలేదు. ఉగ్రవాదులకు తమకు సంబంధం లేదన్న పాకిస్తాన్ వక్రబుద్ధిని బయటపెట్టింది. ఉగ్రమూకపై భారత్ దాడి చేస్తే...తిరిగి వంకరబుద్ధి చూపిస్తూ భారత సరిహద్దు ప్రాంతాలపై క్షిపణి, డ్రోన్ దాడులకు పాల్పడుతోంది. ఈ క్రమంలో జమ్మూకశ్మీర్‌లో పాక్ జరిపిన దాడుల్లో తెలుగు జవాన్ వీర మరణం పొందారు. మృతిచెందిన జవాన్‌ను సత్యసాయి జిల్లాకు చెందిన మురళీ నాయక్‌గా గుర్తించారు. మే 08 గురువారం రాత్రి సరిహద్దు వెంబడి పాక్ కాల్పులు జరపగా మన సైన్యం కూడా దీటుగానే బదులిచ్చింది. ఈ ఎదురుకాల్పుల్లో మురళీ నాయక్ చనిపోయినట్టు సమాచారం. మే 10 శనివారం స్వగ్రామానికి వీర జవాన్ పార్థివ దేహం రానుంది. వీర జవాన్ మురళీ నాయక్ సోమందేపల్లి మండలం నాగినాయని చెరువుతండాలో పెరిగారు. సోమందేపల్లి విజ్ఞాన్ స్కూల్‌లో విద్యాభ్యాసం సాగింది. వీర జవాన్ మృతితో ఆయన కుటుంబం శోకసంద్రంలో ఉంది. యుద్ధభూమిలో కన్నుమూసిన మురళీనాయక్ శ్రీరాం నాయక్, జ్యోతీ బాయిల ఏకైక సంతానం

## 14 మందిని చంపాడు

మురళీ నాయక్ తండ్రి శ్రీరాం నాయక్ కొన్ని కీలక విషయాలను చెప్పారు. తన కుమారుడు చనిపోయేముందు పాకిస్థాన్ శత్రువులు దేశంలోకి అడుగుపెట్టకుండా అడ్డుకుని వీరమరణం పొందాడని తెలిపారు. 14మంది శత్రవుల్ని కాల్చి చంపినట్లు స్థానికులతో కలిసి వివరించారు. ఆయన మాటల్లోనే.. 'మురళీ నాయక్ రెండేళ్ల క్రితం ఉద్యోగంలో చేరాడు.. 2022 నవంబర్ 8న అగ్నివీర్ రిక్రూట్మెంట్‌లో సెలక్ట్ అయ్యాక ఉద్యోగంలో చేరాడు.. నాలుగేళ్లు అగ్రిమెంట్ ఉంది.. మురళీనాయక్ 2026 నవంబర్‌లో ముగిసేది. ఇవాళ ఆర్మీవాళ్లు నా భార్యకు ఫోన్ చేశారు.. ఆమెకు హిందీ అర్థం కాలేదు. అప్పుడు మురళీ గురించి మాట్లాడుతున్నారని నాకు ఫోన్ తీసుకొచ్చి ఇచ్చింది. రాత్రి ఫైరింగ్ జరిగింది.. మురళీనాయక్ చనిపోయారని నాతో చెప్పారు. కాల్పుల జరిగిన సమయంలో 14మందిని మురళీనాయక్ చంపాడని.. వాళ్లను ఎటాక్ చేసిన తర్వాత వెనక్కు తిరిగి వస్తున్నసమయంలో మురళీని ఎటాక్ చేశారనో నాతో ఆర్మీ వాళ్లు అన్నారు. ఇటీవల మురళీనాయక్‌ను ఆర్మీ పంజాబ్ నుంచి జమ్మూ కాశ్మీర్‌కు తీసుకెళ్లింది' అని వివరించారు. 14మంది శత్రువుల్ని మట్టుబెట్టిన తర్వాత అక్కడ ఎవరూ లేరనుకుని వెనుదిరిగిన సమయంలో ఇదంతా జరిగిందని చెబుతున్నారు.మురళీ నాయక్ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, పవన్ కళ్యాణ్ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మురళీ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శ్రీ మురళీ నాయక్ వీర మరణాన్ని జాతి మరచిపోదన్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. 'ఆపరేషన్ సిందూర్ లో వీర మరణం పొందిన జవాన్ శ్రీ మురళీ నాయక్ గారి త్యాగాన్ని భారత జాతి ఎన్నడూ మరచిపోదు. జమ్ము కశ్మీర్ సరిహద్దుల్లో శత్రు మూకలతో పోరాడి వీర మరణం పొందిన భారత జవాన్ శ్రీ మురళీ నాయక్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. శ్రీ సత్యసాయి జిల్లా కల్లి తండాకు చెందిన ఈ యువ జవాన్ దేశ రక్షణకు అంకితమై, సమర భూమిలో అమరులయ్యారు. ఈ వీరుడి తల్లితండ్రులు శ్రీమతి జ్యోతి బాయి గారికి, శ్రీ శ్రీరామ్ నాయక్ గారికి, ఇతర కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వ అన్ని విధాలా ఆ కుటుంబానికి భరోసా ఇస్తుంది' అని ప్రకటన విడుదల చేశారు.మురళీ నాయక్ తల్లిదండ్రులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్‌లో పరామర్శించారు. దేశ రక్షణలో పెనుకొండ నియోజకవర్గం, గోరంట్ల మండలం, కల్లితండాకు చెందిన మురళినాయక్ ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మురళీనాయక్ తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరాం నాయక్‌లతో ఫోన్‌లో మాట్లాడి సీఎం వారిని పరామర్శించారు. మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన మురళీ త్యాగాన్ని దేశమంతా గుర్తుపెట్టుకుంటుందని ముఖ్యమంత్రి అన్నారు. 25 ఏళ్ల వయసులోనే దేశం కోసం అమరుడైన మురళీ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సిఎం తెలిపారు. వీరజవాన్ మురళీ తల్లిదండ్రుల ఆవేదన తీర్చలేనిది అయినా.. ధైర్యంగా ఉండాలని ముఖ్యమంత్రి వారిని కోరారు.

# అమల్లోకి పౌర రక్షణ చట్టం

న్యూఢిల్లీ, మే 9 పాకిస్తాన్ తో ఉద్రిక్తతలు పెరుగుతూండటంతో భారత ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా 1968 పౌర రక్షణ చట్టం మరియు నియమాల ప్రకారం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో పౌర రక్షణ చర్యలను పెంచాలని ఉత్తర్వులు జారీ చేసింది. అత్యవసర సేకరణ కోసం పౌర రక్షణ నియమాల కింద అత్యవసర అధికారాలను ఉపయోగించాలని సూచించింది. ఈ మేరకు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ వెళ్లింది. 1968 పౌర రక్షణ నియమాలలోని సెక్షన్ 11, ఇతర అంశాలతో పాటు శత్రు దాడి జరిగినప్పుడు కీలకమైన సేవల నిర్వహణను నిర్ధారించడానికి అవసరమైన చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తుంది. 1968లో భారత పార్లమెంటు ఆమోదించిన పౌర రక్షణ చట్టం శత్రు దాడులు లేదా విపత్తుల నుండి పౌరులు, ఆస్తులు, భారత భూభాగాన్ని రక్షించడానికి అవసరమైన చర్యలను నిర్వహించడానికి అవకాశం కల్పిస్తుంది. ఈ చట్టాన్ని మే 24, 1968న ఆమోదించారు. యుద్ధం, బాహ్య దాడి, అంతర్గత అశాంతి, ఇతర శత్రు దాడుల నుండి పౌరులు, ఆస్తులు, భారత భూభాగాన్ని రక్షించడం ఈ చట్టం ఉద్దేశం. బ్లాక్‌అవుట్ చర్యలు, ప్రమాదకర పదార్థాల నిల్వ మరియు ఉపయోగం. వైద్య సహాయం, ఆహార సరఫరా, ఇతర అవసరమైన సేవలు , స్థానిక అధికారులను రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించడం వంటివి ఉన్నాయి. పౌర రక్షణ కార్ప్స్ ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం ఒక కంట్రోలర్ నియమిస్తుంది. దాడి సమయంలో లైట్లను నియంత్రించడం, అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి చర్యలు, జనాభాను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ఖాళీ చేయించిన వ్యక్తులకు ఆశ్రయం కల్పించడం., శిక్షణ , సన్నద్ధత కోసం అభ్యాసాలు నిర్వహిస్తారు. ఈ అభ్యాసాల సమయంలో ఆస్తి లేదా వ్యక్తులకు నష్టం జరిగితే, పరిహారం చెల్లిస్తారు. ఈ రెగ్యులేషన్లు కార్ప్స్ సభ్యుల నియామకం, శిక్షణ, విధులను నిర్దేశిస్తాయి. సైనిక బలగాలు, పోలీసు, లేదా ఇతర నిర్దిష్ట సేవలలో లేని వ్యక్తులు సాధారణంగా అర్హులు అవుతున్నారు. ఈనీతీఎం ద్వారా దరఖాస్తు చేయాలి. నమోదు సమయంలో ప్రమాణం చేయాలి. విధి నిర్వహణ సమయంలో గాయాలు లేదా ఆస్తి నష్టం జరిగితే, నిర్ణీత పరిహారం చెల్లించబడుతుంది. సభ్యులు కనీసం రెండు వారాల నోటీసుతో రాజీనామా చేయవచ్చు. 1960లలో భారతదేశం బాహ్య దాడుల , అంతర్గత అశాంతుల నేపథ్యంలో, పౌర రక్షణ చర్యలను బలోపేతం చేయడానికి ఈ చట్టం తెచ్చారు. 1970లలో, ఈ చట్టం పౌరులను సమీకరించడంలో విజయవంతమయింది. కార్ప్స్ సభ్యులకు విధి సమయంలో గాయాలు లేదా నష్టం జరిగితే, నిర్దిష్ట నిబంధనల ప్రకారం పరిహారం ఇస్తారు. అయితే చట్ట ఉల్లంఘనకు 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారు.

# సుజల స్రవంతి పనులను పరిశీలించిన చంద్రబాబు నాయుడు



అనంతపురం జిల్లా, ఉరవకొండ నియోజకవర్గం, చాయాపురంలో హంద్రీనీవా సుజల స్రవంతి పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. హంద్రీనీవా పనులపై అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కి.మీ మేర సాగుతున్న పనులను డ్రోన్ ద్వారా పరిశీలించారు. ప్రోగ్రామింగ్ ద్వారా రోజూ ఎంతమేర పనులు చేశారో డ్రోన్ ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. నాలుగు ఏజన్సీల ద్వారా పనులు జరుగుతున్నాయని ఈ సందర్భంగా అధికారులు సీఎంకు వివరించారు. ఇటీవల నాలుగుసార్లు వర్షాలు కురవడంతో పనులకు కొంతమేర ఆటంకం ఏర్పడిందని తెలుపగా... ఇకపై వేగంగా పనులు సాగించాలని సీఎం సూచించారు. నిర్దేశిత కాలానికి ఎట్టిపరిస్థితుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

## ఈ నెల చివరిలోగా ప్రెస్ అకాడెమీ భవనం ప్రారంభిస్తాం

## రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్ అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలైన జర్నలిస్టులకు అలాగే వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని తెలిపారు.వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలసరి పెన్షన్, తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలకు గురై వృత్తి నిర్వహించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు శుక్రవారం నాడు నాంపల్లి లోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ మండల, నియోజకవర్గ స్థాయిలో పని చేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మంచిని మంచిగా, నిజాన్ని నిర్భయంగా సమాజనికి తెలియజేసే దాంట్లో ఎంతో మంది జర్నలిస్టులు ఆణిముత్యాలుగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. జర్నలిస్టు వృత్తిని నమ్ముకుని తన జీవితం మొత్తం ఆ వృత్తికే అంకితం అయినవాళ్ళు ఎంతోమంది ఉన్నారని అన్నారు. ఆనాటి ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రెస్ అకాడమీ భవనాన్ని చిన్న చిన్న మరమత్తులు పూర్తి చేసుకుని ఈ నెల చివరిలోగా ప్రారంభిస్తామని తెలిపారు.

విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42.00 కోట్లను ఫీక్సడ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమి ఖర్చు పెడుతుందని. జర్నలిస్టుల సంక్షేమానికి ఫిక్స్ డిపాజిట్ పై వచ్చిన వడ్డీ ఆధారంగా ఇప్పటివరకు రూ.22 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు.మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి రూ.1,00,000/-తో పాటు అయిదు సంవత్సరాల వరకు, నెలకు రూ.3000/- ల చొప్పున పెన్షన్, వారి పిల్లలకు ట్యూషన్ ఫీజుల క్రింద 1 నుండి 10వ తరగతి వరకు చదివే పిల్లలకు నెలకు 1,000/-ల చొప్పున గరిష్టంగా ఇద్దరికి అందించడం జరుగుతుంది. ఇప్పటి వరకు ఈ ఖాతాలో మొత్తం రూ.8,98,39,000/-లు ఆర్థిక సహాయం అందించండం జరిగిందన్నారు.ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి మాట్లాడుతూ ఈ సమాజంలో జర్నలిస్టు వృత్తి అత్యంత కీలకమైనదని తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్నారని గడిచిన రెండు రోజులుగా రెండు దేశాల మధ్య ఏం జరుగుతుందో అన్న ఆతృతతో ఎదురుచూస్తున్న ప్రజలకు తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తున్నారని కొనియాడారు.ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని జర్నలిస్టుల సంక్షేమానికి నిధులను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి టి.ఎన్.ఆర్.

టీఎన్ఆర్ గా జన బాహుళ్యానికి చేరువై, అతి తక్కువ సమయంలో ప్రజాదరణ పొందిన బహుముఖ ప్రజ్ఞుడు తుమ్మల నరసింహారెడ్డి. దర్శకుడు కావాలనుకుని సినీ పరిశ్రమలో కాలూని, కొన్నాళ్లు రచయితగా ఎల్బీ శ్రీరాం వద్ద పని చేసి, తర్వాత మీడియా లోకి వెళ్లి, యూట్యూబ్‌లో తనదైన శైలిలో ఇంటర్వ్యూలు చేస్తూ గుర్తింపు పొందడమే కాకుం డా, ఒక నటుడిగా అవకాశాలు చేజిక్కిం చుకుని, తెలుగు ప్రేక్షకులకు చేరు వైన ప్రతిభాశాలి ఆయన. టి. ఎన్. ఆర్ అంటే వెంటనే గుర్తుకు వచ్చేది ఐడ్రీమ్ మీడియాలో "ఫ్రాంక్లీ స్పీకింగ్ విత్ టీఎన్ఆర్.టి.ఎన్.ఆర్.గా పేరొందిన తుమ్మల నరసింహా రెడ్డి (1976 జనవరి 9 – 2021 మే 10) తెలుగు ఇంటర్వ్యూ హోస్ట్, సినిమా జర్నలిస్టు, నటుడు. "ఫ్రాంక్లీ స్పీకింగ్ విత్ టి ఎన్ ఆర్" పేరిట ఆయన నిర్వహించిన ఇంటర్వ్యూ సీరీస్ ద్వారా ప్రాచు ర్యం పొందాడు. పలువురు తెలుగు సినీ నటీనటులు, సాంకేతిక నిపుణులు, ఇతర ప్రముఖులను "ఫ్రాంక్లీ స్పీకింగ్ విత్ టీఎన్ఆర్ " షోలో భాగంగా ఇంటర్వ్యూ చేయ గా వాటిలో పలు వీడియోలు యూట్యూబ్‌లో విశేష ప్రాచుర్యం, ప్రేక్షకుల ఆదరణ, అగణిత వ్యూలు పొందాయి. తుమ్మల నరసింహారెడ్డి 1976 జనవరి 9న జన్మించాడు. స్వగ్రామం తెలంగాణ లోని నూతన మంచిర్యాల జిల్లా పావునూరు. తండ్రి రాజిరెడ్డి గ్రామ సర్పంచ్ గా మూడు సార్లు ఎన్నికైనాడు. హైదరాబాద్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో, వివేకవర్ధిని కళాశాలలో చదువుకుని డిగ్రీ పొందాడు. టి.ఎన్.ఆర్. దర్శకత్వంపై ఆసక్తితో డిగ్రీ పూర్తికాగానే సినిమా రంగం లోకి వచ్చాడు. 1992లో దేవదాస్ కనకాల వద్ద దర్శకత్వం గురించి నేర్చుకున్నాడు. సినిమా రచయిత ఎల్. బి. శ్రీరామ్ వద్ద సహాయ రచయితగా పని చేశాడు. ఆ తర్వాత టెలివిజన్ జర్నలిస్టుగా పలు టెలివిజన్ ఛానళ్ళలో పని చేశాడు. ఈటీవీలో ప్రసారమైన నేరాలు – ఘోరాలు కార్యక్రమానికి సంబంధించి కొన్ని ఎపిసోడ్స్ కు దర్శకత్వం వహించాడు. ఎన్ టీవీలో క్రైమ్ స్టోరీస్, క్రిమినల్ వంటి కార్యక్రమాలు రూపొందించి నిర్వహించాడు. ఐడ్రీమ్ మీడియాలో "ఫ్రాంక్లీ స్పీకింగ్ విత్ టీఎన్ఆర్" అన్న ఇంటర్వ్యూ సీరీస్‌లో ఇంటర్వ్యూయర్‌గా తెలుగు సినిమా ప్రముఖులను ఇంటర్వ్యూలు చేశాడు. ఈ కార్య క్రమం లోని పలు ఇంటర్వ్యూలకు యూట్యూబ్‌లో మిలియన్ల కొద్దీ వ్యూలు లభించా యి. 2018 అక్టోబరు నాటికే టీఎన్ఆర్ ఇంటర్వ్యూలకు కోట్ల వీక్షణలు లభించినట్టు పత్రికా కథనాలు. మొదట్లో దర్శకుడు తేజతో చేసిన ఇంటర్వ్యూ వైరల్ కావడంతో "ఫ్రాంక్లీ స్పీకింగ్ విత్ టీఎన్ఆర్" ప్రారంభమైంది. రామ్ గోపాల్ వర్మ, కృష్ణ వంశీ, విజయ్ దేవరకొండ, మోహన్ బాబు వంటి సినిమా ప్రముఖులతో టీఎన్ఆర్ చేసిన ఇంటర్వ్యూలు బాగా ప్రాచుర్యం పొందాయి. 4 – 8 గంటల సుదీర్ఘ మైన సమయం ప్రేక్షకుల ఆసక్తి కోల్పోకుండేలా టి.ఎన్.ఆర్. పలువురు సినిమా ప్రముఖులను ఇంటర్వ్యూలు చేశాడు. కృష్ణవంశీ, తనికెళ్ళ భరణి వంటివారిని 4 గంటల పైచిలుకు ఇంటర్వ్యూలు చేశాడు. తాను గురువుగా భావించే ఎల్. బి. శ్రీరామ్ తో చేసిన ఇంటర్వ్యూ ఏకంగా 8 గంటల పాటు చేసి రికార్డు సృష్టించాడు.ఇంటర్వ్యూయర్‌గా ప్రాచుర్యం పొంది, తన ప్రతిభను బహిర్గత పరిచాక, ఆయనకు నటన అవకా శాలు పెరిగాయి. నేనే రాజు నేనే మంత్రి, జార్జ్ రెడ్డి, సుబ్రహ్మణ్య పురం, ఉమామహేశ్వర ఉగ్రరూ పస్య, జాతిరత్నాలు, ది రోజ్ విల్లా, నేడే విడుదల వంటి సినిమాల్లో టి.ఎన్.ఆర్. పాత్రలు పోషించాడు. కమెడియన్ సత్య హీరోగా సందీప్ కిషన్ నిర్మాతగా వివాహ భోజనంబు సినిమాలోనూ నటించాడు టీఎన్ఆర్. సర్కస్ సత్తిపండు, జై భజరంగ్ దళ్ , పిట్టల దొర వంటి ఎన్నో సినిమా లకు సహాయక దర్శకుడిగా పని చేశాడు. దర్శకుడిగా ఒక మంచి విలువ లున్న సినిమాను తీయాలని మదిలో తలచి, అందుకు స్క్రిప్ట్ కూడా రెడీ చేసుకుని, ఆపై కొందరు నటీనటులతో సంప్రదింపులు కూడా జరిపి, కరోనా పాజిటివ్ రావడంతో హాస్పిటల్ లో చేరి, దర్శకునిగా రాణించాలనే కోరిక తీర కుండానే చివరి శ్వాస వరకు పోరాడుతూ కన్ను మూశాడు. సిని మాలలో మంచి మంచి పాత్రలు వేస్తూ తనకంటూ నటుడిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించు కుంటున్న సమయం లోనే కోవిడ్ కోరలకు బలై, ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందు తూ, కేవలం 46 ఏళ్ళకే టీఎన్ఆర్ 2021 మే 10న తనువు చాలించాడు.

# ప్రజాసేవలో ఘనాపాఠి..

పదవులు పొందడం ద్వారా గౌరవాన్ని కొందరు పొందితే, తాము చేపట్టిన పదవులకే వన్నె తెస్తారు మరి కొందరు. రెండవ కోవకు చెందినవారు కరీంనగర్ రాజకీయ కురువృద్ధులు, ఆరడుగుల ఆజాను బాహుడు జువ్వాడి రత్నాకర్ రావు. స్వార్థ ప్రయోజనాల కోసం పదవులు పొందడం అత్యంత సహజ మైనా, తన ఆశ్రితులైన ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలను, అందించడం కోసమే వివిధ పదవులను చేపడతారని పేరొందిన ప్రజా సేవా తత్ప రుడు రత్నాకర్ రావు. ప్రజలకు తానేమో చేస్తానని నమ్మించి, ఎన్నికలలో గెలిచి, ప్రజలను విస్మరించడం కాక, నిస్వార్థంగా, చిత్తశుద్ధితో, ప్రజల సమస్యలు తెలుసుకుని, వారు కోరకుం డానే వారి సమస్యల పరిష్కా రం కోసం కృషి సల్పే వారే నిజమైన ప్రజాప్రతినిధులని రత్నాకర్ రావు పదే పదే నొక్కి చెబుతూ ఉండేవారు. దినచర్యను కుదించుకుని కృష్ణా, రామా అనుకుంటూ ఆధ్యాత్మిక చింతనతో, మలి సంధ్య జీవిత కాలాన్ని గడపాల్సిన రత్నాకర్ రావు, జీవిత చరమాంకం లోనూ, జీవితానికి అర్థం, పరమార్థం, స్వార్థం కానేకాదని, దృఢంగా విశ్వసిస్తూ, తుది శ్వాస వరకు, ప్రజల గురించి ఆలోచిస్తూనే ఉండేవారాయన. అందుకే కాబోలు సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో అలుపెరుగని అవిశ్రాంత శ్రామికునిగా, ప్రజలతో మమేకమై ప్రజలకు సేవలు చేసినా, చేసింది చాలదని, చేయాల్సింది ఇంకా ఎంతో ఉంది అని, ప్రజల మధ్య లేకున్నా, ప్రజల హృదయాల్లో చోటు పొందిన నేతగా, జీవిత చరమాంకం సమయంలోనూ సేవానిరతి స్ఫూర్తిని ప్రదర్శిం చిన గొప్ప మనసు ఆయనది. తొమ్మిది పదుల వయసులో కనీవినీ ఎరగని రీతిలో నిరంతరం తనను కలిసిన వారినీ, ఫోన్ ద్వారా మాట్లాడే వారినీ సమస్యల గురించే ఆరా తీయడం నిత్య విధిగా కలిగి వున్నా రాయన....1928 అక్టోబర్ 4వ తేదీన జన్మించి సర్పంచిగా రాజకీయ జీవితం ప్రారంభించి, 2020 మే 10 కన్ను మూసే వరకూ ప్రజా సేవకే అంకితం అయిన ధన్యజీవి. గ్రామ సర్పంచిగా, జగిత్యాల పంచాయతీ సమితి అధ్యక్షు లుగా, పిసిసి ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, ఎఐసిసి సభ్యులుగా, వ్యవసాయ విశ్వ విద్యాలయ పాలక వర్గ సభ్యులుగా, స్వతంత్ర... తర్వాత కాంగ్రెస్ 2సార్లు ఎమ్మెల్యేగా, చివరకు వై యస్ హయాంలో రాష్ట్ర దేవాదాయ స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖల మంత్రిగా ఆయన చేసిన కార్యక్రమాలు, అందించిన సేవలు చిరస్మరణీయం రత్నాకర్ రావు, 90వ దశకంలో కదలికలు ఇంటికి, చివరకు పడకకే పరిమితమైనా.... పుట్టినూరు అయిన తిమ్మాపూర్, రాజకీయ వేదికైన ధర్మపురి, రాజకీయ ఉన్నతికి చేయూతనిచ్చిన బుగ్గారం, జగిత్యాల నియోజక వర్గాల ప్రజా సమస్యలను తెలుసుకుని, అవసరమైన వారికి ఫోన్లు చేయడం ఆయన నిత్య కృత్యంగా పెట్టుకున్నారు. మరణానికి కొద్ది రోజుల ముందు నిమ్స్ లో, చికిత్స పొందుతున్న సమయంలో... తాజా మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి ఈటల రాజేందర్, తదితరులు వేరు వేరుగా కలిసిన సందర్భాలలో, పలు అంశాలను వారి దృష్టికి తెచ్చి, పరిష్కారం చేయాలని కోరారు. హామీలు పొందారు కూడా. తన ఆరోగ్యం గురించి వాకబు చేసి, వైద్యులతో మెరుగైన సేవలను అందించాలని మంత్రులు కోరిన సందర్భాల లోనూ, తన గురించి, ఆరోగ్యం గురించి కాకుండా, ప్రజా సమస్యలు, అవసరాలు, సౌకర్యాల గురించి మాట్లాడిన జువ్వాడి రత్నాకర్ రావు తీరు నాటి మంత్రులను ఆశ్చర్య చకితులను చేసిన నేపథ్యం, ఆయన నిజమైన ఆదర్శ ప్రజా ప్రాతినిథ్య సేవాభావానికి పరాకాష్టగా చెప్పక తప్పదు. ధర్మపురి ప్రాంత ప్రజలతో విడదీయరాని బంధం, సంబంధం, అనుబంధం కలిగిన జువ్వాడి రత్నాకర్ రావు సేవలకు గుర్తింపుగా, రాజకీయ విపక్షీయులు అయినా, ఇటీవలే ధర్మపురి తాజా మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎవరి సాయం కోరకుండా, స్వంత ఖర్చుతో, జువ్వాడి విగ్రహాన్ని తయారు చేయించి, ప్రతిష్టింప చేయించి ప్రారం భించడం విశేషం. రాజకీయాలంటే సిద్ధాంతం, రాద్ధాంతాలు కాదు. దాని రహస్యమంతా ఆచరణలో సత్ప్రవర్తనలో ఉంది. అవకాశం ఉన్న మేరకు, పరులకు మేలు చేయడమే రాజకీయ జీవిత పరమార్థం. అదే నిజమైన ఫిలాసఫీ. గొప్పతనం గొప్పలు చెప్పుకోవడం, చెప్పించు కోవడం కాదు. గొప్పగా చేసి చూపిస్తేనే గొప్పవారు అవుతారు. "హ్యాట్సాఫ్ టు ద రియల్ పబ్లిక్ సర్వెంట్".

# భారత స్వాతంత్ర్యానికి స్ఫూర్తి

ఆధునిక భారతదేశ చరిత్రలో బ్రిటిష్ వలస పాలన, విధానాలకు వ్యతిరేకంగా జరిగిన గొప్ప చారిత్రక సంఘటనే '1857 సిపాయిల తిరుగుబాటు'. బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ... బెంగాలు నవాబు, ఆయన ఫ్రెంచి మిత్రుల కూటమికి 1757 జూన్ 23న ప్లాసీ నిర్ణయాత్మక యుద్ధం జరగగా, తర్వాత వందేళ్లకు ఈ తిరుగు బాటు చోటు చేసుకుంది. దీనినే 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం', 'సిపాయిల పితూరి', 'విప్లవోద్యమం'గా చరిత్రకారులు అభివర్ణించారు. వీరసావర్కర్ తాను రచించిన గ్రంథం ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ లో సిపాయిల తిరుగుబాటు ప్రథమ స్వాతంత్ర్య సమరమని పేర్కొనడం జరిగింది. ఉత్తర, మధ్య భారతదేశంలో బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధం వైఫల్యంతో ముగిసింది.1857 మే 10 న మీరట్‌లో సిపాయిలతో మొదలైన తిరుగుబాటు, ఉత్తర గంగా మైదానంలోను, మధ్య భారతంలోనూ పౌర తిరుగుబాటుగా మారి. తూర్పు భారత దేశంలో కూడా తిరుగుబాటు విస్తరించి, ఆయా ప్రాంతాల్లో బ్రిటిషు వారి అధికారాన్ని పెద్ద ఎత్తున సవాలు చేసి,1858 జూన్ 20 న తిరుగుబాటు దార్లను ఓడించడంతో ముగిసింది. హత్యలకు పాల్పడిన వారికి తప్ప తిరుగు బాటులో పాల్గొన్న మిగతా వారందరికీ బ్రిటిషు ప్రభుత్వం 1858 నవంబరు 1 న క్షమాభిక్ష మంజూరు చేసింది. యుద్ధం ముగిసినట్లు ప్రకటించినది మాత్రం 1859 జులై 8 నే. 1856 డిసెంబరులో బ్రిటిష్ పాలకులు రాయల్ ఎన్ఫీల్డ్ (పి/53 లీ ఎన్ఫీల్డ్ రైఫిల్ 557 కాలిబర్) తుపాకీని ప్రవేశ పెట్టారు. దానికి వాడే తూటాల చివరి భాగాన్ని నోటితో కొరికి ఉపయోగించాల్సి ఉండేది. ఈ తుటాల చివర ఆవు పంది కొవ్వు పూసినట్లు వదంతులు వ్యాపించాయి. ఆవు హిందువులకు పవిత్రం, పంది ముస్లింలకు నిషేధం. కాబట్టి తూటాలను కొరకడాన్ని భారతీయ సిపాయిలు నిరాకరించారు. ఈ కొత్తరకం తుపాకులు ఇంగ్లండ్ లో ఆయుధ ఫ్యాక్టరీలో తయారయ్యేవి. ఇది హిందూ, ముస్లిం సైనికులను క్రైస్తవులుగా మార్చడానికి పన్నిన కుట్రగా భావించిన సిపాయిలు తిరుగుబాటుకు పూనుకున్నారు. అయితే బ్రిటీష్ వారు ఆ తూటాలను మార్చామనీ, కొవ్వులను తేనె పట్టునుండి లేదా నూనె గింజల నుండి సొంతంగా తయారు చేసుకోవటాన్ని ప్రోత్సహించామని చెప్పినప్పటికీ అవి సిపాయిలకు నమ్మకాన్ని కలిగించలేక పోయాయి. 1857 మార్చినెలలో 34వ దేశీయ పదాతి దళానికి చెందిన మంగళ్ పాండే అనే సైనికుడు బ్రిటిష్ సార్జంట్ మీద దాడిచేసి ఆయన సహాయకుని గాయ పరచాడు. జనరల్ హెన్రీ మంగళ్ పాండేను మతపిచ్చి పట్టినవాడిగా భావించి, మంగళ్ పాండేను బంధించమని జమేదార్ని ఆజ్ఞాపించటం, జమేదార్, హెన్రీ ఆజ్ఞను తిరస్కరించటంతో తిరుగుబాటు ప్రారంభానికి అంకురార్పణ జరిగింది. బ్రిటిష్ వారు మంగళ్ పాండేను, జమేదారును ఏప్రిల్ 8న ఉరితీసి, దళం మొత్తాన్నీ విధులనుండి బహిష్కరించారు. మే 10న 11వ, 20వ అశ్వదళం సమావేశమై అధికారులను ధిక్కరించి 3వ పటాలాన్ని విడిపించారు. మే 11న ఇతర భారతీయులతో కలసి సిపాయిలు ఢిల్లీ చేరుకొని చివరి మొగలు చక్రవర్తి బహదూర్ షా నివాసమైన ఎర్రకోటని ఆక్రమించి చక్రవర్తిని ఢిల్లీసుల్తాన్ గా తిరిగి అధికారాన్ని స్వీకరించాల్సిందిగా వత్తిడి చేసారు. బహదూర్ షా తొలుత అంగీకరించక పోయినా, తరువాత ఒప్పుకొని తిరుగు బాటుకు నాయకత్వాన్ని వహించాడు. 1857 మే 10న మీరట్లోని బెంగాల్ అశ్విక దళంలో కొందరు సైనికులు ఢిల్లీ వైపు రావడంతో ప్రారంభమైన తిరుగుబాటు, వేగంగా ఉత్తర భారతం మొత్తానికి నిస్తరించింది. మీరట్, ఝాన్సీ, కాన్పూర్, లక్నోలు తిరుగుబాటు తలెత్తిన ముఖ్య ప్రాంతాలు. బ్రిటిష్ వారు మొదట వేగంగా స్పందించనప్పటికీ, తరువాత తీవ్రమైన బల ప్రయోగంతో తిరుగు బాటుని అణచి వేసేందుకు యత్నించారు. వారు క్రిమియన్ యుద్ధంలో పాల్గొన్న పటాలాలనీ, చైనా వెళ్ళేందుకు బయలు దేరిన ఐరోపా పటాలాలని తిరుగు బాటును అణచి వేసేందుకు వినియోగించారు. తిరుగుబాటు దారుల ప్రధాన సైన్యానికి, బ్రిటిష్ వారికీ ఢిల్లీకి దగ్గరలోని బద్-కీ-సరై లో యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో బ్రిటిష్ సైనికులు మొదట తిరుగుబాటు దారులను ఢిల్లీకి పారద్రోలి తరువాత ఢిల్లీని ఆక్రమించారు. ఢిల్లీ ఆక్రమణ జులై 1న ప్రారంభమై ఆగస్టు 31 న పూర్తయింది. ఒకవారం పాటు అడుగడుగునా వీధిపోరాటం జరిగింది. అయితే తిరుగుబాటు దారుల మీద బ్రిటీష్ వారు విజయం సాధించి నగరాన్ని తిరిగి ఆక్రమించారు. జూన్ 20న గ్వాలియర్లో చివరి ముఖ్య పోరాటం జరిగింది. ఈ పోరాటంలో రాణీ లక్ష్మీబాయి మరణించింది. అయితే చెదురు ముదురు పోరాటాలు 1859 లో తిరుగుబాటు దారులను పూర్తిగా అణచివేసే వరకూ జరిగాయి. నానా సాహిబ్, రావ్ సాహిబ్ పరివారము, తాంతియా తోపే, రాణీ ఝాన్సీ లక్ష్మీబాయి, కున్వర్సింగ్, బీహారులోని రాజపుత్ర నాయకుడైన జగదీష్ పూర్, ప్రాణ్ సుఖ్ యాదవ్ మరియూ రెవారి తదితరులు బ్రిటిష్ వారిని ఎదిరించారు.1857 తిరుగుబాటు భారతదేశ చరిత్రలో ఒక ముఖ్య మలుపు. బ్రిటిషు వారు ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలనను రద్దుచేసి విక్టోరియా రాణి పరిపాలనను ప్రవేశ పెట్టారు. భారత పాలనా వ్యవహారాలను చూసుకోవటానికి వైస్రాయిని నియమించారు. ఈవిధంగా భారత దేశం నేరుగా బ్రిటిషు పాలనలోకి రావడానికి తిరుగు బాటు కారణ భూతమయింది..

## పవన శక్తిని ఒడిసిపడదాం !

గాల్లో మండి శక్తిని ఇవ్వగల పదార్థాన్ని ఇంధనంగా నిర్వచిస్తాం. ఆది మానవుడి నుంచి నేటి వరకు బొగ్గు, వంట చెరుకు, పెట్రోల్, డిసిల్, కిరోసిన్. వంట గ్యాసు లాంటి ఘన/ద్రవ/వాయు పదార్థాలను ఇంధనాలుగా మాడుతూ వస్తున్నాం. భూమి పొరల్లోంచి తవ్వి తీసిన బొగ్గు, పెట్రోలియం లాంటి ఉత్పత్తులను శిలాజ ఇంధనాలుగా పిలుస్తున్నాం. నేడు విద్యుత్ వినియోగమే ప్రజల జీవనాధారంగా మారిన వేళ శిలాజ ఇంధనాల కొరతతో పాటు వాటి వాడకం వల్ల జరుగుతున్న పర్యావరణ విధ్వంసం వల్ల తరిగే సాంప్రదాయ పునరుత్పాదకత సాధించలేని శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గిస్తూనే తరగని, సాంప్రదాయేతర, పునరుత్పాదక శక్తి వనరుల పట్ల మానవ ఆలోచనలు వెళ్లవలసిన అగత్యం ఏర్పడింది. నేడు పునరుత్పాదక శక్తి వనరులుగా సౌర, పవన, అలల, జియోథర్మల్, హైడ్రో, బయోమాస్ లాంటివి నిలుస్తున్నాయి. గాలులు వీచినపుడు వచ్చే పవనాలతో గాలి మరలను లేదా విండ్ మిల్స్‌ను అమర్చి విద్యుత్తు శక్తిగా మార్చడం అనాదిగా జరుగుతూ వస్తున్నది. నెథర్‌లాండ్స్‌లో ప్రారంభంపైన విండ్ మిల్స్ విప్లవం నేడు ప్రపంచ దేశాలన్నింటిలో ప్రవేశిస్తున్నది. పవన శక్తిని ఒడిసి పట్టే సునాయాస విండ్ మిల్స్ లేదా గాలి మరలకు విస్తృత ప్రచారం కలిపించడానికి ప్రతి ఏట 10 మే రోజున "జాతీయ విండ్ మిల్ లేదా గాలి మరల దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. పర్యావరణ హిత, గ్రీన్, క్లీన్ ఎనర్జీగా లభస్తున్న పవన శక్తిని విండ్ మిల్స్ ద్వారా గ్రామీణ, మునిసిపల్, ఇతర విభాగాల్లో విద్యుత్ లేదా ఇతర రూపాల్లో వాడడం కొనసాగుతున్నది. నాటి విండ్ మిల్స్‌కు సాంకేతిక సొబగులు అద్ది అత్యాధునిక విండ్ టర్బైన్స్‌ను కూడా రూపొందించి ముందుకు సాగడం జరుగుతోంది. సహజ పవన గమనాలకు అనుగుణంగా గతిశక్తిని గాలి మరలను అమర్చి పర్యావరణహిత, హరిత, శుద్ధ విద్యుత్తు శక్తిని ఉత్పత్తి చేయడం నేడు సర్వత్రా కనిపిస్తున్న దృశ్యాలు. భూతాపానికి గ్రీన్ హౌజ్ వాయువుల ఉద్గారకాలను తగ్గించడం, కార్బన్ ఎమిషన్స్‌ను కట్టడి చేయడం, ఖర్చు తక్కువ కావడం, మేయింటెనెన్స్ సులభం కావడం, శక్తి అవసరాలను తీర్చడం, భూభాగానికి సహకరించడం, విండ్ మిల్స్ స్థాపన సులభం కావడం, ఉద్యోగాల కల్పన జరగడం లాంటి పలు ప్రయోజనాలు కలిగిన పునరుత్పాదక పవన శక్తి ఉత్పత్తితో పాటు వాడకాన్ని కూడా ప్రోత్సహించడం నేటి అవసరంగా మారింది. గాలి మరల వాడకంతో వన్యప్రాణుల సహజత్వానికి విఘాతం కలగడం, శబ్ద కాలుష్యానికి కారణం కావడం, ఎత్తైన ప్రదేశాల్లో భూమి అనుకూలంగా ఉండడం లాంటి ప్రతికూలాలు ఉన్నప్పటికీ పనవ శక్తిని విద్యుత్ రూపంలోకి మార్చడం విధిగా జరగాలి. ప్రపంచవ్యాప్తంగా 80 శాతం అత్యధిక పవనశక్తిని ఉత్పత్తి చేస్తున్న ఐదు దేశాల్లో జర్మనీ, అమెరికా, డెన్మార్క్, స్పెయిన్, భారత్ ఉన్నాయి. భారత్‌లో పవనశక్తిని అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రాల జాబితాలో ఏపి, గుజరాత్, కర్నాటక, ఎంపీ, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళ నాడులు ముందున్నాయి. భారత పునరుత్పాదక శక్తి వనరుల మంత్రిత్వశాఖ లక్ష్యాల ప్రకారం 2030 నాటికి 30 జిడబ్ల్యూ పవన శక్తిని ఒడిసి పట్టడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. విండ్ టర్బైన్స్ ద్వారా పవనంలో దాగిన గతి శక్తిని, తొలుత యాంత్రిక శక్తిగా మార్చడం, యాంత్రిక శక్తిని విద్యుత్తు శక్తిగా మార్చడం భారతంలో విస్తృతంగా జరుగుతున్నది. పర్యావరణ హిత, గ్రీన్, క్లీన్, తరగని, పునరుత్పాదక పవన శక్తిని వీడడం వల్ల ప్రత్యక్షంగా కార్బన్ ఉద్గారాలు తగ్గిపోయి ప్రతికూల వాతావరణ మార్పులు అదుపు చేయబడతాయి. సులభంగా, ఉచితంగా, విరివిగా అందుబాటులో ఉన్న పవన శక్తిని విద్యుత్‌గా మార్చడం వల్ల వ్యక్తిగత శక్తి స్వేచ్ఛ లభిస్తుంది. నేడు సోలార్ పవర్ ప్లాంట్ల వలె విండ్ పవర్‌ను వాడడం కూడా బహుళ ప్రచారంలోకి రావాలి, రేపటి పరిశుద్ధ పర్యావరణానికి పునరుద్ధరణ జరగాలి.

## బంగారం దుకాణంలో చోరీ

నల్గొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలోని గోల్డ్ షాప్ తాళాలు పగలకొట్టి చోరీకి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది.అర్ధరాత్రి షాప్ లోకి ప్రవేశించిన దొంగలు సుమారు 30 తులాల బంగారాన్ని దోచుకున్నారు.ఉదయాన్నే షాప్ కి వచ్చిన యజమాని బ్రహ్మయ్య తాళాలు పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు.సంఘటన స్థలానికి చేరుకున్న వాడపల్లి పోలీసులు షాపును పరిశీలించి క్లూస్ టీమ్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మోటారు వైర్లను దొంగిలించిన దొంగలు

చౌటుప్పల్ యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం యస్ లింగోటం గ్రామ శివారులోని కురుమ గూడెంలో అర్ధరాత్రి వ్యవసాయ బావుల వద్ద 23 మోటార్ల వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. మొన్న అర్ధరాత్రి 36 మంది రైతుల వ్యవసాయ బావుల వద్ద వైర్లను ఎత్తుకెళ్లిన ఘటన మరువక ముందే అదే గ్రామంలో మళ్ళీ 23 మోటార్ల వైర్లను దొంగిలించారు.ఉదయం పూట వ్యవసాయ బావుల వద్ద వెళ్ళగానే మోటార్లకి వైర్లు లేకపోవడంతో దొంగలు పడ్డారని గమనించిన రైతులు పోలీసుల ఫిర్యాదు చేసారు. దొంగతనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఆపరేషన్ సిందూర్': అద్భుతమైన సైకత శిల్పరూపం

పూరీ 'ఆపరేషన్ సిందూర్'లో భారత విజయాన్ని ప్రతిబింబించేలా ఒడిశా సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ అద్భుత శిల్పం రూపొందించారు. పూరీ బీచ్ లో ఆరు అడుగుల ఈ శిల్పంలో భారతమాత నుదుటి సింధూరం శక్తిగా మారి శత్రువును ధ్వంసం చేసిన దృశ్యాన్ని ఆకర్షణీయంగా చూపించారు. "భారత్ మాతా కీ జై.. న్యాయం లభించింది" అనే క్యాప్షన్తో ఈ శిల్పం వీడియోను ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేయగా, నెటిజన్ల ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# యాక్టివ్ పాలిటిక్స్ కు దూరమేనా....

విజయవాడ, మే 9,ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకోన్నారని తెలిసింది. ఇక దేశ రాజకీయాల వైపు చూస్తున్నారా? కేంద్ర మంత్రిగా వెళ్లాలనుకుంటున్నారా? అంటే జరుగుతున్న పరిణామాలు అదే చెబుతున్నాయి. రానున్న కాలంలో ఇక్కడ జనసేన, టీడీపీ, బీజేపీ కలసి పోటీ చేసినప్పటికీ తాను రాష్ట్ర రాజకీయాల నుంచి దూరంగా ఉండాలని ఆయన భావిస్తున్నట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ లో ఉప ముఖ్యమంత్రిగా ఉండే కంటే కేంద్రంలో మంత్రి పదవి తీసుకుని దేశ వ్యాప్తంగా పర్యటిస్తూ ఇటు బీజేపీతో పాటు జనసేనను కూడా బలోపేతం చేయాలని ఆయన భావిస్తున్నారని అంటున్నారు. అందుకోసమే తన సోదరుడు నాగబాబును ఇక్కడి పార్టీని పర్యవేక్షించేందుకు ఎమ్మెల్సీ చేశారంటున్నారు.ఆంధ్రప్రదేశ్ లో ఎన్నాళ్లున్నా ఇక ఉప ముఖ్యమంత్రి పదవితో సరిపెట్టుకోవాల్సి వస్తుంది. పార్టీ అభిమానులు, కాపు సామాజికవర్గం నుంచి తనను ముఖ్యమంత్రి కావాలని బలంగా కోరుకుంటున్నారు. కానీ అనుభవం ఉన్న చంద్రబాబు ఉన్నసమయంలో తాను ముఖ్యమంత్రి పదవి చేపట్టలేరు. అందుకే పవన్ కల్యాణ్ కూడా తరచూ మరో పదిహేనేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉండి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని చెబుతున్నారంటున్నారు. చంద్రబాబు ఇక్కడ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ తాను కేంద్ర మంత్రిగా వెళితే రాష్ట్రానికి కూడా కొంత ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు. దీంతో పాటు ఇక్కడ తన సోదరుడు నాగబాబును మంత్రిని చేస్తే ఆయన పార్టీతో పాటు కూటమి నేతలకు దగ్గరగా ఉండే అవకాశముంటుందని ఆలోచిస్తున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పదవి అంటే ఆరోవేలుగా అందరూ అభివర్ణిస్తారు.మంత్రికి మించి ఉప ముఖ్యమంత్రికి ప్రత్యేకించి ఎటువంటి అధికారాలుండవు. అదే కేంద్ర మంత్రి అయితే ముఖ్యమంత్రి తో సమానమైన హోదా ఉంటుంది. దీంతో పాటు ప్రొటోకాల్ కూడా ఉంటుంది. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం, తనను అభిమానించడం వల్లనే కొంత ప్రాధాన్యత ఇస్తున్నా ఈ పదవి అంటేనే పవన్ కల్యాణ్ కు మొహం మొత్తిందని అంటున్నారు. ఎన్నాళ్లు చేసినా ఉప ముఖ్యమంత్రి పదవితో సరిపెట్టుకోవాల్సి వస్తుంది తప్ప ఎదుగుదల ఉండదని, అదే మోదీ కేబినెట్ లోకి వెళితే కొంత ఇమేజ్ కూడా పెరుగుతుందని పవన్ కల్యాణ్ భావిస్తున్నారని సమాచారం. అయితే ఇప్పటికిప్పుడు కాకపోయినా వచ్చే ఎన్నికల్లో పార్లమెంటు కు పోటీ చేయాలన్న ఆలోచన చేస్తున్నారని అంటున్నారు.మరోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి ఖచ్చితంగా వస్తుందన్న నమ్మకమే ఈ ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. అందుకే పవన్ కల్యాణ్ బీజేపీ లైన్ లోకి వెళ్లారంటున్నారు. సనాతన ధర్మం అంటూ ఆయన నినాదాన్నిచేయడం కూడా ఇందులో భాగమేనని చెబుతున్నారు. మరొకవైపు నరేంద్ర మోదీ కూడా తనంటే మంచి అభిప్రాయం ఉంది. మోదీ గుడ్ లుక్స్ లో ఉన్నారు. ఈ సమయంలో మోదీ కేబినెట్ లో మంత్రిగా చేరితే కొంత వెసులుబాటు దొరుకుతుందని, రాష్ట్ర రాజకీయాలకు అవసరమైతే తర్వాత రావచ్చన్న యోచనలో పవన్ కల్యాణ్ ఉన్నారంటున్నారు. మొత్తం మీద పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికల్లో కాకినాడ పార్లమెంటు నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం కూడా ఊపందుకుంది.

# ఇక సీరియస్ యాక్షన్

విజయవాడ, మే 9, వైసీపీ అధినేత వైఎస్ జగన్ నేడు తరచూ ఒకే మాట చెబుతున్నారు. తాను మారానని అంటున్నారు. అంటే గతంలో తాను చేసిన తప్పులేమిటో ఆయన అర్థం చేసుకునట్లే ఉంది. ఎందుకంటే మారానంటూ ఆయన ఏ నేతలతో సమావేశమైనా ఇదేరకమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. నేతలకు దూరంగా ఉండటం, కార్యకర్తలతో టచ్ మీ నాట్ అంటూ వ్యవహరించడంతో పాటు ప్రజలకు కూడా దూరమై కేవలం తాడేపల్లి లోని క్యాంప్ కార్యాలయానికే ఆయన అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు పనిచేశారు. అప్పుడు ఎవరి మాట చెవికెక్కించుకోలేదు. అధికారులను చుట్టూపెట్టుకుని వారు ఆడినట్లే ఆడారు. దాని ఫలితంగానే దారుణమైన ఓటమిని చవి చూడాల్సి వచ్చింది.దీంతో పాటు చుట్టూ కోటరీ కూడా జగన్ ఓటమికి కారణమయింది. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు జగన్ దృష్టికి వారు తీసుకెళ్లలేదు. అంతేకాదు.. జగన్ ఏం చెప్పినా దానికి ఊ కొట్టడమే తప్పించి అలా కాదు.. ఇలా చేస్తే బాగుంటుందన్న సలహాలు, సూచనలు చేసిన వారు కూడా లేరు. అసలు జగన్ వింటారని అనుకోలేం కానీ కానీ కనీసం ఆ ప్రయత్నం చేసిన నేతలు కూడా లేరు. అధికారంలో ఉన్నప్పుడు ఆ వ్యవహారం నడిచింది. అయితే అధికారం కోల్పోయిన తర్వాత తాను ఏం తప్పులు చేశారో ఇప్పుడు అర్థమవుతుంది. తాను తీసుకున్న నిర్ణయాలతో ఎంత మంది బాధపడ్డారు.. తన విజయం కోసం పనిచేసిన వారే ఆర్థికంగా నష్టపోయారన్న విషయం జగన్ కు ఇప్పటి కాని తెలిసి రాలేదుదీంతో రాష్ట్రంలో సంక్షేమ పథకాలను భారీ స్థాయిలో అమలు చేసినా ప్రజలు గెలిపించకపోవడానికి అనేక కారణాలున్నాయి. నలభై శాతం ఓట్లు వచ్చాయని, మూడు పార్టీలు కలవడంతోనే కూటమి గెలిచిందని నచ్చ చెప్పుకున్నప్పటికీ నాడు తాను చేసిన పనుల కారణంగానే పది శాతం ఓట్లు పూర్తిగా దూరమయ్యాయన్నది అర్థమయింది. ప్రధానంగా మధ్యతరగతి, కొన్ని సామాజికవర్గాల వారిని జగన్ కావాలని దూరం చేసుకున్నారు. ఇక అనేక చోట్ల వైసీపీ ఎమ్మెల్యేలు, కొందరు నేతలు భూ కబ్జాలకు పాల్పడుతున్నా పట్టించుకోలేదు. ఒకటి రెండు ఫిర్యాదులు వచ్చినా భూ కబ్జాలు చేసిన వారిని వెనకేసుకు వచ్చారు. దీంతో తమఆస్తులకు రక్షణ లేకుండా పోయిందన్న అభద్రత నెలకొంది.మరొక వైపు వాలంటీర్లు దారుణంగా పార్టీని దెబ్బతీశారు. తాజాగా మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ కూడా వాలంటీర్ల వల్లనే తాము ఓడిపోయామని చెప్పారంటే జగన్ కు అర్థం కాకుండా ఉంటుందా? వాలంటీర్లే అన్నీ పనులు చేస్తుంటే కార్యకర్తలతో ప్రజలకు పనిలేకుండా పోయింది. ఎమ్మెల్యేలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. దీంతో మరొకసారి తాను గెలుద్దామని అనుకుంటే.. వాలంటీర్లు కూడా ఎన్నికల్లో సహకరించకుండా ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించింది. దీంతో ఓటర్లు చంద్రబాబు ఇచ్చిన హామీలకు అటు వెళ్లిపోయారు. ఇప్పుడు జగన్ మారారంటున్నారు. అధికారంలోకి వస్తే తాను కార్యకర్తలకు పెద్దపీట వేస్తానని చెబుతున్నారు. వారికి ప్రాధాన్యత ఇస్తానని అంటున్నారు. అదే సమయంలో తనను నమ్ముకున్న వారికి అన్యాయం చేయనని పదే పదే చెబుతున్నారు. మరి ఏం జరుగుతుందన్నది భవిష్యత్ సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

# జనాలకు దూరంగా మంత్రులు

నెల్లూరు, మే 9, కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రమే యాక్టివ్ గా ఉంటే సరిపోదు. మంత్రివర్గంలోని అందరు సభ్యులు సమిష్టిగా అడుగులు వేస్తేనే కూటమి ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో గట్టెక్కుతుంది. వన్ మ్యాన్ షో ఇప్పుడు పనికి రాదు. గత ప్రభుత్వంలో జరిగిన లోటు పాట్లు ఈ ప్రభుత్వంలో కంటిన్యూ అవుతున్నాయి. చంద్రబాబు నాయుడు ఏ జిల్లాకు వెళ్లినా అక్కడ పార్టీ నేతలు, కార్యకర్తలతో మాత్రం ఖచ్చితంగా సమావేశమవుతున్నారు. కానీ మంత్రులకు మాత్రం తీరిక లేదు. రిబ్బన్ కట్ చేసి జిల్లాల నుంచి వెనుదిరిగి వస్తున్నారు. దీంతో చంద్రబాబు మంత్రుల విషయంలో గత కొన్ని నెలలు చేస్తున్న హెచ్చరికలు కూడా పనిచేయడం లేదన్నది తెలుగుదేశం పార్టీ లో వినిపిస్తున్న టాక్.అనేక జిల్లాల్లో టీడీపీ నేతల మధ్య వైరం తారా స్థాయికి చేరుకుంది. ఒకరంటే ఒకరికి పడటం లేదు. ఎమ్మెల్యేలు కూడా ముఖ్యనేతలను, కార్యకర్తలను కలుపుకుని వెళ్లడం లేదు. ఇసుక, మద్యం వంటి వ్యాపారాల్లో కొందరు ఎమ్మెల్యేలు ఉండి పార్టీ నేతలను, కార్యకర్తలను పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై పార్టీ కేంద్ర నాయకత్వానికి అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. అనేక చోట్ల గ్రూపులుగా విడిపోయి పార్టీ పిలుపు నిచ్చిన కార్యక్రమాలు కూడా వేర్వేరుగా జరుపుకుంటున్నారు. ఈ విషయం మంత్రుల దృష్టికి వచ్చినా పట్టించుకోవడం లేదు. జిల్లా ఇన్ ఛార్జి మంత్రులు కానీ, ఆ జిల్లాకు చెందిన మంత్రులు కానీ తమకెందుకు వచ్చిందన్న ధోరణిలో ఉన్నారుమరొకవైపు కూటమి నేతల మధ్య కూడా సయోధ్య లేదు. అనేక జిల్లాల్లో విడివిడిగానే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఎవరి జెండా వారిదే. ఎవరి అజెండా వారిదే. ఈ విషయంలోనూ మంత్రులు పట్టించుకోవడం లేదు. చంద్రబాబు పార్టీ అధినేతగా చిన్న చిన్న విషయాలను సర్దు చాటు చేసే సమయం ఉండదు. వాటిని మంత్రులు దగ్గరుండి సమయం వెచ్చించి కూర్చుని మనసు పెట్టి పని చేస్తే చాలా వరకూ విభేదాలు సమసిపోతాయి. చిన్న చిన్న సమస్యలే అయినా వాటిని పరిష్కరించే వారు లేక మరింత తీవ్రమై గ్యాప్ పెరిగి పార్టీకి నష్టం చేకూర్చే విధంగా తయారవుతున్నాయి. ఈ ప్రభావం వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా ఉండే అవకాశముంది.మంత్రులకు ఫ్రీ హ్యాండ్ లేదా? అంటే దానికి పార్టీ నాయకత్వం నుంచి ఒకటే సమాధానం వస్తుంది. అసలు సమస్యపై దృష్టి పెడితే కదా? అది తీవ్రమైనదా? లేదా చిన్న సమస్య అని తెలిసేది అని సీనియర్ నేత

ఒకరు వ్యాఖ్యానించారు. అసలు ప్రయత్నించకపోవడమే ఈ పరిస్థితికి కారణమని అంటున్నారు. గతంలోనూ వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గాలలో పార్టీ నేతల మధ్య నెలకొన్న విభేదాలే మొన్నటి ఎన్నికల్లో ఆ పార్టీ కొంప ముంచాయి. ఇప్పుడు అదే పరిస్థితి టీడీపీలోనూ ఉంది. అందుకే మంత్రి వర్గ సమావేశంలో చంద్రబాబు ఈ విషయంలో మంత్రులకు క్లాస్ పీకారని చెబుతున్నారు. ఏదైనా పెద్ద సమస్య ఉంటే తన వద్దకు తేవాలని, చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని చెబుతున్నా మంత్రులు చెవికి ఎక్కించుకోవడం లేదు.

# మద్యం స్కాం... అందరూ ఇరుక్కున్నట్టేనా

గుంటూరు, మే 9,ఏపీ మద్యం కుంభకోణంలోకీలక పరిణామం. ఇప్పటికే వైసీపీ ప్రభుత్వంలో మద్యం కుంభకోణం జరిగినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ తేల్చింది. రూ.3200 కోట్ల లిక్కర్ స్కాం జరిగినట్లు నిర్ధారించింది. కీలక అరెస్టులను సైతం పూర్తి చేసింది. త్వరలో ఎలక వ్యక్తిని అరెస్టు చేస్తారని ప్రచారం జరిగింది. ఇలాంటి సమయంలో ఓ ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది. మనీలాండరింగ్ చట్టం కింద దర్యాప్తు చేసేందుకు ఎన్ఫోర్స్మెంట్ డైరెక్ట్ సిద్ధమవుతోంది. ఇప్పటివరకు జరిగిన విచారణలో తేలిన అంశాలు, ఆధారాలు తమకు ఇవ్వాలంటూ సిట్ ను ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ కోరినట్లు తెలుస్తోంది.విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటైన సంగతి తెలిసిందే. గత కొద్దిరోజులుగా మద్యం కుంభకోణానికి సంబంధించి సమగ్ర దర్యాప్తు ఈ బృందం చేస్తోంది. ముఖ్యంగా రాజ్ కసిరెడ్డి అరెస్టు తర్వాత ఈ మొత్తం కుంభకోణం పై ఒక నిర్ధారణకు వచ్చింది ప్రత్యేక దర్యాప్తు బృందం. ఈ తరుణంలో ఈడి ఎంట్రీ ఇచ్చింది. మొత్తం వివరాలను తమకు ఇవ్వాలని ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ కోరినట్లు తెలుస్తోంది. సిట్ అధిపతిగా ఉన్న విజయవాడ కమిషనర్ కు లేఖ రాసినట్లు సమాచారం. దీంతో త్వరలో ఈ వివరాలను వీడితో కూడా పంచుకునేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ సిద్ధమవుతోంది. సిట్ నుంచి వివరాలు రాగానే ఈడి ఈ కేసును మనీ లాండరింగ్ చట్టం కింద నమోదు చేసి దర్యాప్తు చేయనుంది.కూటమి( అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం కుంభకోణం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. సిఐడి దర్యాప్తు చేసింది. ప్రాథమిక వివరాలను వెల్లడించింది. అయితే సిఐడి దర్యాప్తు ఒక్కటే చాలదని.. ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ కూడా అవసరమని భావించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొత్తం ప్రాథమిక అంశాలతో పాటు లోతైన విచారణ జరిగింది. ఈ నేపథ్యంలోనే ఈడి ఎంట్రీ ఇచ్చింది. నమోదు చేసిన ఎఫ్ఐఆర్ తో పాటు సీజ్ చేసిన బ్యాంక్ ఖాతాల వివరాలు కూడా కోరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే సూత్రధారిగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి, ఆయన అనుచరుడు మహిళా దిలీప్ కూడా అరెస్టు అయ్యారు. వీరితోపాటు మాజీ సీఎం జగన్కు కార్యదర్శిగా పనిచేసిన ధనుంజయ రెడ్డి, ఓ ఎస్ డీ గా పని చేసిన కృష్ణమోహన్ రెడ్డి, మరో నిందితుడు గోవిందప్ప అరెస్టుకు రంగం సిద్ధమవుతోంది. వీరికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో అరెస్టు చేసేందుకు సిట్ గాలిస్తోంది.వాస్తవానికి కూటమి ప్రభుత్వం పక్కా ఆధారాలతో వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో మద్యం కుంభకోణం జరిగినట్లు గుర్తించింది. కీలక నేత హస్తం ఉందని అనుమానిస్తోంది. పార్లమెంటులో టిడిపి పక్ష నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ఈ అంశంపైనే మాట్లాడారు. అటు తరువాత కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షాను కలిసి కీలక ఆధారాలు చూపించారు. అప్పటినుంచి మద్యం కుంభకోణం వేగవంతం అయ్యింది. సిట్ దూకుడుగా అడుగులు వేస్తోంది. అరెస్టులు సైతం కొనసాగాయి. ఇప్పుడు మనీ లాండరింగ్ కింద ఈడి ఎంటర్ కావడంతో.. కేసు మరింత బిగిసుకునే పరిస్థితి ఉంది.

# ఉభయగోదావరి జిల్లాలే లక్ష్యంగా పావులు

కాకినాడ, మే 9, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటోంది. ఓటమి నుంచి చాలా రకాలుగా గుణ పాఠాలు నేర్చుకుంది. ముఖ్యంగా అధినేత జగన్మోహన్ రెడ్డి ఓటమి బాధ నుంచి బయటకు వచ్చారు. పార్టీని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయంగా కూడా వేగం పెంచుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న తరుణంలో ప్రజల మధ్యకు వచ్చి పోరాటం చేయాలని భావిస్తున్నారు. త్వరలో జిల్లాల పర్యటనకు సిద్ధపడుతున్నారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని చూస్తున్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పరిశీలకులను నియమించారు. జిల్లా అధ్యక్షులతో సమన్వయం చేసుకొని పార్టీని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అనుబంధ విభాగాలను భర్తీ చేయాలని చూస్తున్నారు. ఇవి కొలిక్కి వచ్చిన తరువాత జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీనివచ్చే ఏడాది జూలైలో నిర్వహించాలని భావిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. జూలై 8న వైయస్సార్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించాలని ఒక నిర్ణయానికి వచ్చారు. పార్టీ ముఖ్య నేతల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఒకరకంగా పార్టీ ప్లీనరీని ఎన్నికల శంఖారావంగా జగన్ భావిస్తున్నారు. అందుకే ఘనంగా నిర్వహించి పార్టీ శ్రేణులతో పాటు ప్రజలకు ఎన్నికల పిలుపు ఇవ్వాలని చూస్తున్నారు. తెలుగుదేశం మహానాడు తరహాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీని నిర్వహించాలని చూస్తున్నారు. తద్వారా 2027 పాదయాత్ర ప్రకటన బహిరంగంగా అక్కడే ఇవ్వాలని భావిస్తున్నారు. 2017లో పాదయాత్ర ప్రకటన ఇలానే ప్లీనరీలో చేశారు.ఈసారి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్లేనరీని ఉభయగోదావరిజిల్లాలో నిర్వహించాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉభయ గోదావరి జిల్లాలో భారీ మూల్యం చెల్లించుకుంది. కనీసం ఖాతా తెరవలేదు. టిడిపి కూటమి క్లీన్ స్వీప్ చేసింది. జనసేన హవా ఇక్కడ కనిపిస్తోంది. ఇక్కడ ఆ రెండు పార్టీలతో పోలిస్తే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉంది. పైగా వైయస్సార్ కాంగ్రెస్ కీలక నేతలంతా పార్టీకి గుడ్ బై చెప్పారు. పార్టీ శ్రేణులు సైతం తీవ్ర నిరాశతో ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అక్కడ ప్లీనరీ నిర్వహించడం ద్వారా.. సరికొత్త సంకేతాలు పంపించాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారుప్రస్తుతం ఉభయగోదావరి జిల్లాల్లో కూటమి పార్టీల మధ్య సరైన సమన్వయం లేదు. ఒక్క పిఠాపురంలోతప్పించి.. మిగతా నియోజకవర్గాల్లో విభేదాలు కొనసాగుతున్నాయి. దానిని క్యాష్ చేసుకోవడం ద్వారా.. అసంతృప్త నేతలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు తిప్పాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. 2029 ఎన్నికల్లో ఉభయగోదావరి జిల్లాలే కీలకమని భావిస్తున్నారు. అందుకే అక్కడ ప్లీనరీ నిర్వహించాలని సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చారు.గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతంపై దృష్టి పెట్టారు జగన్మోహన్ రెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ నాయకులకు దిశ నిర్దేశం చేశారు. 2029లో కూటమి తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశం లేదని జగన్మోహన్ రెడ్డి తేల్చేశారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కేసులకు భయపడితే రాజకీయం చేయలేమని ఒక నిర్ణయానికి వచ్చారు. పార్టీని పూర్తిగా బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని పార్టీ నేతలకు ఆదేశించారు. 2027 నుంచి పాదయాత్ర 2.0 ప్రారంభిస్తానని కూడా ప్రకటించారు. పార్లమెంటరీ పరిశీలకులు జిల్లా అధ్యక్షులతో కలిసి పని చేయాలని ఆదేశించారు. పార్టీ కమిటీల నియామకాల్లో ఆయా జిల్లా అధ్యక్షులతో కలిసి పని చేయాలని కూడా సూచించారు.2019 ఎన్నికలకు ముందు ఉన్న వాతావరణం క్రియేట్ చేయాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. ఒకవైపు పాదయాత్ర ద్వారా ప్రజలతో మమేకమై.. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని చూస్తున్నారు. అదే సమయంలో ప్రజల్లో ప్రభుత్వం పై ఉన్న వ్యతిరేకతను వైయస్సార్ కాంగ్రెస్ వైపు టర్న్ చేయాలని భావిస్తున్నారు. మరోవైపు చంద్రబాబు విషయంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. క్యాడర్ కూడా నా దగ్గర నుంచి చంద్రబాబు తరహా రాజకీయాలు ఆశిస్తున్నారని చెప్పుకొచ్చారు. అయితే జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర ప్రకటనపై భిన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# సీనియర్లు రాజకీయ సన్యాసం

విశాఖపట్టణం, మే 9 వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటోంది. ఓటమి నుంచి చాలా రకాలుగా గుణ పాఠాలు నేర్చుకుంది. ముఖ్యంగా అధినేత జగన్మోహన్ రెడ్డి ఓటమి బాధ నుంచి బయటకు వచ్చారు. పార్టీని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయంగా కూడా వేగం పెంచుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న తరుణంలో ప్రజల మధ్యకు వచ్చి పోరాటం చేయాలని భావిస్తున్నారు. త్వరలో జిల్లాల పర్యటనకు సిద్ధపడుతున్నారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని చూస్తున్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పరిశీలకులను నియమించారు. జిల్లా అధ్యక్షులతో సమన్వయం చేసుకొని పార్టీని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అనుబంధ విభాగాలను భర్తీ చేయాలని చూస్తున్నారు. ఇవి కొలిక్కి వచ్చిన తరువాత జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీని వచ్చే ఏడాది జూలైలో నిర్వహించాలని భావిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. జూలై 8న వైయస్సార్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించాలని ఒక నిర్ణయానికి వచ్చారు. పార్టీ ముఖ్య నేతల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఒకరకంగా పార్టీ ప్లీనరీని ఎన్నికల శంఖారావంగా జగన్ భావిస్తున్నారు. అందుకే ఘనంగా నిర్వహించి పార్టీ శ్రేణులతో పాటు ప్రజలకు ఎన్నికల పిలుపు ఇవ్వాలని చూస్తున్నారు. తెలుగుదేశం మహానాడు తరహాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీని నిర్వహించాలని చూస్తున్నారు. తద్వారా 2027 పాదయాత్ర ప్రకటన బహిరంగంగా అక్కడే ఇవ్వాలని భావిస్తున్నారు. 2017లో పాదయాత్ర ప్రకటన ఇలానే ప్లీనరీలో చేశారు.ఈసారి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్లేనరీని ఉభయగోదావరి జిల్లాలో నిర్వహించాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉభయ గోదావరి జిల్లాలో భారీ మూల్యం చెల్లించుకుంది. కనీసం ఖాతా తెరవలేదు. టిడిపి కూటమి క్లీన్ స్వీప్ చేసింది. జనసేన హవా ఇక్కడ కనిపిస్తోంది. ఇక్కడ ఆ రెండు పార్టీలతో పోలిస్తే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉంది. పైగా వైయస్సార్ కాంగ్రెస్ కీలక నేతలంతా పార్టీకి గుడ్ బై చెప్పారు. పార్టీ శ్రేణులు సైతం తీవ్ర నిరాశతో ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అక్కడ ప్లీనరీ నిర్వహించడం ద్వారా.. సరికొత్త సంకేతాలు పంపించాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారుప్రస్తుతం ఉభయగోదావరి జిల్లాల్లో కూటమి పార్టీల మధ్య సరైన సమన్వయం లేదు. ఒక్క పిఠాపురంలో తప్పించి.. మిగతా నియోజకవర్గాల్లో విభేదాలు కొనసాగుతున్నాయి. దానిని క్యాష్ చేసుకోవడం ద్వారా.. అసంతృప్త నేతలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు తిప్పాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. 2029 ఎన్నికల్లో ఉభయగోదావరి జిల్లాలే కీలకమని భావిస్తున్నారు. అందుకే అక్కడ ప్లీనరీ నిర్వహించాలని సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చారు.

# కాశ్మీర్ లో డ్రోన్ల హల్ చల్

జమ్మూభారత్–పాక్ మధ్య యుద్ధవాతావరణం తారాస్థాయికి చేరుకుంది. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ తీసుకున్న చర్యతో కేంద్రం అప్రమత్తమైంది. సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ఠమైన జాగ్రత్త చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో జమ్మూకశ్మీర్ వాసి మాట్లాడుతూ.. 'రాత్రి తినే సమయంలో కొన్ని పేలుళ్ల శబ్దం వినిపించాయి. శుక్రవారం తెల్లవారుజామున మళ్లీ పేలుడు శబ్దం వినిపించింది. గాల్లో డ్రోన్లు ఎగురుతూనే ఉన్నాయి. మన ఆర్మీ బాగా పని చేస్తోంది.' అని అన్నారు.

# రంగంలోకి ఐఎన్ఎస్ విక్రాంత్

ముంబై, మే 9, (న్యూస్ పల్స్) భారత వైమానిక దళం తరువాత, ఇప్పుడు నావికాదళం కూడా రంగంలోకి వచ్చింది. అరేబియా సముద్రంలో మోహరించిన ఎెూ విక్రాంత్ కరాచీని లక్ష్యంగా చేసుకుని విధ్వంసం సృష్టించడం ప్రారంభించింది. నావికాదళ దాడి కారణంగా, కరాచీ ఓడరేవుతో సహా నగరంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. కరాచీతోపాటు ఒర్మారా ఓడరేవులపై క్షిపణులు ప్రయోగించింది భారత్ నావికా దళం.రక్షణ వర్గాల సమాచారం ప్రకారం, పాకిస్తాన్‌లోని కరాచీ, ఒర్మారా ఓడరేవులపై ఐఎన్ఎస్ విక్రాంత్ నుండి అనేక క్షిపణులను ప్రయోగించారు. దీని కారణంగా రెండు ఓడరేవులలో భారీ మంటలు చెలరేగాయి. ఈ దాడి కారణంగా, రెండు ఓడరేవు నగరాల చుట్టూ పొగ వ్యాపించింది. ప్రజలు భయాందోళనలతో తీర ప్రాంతాలను వదిలి బంకర్ల లోపలికి పరుగులు తీస్తున్నారు.పాకిస్తాన్ నావికాదళానికి కరాచీ, ఒర్మారాలో స్థావరాలు ఉన్నాయి. వారి ఉన్నతాధికారుల ప్రధాన కార్యాలయాలు, యుద్ధనౌకలు, జలాంతర్గాములు మోహరించిన చోటు ఇదే. ఈ రెండు నావికా స్థావరాలను నాశనం చేయడం ద్వారా, ఎెూ విక్రాంత్ పాకిస్తాన్ నావికాదళాన్ని చాలా వరకు కుంగదీయడంలో విజయం సాధించింది. ప్రస్తుతం భారత నావికాదళ ఆపరేషన్ కొనసాగుతోంది.అరేబియా సముద్రంలో ఐఎన్ఎస్ విక్రాంత్ మోహరింపు గురించి పాకిస్తాన్ ఇప్పటికే భయపడింది. ఈ విమాన వాహక నౌకను మోహరించడం అంటే 30 మిగ్ 29కె ఫైటర్ జెట్‌లను ఓవర్ హెడ్‌గా మోహరించడం. ఇది నీటిలో తేలియాడే భారతదేశపు భారీ వైమానిక స్థావరం. ఈ విమాన వాహక నౌకతో పాటు అనేక డిస్ట్రాయర్లు, ఫ్రిగేట్లు, ఇంధనం నింపే నౌకలు, జలాంతర్గాములు ఉన్నాయి. దీని కారణంగా ఈ యుద్ధనౌకను ఢీకొట్టడం దాదాపు అసాధ్యం.ఐఎన్ఎస్ విక్రాంత్ రంగంలోకి దిగితే అది మనుగడ సాగించడం కష్టమవుతుందని పాకిస్తాన్ భయపడింది. దీనికి కారణం పాకిస్తాన్ దగ్గర ఒక్క విమాన వాహక నౌక కూడా లేకపోవడమే. ఈ నౌక ఓతిఉ–29ఐ, ఐజీఏనీల–32, ఓఊ–60ఖీ, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్‌లతో సహా 30 రకాల విమానాలు, హెలికాప్టర్లను మోసుకెళ్లగలదు. దీనితో పాటు, ఇది తేలికపాటి యుద్ధ విమానాలను కూడా మోసుకెళ్లగలదు.

# శ్రీలక్ష్మికి కలిసి రాని కాలం



అనంతపురం, మే 9,ఓబులాపురం మైనింగ్ కేసులో గాలి జనార్దన్ రెడ్డి తో పాటు మరో ఐదుగురికి జైలు శిక్ష పడిన సంగతి తెలిసిందే. అయితే అంతకుముందే సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి ఈ కేసు నుంచి బయటపడ్డారు. కానీ ఆమె తాజాగా చిక్కుల్లో పడ్డారు. ఈ కేసు విషయంలో సుప్రీంకోర్టు నుంచి ఆమెకు షాకింగ్ న్యూస్ వచ్చింది. ఈ కేసు నుంచి గతంలో శ్రీలక్ష్మికి తెలంగాణ హైకోర్టు డిశ్చార్జ్ చేసింది. కానీ హైకోర్టు తీర్పును పక్కన పెట్టిన సుప్రీం కోర్టు.. ఈ కేసులో తీర్పుతో సంబంధం లేకుండా శ్రీ లక్ష్మి పాత్ర పై విచారణ చేయాలని ఆదేశించింది. మరో నెలలో విచారణ పూర్తి చేయాలని సూచించింది. ఓబులాపురం మైనింగ్ పేరుతో గాలి జనార్దన్ రెడ్డి దోపిడీకి పాల్పడ్డారన్న ఆరోపణల మేరకు ఈ కేసు విచారణ సాగింది. ఆ సమయంలో మైనింగ్ శాఖ ఉన్నతాధికారిగా శ్రీలక్ష్మి ఉన్నారు. అర్హత లేకపోయినా గాలి జనార్దన్ రెడ్డికి లీజులు కట్టబెట్టారన్న ఆరోపణలతో.. శ్రీలక్ష్మి పై సిబిఐ కేసులు నమోదు చేసింది.ఓబులాపురం మైనింగ్ కు సంబంధించి శ్రీలక్ష్మి భారీగా అవినీతికి పాల్పడ్డారు అన్న ఆరోపణలు ఉన్నాయి. గాలి జనార్దన్ రెడ్డి నుంచి పెద్ద ఎత్తున ఆర్థిక ప్రయోజనాలు పొందినట్లు కూడా సిబిఐ గుర్తించింది. అయితే ఈ కేసుతో తనకు ఏ సంబంధం లేదని మొదట సిబిఐ కోర్టులో డిశ్చార్జ్ పిటిషన్ వేశారు. కానీ సిబిఐ కోర్టు కొట్టి వేసింది. అదే పిటీషన్ ను హైకోర్టులో వేశారు. దీంతో 2022లో ఆమెను కేసు నుంచి డిశ్చార్జ్ చేస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. దీంతో ఓబులాపురం మైనింగ్ కేసులో శ్రీలక్ష్మి క్లీన్ చీట్ పొందగలిగారు. దీనిని సవాల్ చేస్తూ సిబిఐ సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది. గత కొద్దిరోజులుగా దీనిపై విచారణ కొనసాగుతోంది.కీలక ఆధారాలు చూపడంతో.. సుప్రీంకోర్టుకసిబిఐ కీలక ఆధారాలు చూపింది. హైకోర్టు తాము చూపించిన ఆధారాలను పరిగణలోకి తీసుకోకుండా డిశ్చార్జ్ చేసినట్లు పిటిషన్ లో పేర్కొంది సిబిఐ. విచారణ జరిపిన సుప్రీంకోర్టు హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెట్టింది. మూడు నెలల్లోగా విచారణ చేయాలని సూచించింది. ఆమె నేరప్రమేయంపై సాక్షాలు ఉంటే దోషిగా తేల్చి శిక్ష ఖరారు చేయనున్నారు. ఓబులాపురం మైనింగ్ కేసులో గాలి జనార్దన్ రెడ్డికి సిబిఐ కోర్టు ఏడేళ్ల పాటు జైలు శిక్ష విధించింది. ఆ మరుసటి రోజు శ్రీలక్ష్మి విషయంలో తీర్పు రావడం విశేషం.కర్ణాటక, ఏపీ సరిహద్దుల్లో ఐరన్ ఓర్ ను ఇష్టం వచ్చినట్లుగా తవ్వేసి ఎగుమతి చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర సరిహద్దులు కూడా చెరిపేసారని సిబిఐ కేసులు నమోదు చేసింది. 2009లో సిబిఐ ఈ వ్యవహారంలో ఎంట్రీ ఇచ్చింది. అప్పటి సీబీఐ జెడి లక్ష్మీనారాయణ గాలి జనార్దన్ రెడ్డిని బళ్లారి నుంచి అరెస్టు చేసి తీసుకెళ్లారు. మూడేళ్లకు పైగా జైల్లో ఉన్న తర్వాత ఆయన బెయిల్ పై విడుదలయ్యారు. తాజాగా ఆయనతోపాటు మరో ఐదుగురికి శిక్ష విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

# కుంగిపోయిన నేషనల్ హైవే

కర్నూలు, మే 9, కర్నూలు దగ్గర జాతీయ రహదారిపై ఊహించని ప్రమాదం! భూమి ఒక్కసారిగా కుంగిపోయి భారీ గుంత ఏర్పడటంతో వాహనదారులు ఆందోళన చెందారు. రహదారి పక్కనే ఇలా జరగడంతో పెను ప్రమాదం తప్పింది. అసలేం జరిగింది? సొరంగం తవ్వకాలే కారణమా? అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మరమ్మతులు చేస్తున్నారు. ఏపీలోని కర్నూలు దగ్గర నేషనల్ హైవేపై ఉన్నట్టుండి భారీ గుంత ఏర్పడింది. గురువారం సాయంత్రం దూపాడు దగ్గర రింగురోడ్డు వద్ద బెంగళూరు-హైదరాబాద్ నేషనల్ హైవే-44పై భూమి కుంగిపోయింది. ఆరు మీటర్ల వెడల్పు, పదహారు మీటర్ల లోతులో పెద్ద గొయ్యి ఏర్పడింది. హైవే పక్కన రోడ్డు కుంగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు వెంటనే ఆ మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. సూరత్ నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా భూగర్భంలో సొరంగాలు తవ్వుతున్నారు. ఈ క్రమంలో మట్టి క్రమంగా సొరంగంలో పడిపోయి గొయ్యి ఏర్పడిందని చెబుతున్నారు. కాంట్రాక్ట్ సంస్థ ఈ సొరంగ మార్గం నిర్మాణ పనులు చేస్తోంది. ఈ విషయాన్ని అధికారులు గుర్తించారు. హైవేలో గుంత ఏర్పడటంతో.. కొన్ని వాహనాలను మరో దారిలో పంపించారు. అయినా చాలా వాహనాలు రాత్రి ఎనిమిది గంటల వరకు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. రోడ్డు కుంగిన చోట దగ్గరలోనే భారీ బ్రిడ్జి ఉంది.. ప్రమాదం ఉందని అధికారులు భయపడ్డారు. వెంటనే స్పందించిన అధికారులు గొయ్యిని పూడ్చే బాధ్యతను ఓ కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించారు. ఈ మార్గంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి రాకపోకలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని పీడీ తరుణ్ తెలిపారు.మరోవైపు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 'నల్లమల ఘాట్‌లో రహదారిని 10 మీటర్లు వెడల్పు చేయాలని.. విన్నాపురం-సంజీవనగర్ తండాల మధ్య పల్లెకట్ల వద్దనున్న 10వ నంబరు కి.మీ నుంచి ప్రకాశం జిల్లా కొత్తూరు వరకు 38.80 కి.మీలు రహదారి విస్తరణకు ప్రతిపాదించారు. ఇందులో 7 మీటర్ల వెడల్పుతో తారురోడ్డు, ఇరువైపులా 1.5 మీటర్ల చొప్పున ఫుట్‌పాత్ నిర్మాణానికి సర్వే చేపట్టారు' అధికారులు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం రోడ్డు నిర్వహణకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో కూటమి ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. అలాగే ఉమ్మడి కర్నూలు జిల్లాలో నేషనల్ హైవేలు, స్టేట్ హైవేలు, ప్రధానమైన రోడ్లపై కూడా ఏపీ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది.

# పాకిస్తాన్ ప్రధాని పరార్...?

ఇస్లామాబాద్, మే 9, (న్యూస్ పల్స్) భారత్ దెబ్బకు పాకిస్తాన్ చేతులు ఎత్తేసింది. ఆ దేశ రాజధాని ఇస్లామాబాద్ తుక్కుతుక్కు అయినట్టు సమాచారం. ఈ దాడులను తట్టుకోలేక భారత్‌ను ఎదుర్కోలేక పాకిస్తాన్ ప్రధానమంత్రి షాబాజ్ షరీఫ్ దేశం విడిచి పారిపోవడానికి సిద్ధమవుతున్నట్టు సమాచారం. ప్రత్యేక చార్టెడ్ ఫ్లైట్‌లో దేశం విడిచి వెళ్లిపోయేందుకు ఆయనకు సహాయక సిబ్బంది హెల్ప్ చేస్తున్నట్టు పాకిస్తాన్ నుంచి వార్తలు వస్తున్నాయి. జమ్మూ కాశ్మీర్, పంజాబ్, రాజస్థాన్‌లలో పాకిస్తాన్ చేసిన క్షిపణి, డ్రోన్ దాడులను భారతదేశం భగ్నం చేసింది. దీని తరువాత, భారతదేశం కూడా ప్రతీకారం తీర్చుకునేందుకు లాహోర్, కరాచీతో సహా అనేక ప్రదేశాలలో డ్రోన్ దాడులను నిర్వహించింది. భారతదేశ ప్రతీకార చర్యతో భయపడి ఖంఢ మరోసారి అబద్దాలు చెప్పింది.ఇస్లామాబాద్‌లో, పాకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, పాకిస్తాన్ పఠాన్‌కోట్, జైసల్మేర్, శ్రీనగర్‌లపై దాడి చేసిందని ఆరోపిస్తూ భారత మీడియా ప్రచారం చేసిన నిరాధారమైన, బాధ్యతారహిత ఆరోపణలను పాకిస్తాన్ ప్రభుత్వం పూర్తిగా తిరస్కరిస్తోందన్నారు. ఈ వాదనలు పూర్తిగా నిరాధారమైనవి, రాజకీయంగా ప్రేరేపితమైనవిగా చెబుతోంది. పాకిస్తాన్‌ను కించపరిచే లక్ష్యంతో నిరాధారమైన ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు భారతదేశాన్ని ఒప్పించి సంయమనం పాటించేలా సహాయ ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది.పాకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఒక ప్రకటనలో, ఎటువంటి విశ్వసనీయ దర్యాప్తు లేకుండా పాకిస్తాన్‌పై పదేపదే ఆరోపణలు చేయడం దురాక్రమణకు ఒక సాకు మాత్రమేనని అంటోంది. తమ ప్రాంతాన్ని మరింత అస్థిరపరచడానికి ఉద్దేశపూర్వక వ్యూహాన్ని పన్నుతున్నట్టు ఆరోపిస్తోంది. ఇటువంటి చర్యలు శాంతికి, ముప్పు కలిగించడమే కాకుండా, రాజకీయ, సైనిక ప్రయోజనాల కోసం తప్పుడు సమాచారాన్ని ఉపయోగించుకోవాలనే కోరికను కూడా ప్రతిబింబిస్తాయి అని ఏడుస్తోంది. ఈ ప్రమాదకరమైన ప్రవర్తనపై అంతర్జాతీయ సమాజం దృష్టి పెట్టాలని, భారతదేశం సంయమనం పాటించి బాధ్యత వహించాలని కోరుతున్నామని పాకిస్తాన్ తెలిపింది. తప్పుడు సాకుతో ఏదైనా చేసే పూర్తి సన్నద్ధతతో ఎదుర్కొంటామని గాంభీర్యానికి పోతోంది. పాకిస్తాన్ అప్రమత్తంగా ఉందని, శాంతికి కట్టుబడి ఉందని, కానీ రెచ్చగొట్టడానికి, బెదిరించడానికి లేదా తప్పుడు పట్టించడానికి చేసే ప్రయత్నాలకు భయపడదని ఆయన అన్నారు. దురాక్రమణ చర్యలకు ప్రతిస్పందించే హక్కు పాకిస్తాన్‌కు ఉందని ఈ ఆరోపణలను తీవ్రంగా తిరస్కరించామన్నారు.

## సీపీ బ్రౌన్ గ్రంథాలయ భవనం నిర్మించండి

### గ్రంథాలయ సలహా మండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్ విజ్ఞప్తి

కడప: కడపలో ప్రాముఖ్యత కలిగిన సీపీ బ్రౌన్ గ్రంథాలయ భవనం నిర్మించమని ఆ గ్రంథాలయ సలహా మండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. సీపీ బ్రౌన్ గ్రంథాలయ అదనపు భవన నిర్మాణం కోసం కొందరు న్యాయమూర్తుల చొరవ వల్ల గత ప్రభుత్వం 2023లో రూ.3-60 కోట్ల నిధులు విడుదల చేసింది. 2024 జనవరిలో నిర్మాణ పనులు చేయడానికి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఆఇఇడిఏఐ)కు అనుమతి ఇచ్చింది. టెండర్లు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్‌ని కూడా ఎంపిక చేశారు. కాంట్రాక్టర్ నిర్మాణ సామాగ్రి కూడా సిద్ధం చేసుకున్నారు. పనులు చేయడానికి సిద్ధమై ఏప్రిల్ 29న భూమి పూజ, శంకు స్థాపనకు సిద్ధమై, శిలా ఫలకం, ఆహ్వాన పత్రికల పంపిణీ అన్నీ పూర్తి అయ్యాయి. చివరి క్షణంలో ప్రధాన మంత్రి మోదీ పర్యటన కార్యక్రమం వల్ల భూమి పూజ కార్యక్రమం వాయిదా పడింది. తిరిగి ఎప్పుడు అన్నది తెలియని పరిస్థితి. ఈ పనులను ఎప్పుడు మొదలు పెడతారో తెలియడంలేదు. ఆలస్యం అయితే, నిర్మాణ వ్యయం పెరిగిపోతుంది. వానల వల్ల పనులు కూడా జరగవు. ఈ విషయాన్ని పరిశీలించి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కడప జిల్లా కలెక్టర్, సీపీ బ్రౌన్ గ్రంథాలయ ప్రధాన పోషకులు డాక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను జానమద్ది విజయ భాస్కర్ కోరుతున్నారు. ఈ గ్రంథాలయం ఇది తెలుగు భాషాభిమానుల ఆస్తిగా ఆయన పేర్కొన్నారు.

# భారత్ దూకుడు...

ఎప్పటి నుంచో అనుకుంటున్న ప్రజలంతా కోరుకుంటున్న గడియలు రానే వచ్చాయి. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోకి భారత సైన్యం ఎంట్రీ ఇచ్చినట్టు సమాచారం అందుతోంది. దీనిపై ఇంత వరకు అధికారిక ప్రకటన రాలేదు. కానీ భారత్ సైన్యం మాత్రం ఆ ప్రాంతంలోకి వెళ్లి ఉగ్రవాదుల భరతం పట్టే పనిలో ఉందని తెలుస్తోంది.మరోవైపు భారత్ చేస్తున్న దాడులకు పాకిస్తాన్ వణికిపోతోంది. చైనా ఇచ్చిన పేలని బాంబులతో యుద్ధం చేస్తున్నట్టు ఆ దేశ ప్రజలకు కలరింగ్ ఇస్తోంది. ఆ దేశ మీడియాలో హైక్ క్రియేట్ చేస్తోంది. భారత్‌ను కవ్వించి తప్పు చేసిన పాకిస్తాన్ దానికి తగ్గ ఫలితాన్ని అనుభవిస్తోంది. ఆ దేశ రాజధాని ఇస్లామాబాద్ ను భారత ఆర్మీ డ్రోన్‌లు ధ్వంసం చేశాయి. పాక్ ప్రధాని అధికారిక భవనం పక్కనే బాంబు వర్షం కురిపించింది భారత్. భారత్ దూకుడు చూసిన పాకిస్తాన్ ప్రధాన మంత్రి బిచాణా సర్దేస్తున్నట్టు కూడా వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు బంకర్లలో దాక్కున్న షాబాజ్ షరీఫ్ ఇప్పుడు విదేశాలకు పారిపోయేందుకు స్కెచ్ వేస్తున్నారు. ఇప్పటికే ఆ దేశ సైన్యాధ్యక్షుడు ఫ్యామిలీతో విదేశాలకు పారిపోయారు. పహల్గామ్ ఉగ్రవాద దాడితో పరిస్థితి మరింత దిగజారిందని అన్నారు. దీనికి స్పందించిన భారత్ భారతదేశం ఆపరేషన్ సిందూర్ ఎంపిక చేసిన ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసినట్లు ప్రకటించారు. ఇది జరిగిన కొన్ని గంటలకు పొరుగు దేశం నుంచి డ్రోన్ దాడులు జరిగాయి. దీనిపై సరిహద్దు రాష్ట్రాల నుంచి నివేదికలతో పరిస్థితులు వేగంగా మారిపోయాయి.మే 7-8 తేదీల్లో ఉత్తర, పశ్చిమ భారతదేశంలోని 15 ప్రదేశాల్లో ఇలాంటి బెదిరింపులు అడ్డుకున్న తర్వాత, జమ్మూ, పఠాన్‌కోట్‌లలోని డ్రోన్‌లు, క్షిపణులతో సైనిక స్థావరాలపై దాడి చేయడానికి పాకిస్తాన్ చేసిన ప్రయత్నాలను భారతదేశం విజయవంతంగా తిప్పికొట్టింది. గురువారం సాయంత్రం మళ్లీ అలాంటి కుటిల యత్నానికి పాల్పడింది. నియంత్రణ రేఖ (ఎల్ఓసి), జమ్మూ, కాశ్మీర్, పంజాబ్, రాజస్థాన్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వద్ద పాకిస్తాన్ దళాలు కాల్పులకు తెగపడ్డాయి. ఉదయం పాకిస్తాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు భారతదేశం లక్ష్యంగా చేసుకుంది. వాటిని న్యూట్రలైజ్ చేసింది. ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ ప్రధాన కార్యాలయం, జమ్మూ, పఠాన్‌కోట్, ఉధంపూర్‌లోని సైనిక స్థావరాలను పాకిస్తాన్ క్షిపణులు, డ్రోన్‌లను ఉపయోగించి లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడులను సమర్థంగా తిప్పికొట్టామని ఎలాంటి నష్టం వాటిల్లలేదని ప్రకటించింది. జమ్మూలోని కీలక ప్రదేశాల వైపు పాకిస్తాన్ ప్రయోగించిన కనీసం ఎనిమిది క్షిపణులను భారత వైమానిక రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయి.

టార్గెట్ చేసిన లక్ష్యాల్లో వ్యూహాత్మకంగా ముఖ్యమైన జమ్మూ సత్వారీ విమానాశ్రయం, సాంబా, ఆర్నియా, ఆర్నియా ఉన్నాయి.కాస్త విరామం తర్వాత జమ్మూలో రెండు పెద్ద పేలుళ్లు వినిపించాయి. ఆ తర్వాత నగరం అకస్మాత్తుగా బ్లాక్అవుట్ అయింది. డ్రోన్‌లను గాలిలో అడ్డగించడం వల్ల పేలుళ్లు జరిగి ఉండొచ్చు. భద్రతా సంస్థలు హై అలర్ట్‌లో ఉన్నందున ప్రజలంతా ఇళ్లల్లోనే ఉండాలని సైరన్‌లు వెంటనే అప్రమత్తం చేశాయి.పేలుళ్లు, పదేపదే సైరన్‌ల నివేదికల తర్వాత రాజస్థాన్‌లోని సరిహద్దు జిల్లాలు రెడ్ అలర్ట్ జారీ చేసి అనేక ప్రాంతాలలో బ్లాక్అవుట్‌లను అమలు చేశాయి.జైసల్మేర్‌లో దాదాపు గంటసేపు భారీ పేలుడు సంభవించి, అడపాదడపా పేలుళ్లు జరిగాయి. జిల్లా అంధకారంలో ఉంది. బాడ్మేర్ రైల్వే స్టేషన్, ప్రధాన మార్కెట్, జిల్లా కలెక్టరేట్‌తో సహా కీలక ప్రదేశాల్లో ఐదు వేర్వేరు సమయాల్లో సైరన్‌లు మోగాయి.శ్రీగంగానగర్‌లో అధికారులు ప్రజలు ఇంటి లోపలే ఉండి లైట్లు ఆపివేయాలని కోరారు. పెరుగుతున్న ప్రజా ఆందోళన కారణంగా పోలీసులు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేశారు.బికనీర్‌లో పూర్తి బ్లాక్అవుట్‌ను అమలు చేశారు. తదుపరి నోటీసు వచ్చే వరకు ఆంక్షలు కొనసాగుతాయని జిల్లా మేజిస్ట్రేట్ నమ్రతా వృష్ణి తెలిపారు. గురువారం రాత్రి అధికారిక ఆదేశాలు జారీ చేశారు. జోధ్‌పూర్‌లో, జిల్లా మేజిస్ట్రేట్ గౌరవ్ అగర్వాల్ తక్షణం పాటించాలని ఇదే విధమైన ఆదేశాన్ని జారీ చేశారు.జైసల్మేర్ నగరంలో కూడా పేలుడు శబ్దాలు, సైరన్‌లు వినిపించాయి. అవి జైసల్మేర్-పోఖ్రాన్ ప్రాంతంలో డ్రోన్ కార్యకలాపాలకు సంబంధించినవని తెలుస్తోంది. సరిహద్దుల్లో పాకిస్తాన్ చేసిన డ్రోన్ దాడులకు ప్రతిస్పందనగా భారతదేశం లాహోర్‌పై డ్రోన్ దాడిని ప్రారంభించింది. ఈ దాడి తర్వాత, ఇస్లామాబాద్, కరాచీ, బహవల్పూర్‌తో సహా అనేక పాకిస్తాన్ నగరాల్లో సైరన్‌లు మోగాయని నివేదికలు వస్తున్నాయి. ఇది ప్రజలను భయాందోళనలకు గురిచేసింది. పాకిస్తాన్ వైమానిక దళం వైమానిక హెచ్చరిక, నియంత్రణ వ్యవస్థ) విమానాన్ని భారత్ కూల్చివేసిన తర్వాత ఈ పరిణామం జరిగింది.ఉగ్రదాడుల నేపథ్యంలో కరాచీ ఓడరేవు ప్రాంతం సమీపంలో పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. దీంతో భారత నావికాదళం అలర్ట్ అయింది. అరేబియా సముద్రంలో కీలకమైన అస్త్రాలను రెడీ చేసింది. కార్యాచరణ సంసిద్ధతను కొనసాగించడానికి పశ్చిమ నావికాదళం ఎయిర్ విక్రాంత్, డిస్ట్రాయర్లను మోహరించిందని తెలుస్తోంది. భారతదేశ క్షిపణి రక్షణ వ్యవస్థలు పాకిస్తాన్‌కు చెందిన ఒక ఎఫ్-16, రెండు ఎఫ్-17 యుద్ధ విమానాలను కూల్చివేసినట్లు తెలుస్తోంది. దీనిపై ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు. అంతకుముందు, 15 భారతీయ నగరాలను లక్ష్యంగా చేసుకునే ప్రయత్నం విఫలమైన కొన్ని గంటల తర్వాత పాకిస్తాన్ జమ్మూ కాశ్మీర్‌లోని అనేక ప్రాంతాలపై దాడి చేసింది. రాత్రి 9 గంటలకు కొద్దిసేపటి ముందు, జమ్మూలో పెద్ద పేలుళ్ల శబ్దాలు వినిపించాయి.

అప్పుడు, సైరన్లు మోగడం ప్రారంభించాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ కాలంలోని అనేక వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.పరిస్థితి మరింత దిగజారడంతో, నగరంలోని అనేక ప్రాంతాల్లో మొబైల్ ఫోన్ సేవలు నిలిచిపోయాయి.

దీంతో స్థానికులు తమ స్నేహితులు, బంధువులను సంప్రదించడానికి ప్రయత్నించారు. జమ్మూ కాశ్మీర్ సరిహద్దు ప్రాంతాలలో ఎక్కువ భాగం ఇప్పుడు అంధకారంలో ఉన్నాయి. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్, గురుదాస్‌పూర్‌లో పాకిస్తాన్ సరిహద్దులో ఉన్న మరొక రాష్ట్రమైన రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలలో కూడా బ్లాక్అవుట్ ప్రకటించారు.

# సరిహద్దు రాష్ట్రాల్లో హై అలెర్ట్..

న్యూఢిల్లీ, మే 9, (న్యూస్ పల్స్) పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్తాన్ మధ్య మొదలైన ఉద్రిక్త పరిస్థితులు, ఆపరేషన్ సిందూర్ తర్వాత మరింత తీవ్రస్థాయికి చేరాయి. ఈ పరిస్థితులు రెండు దేశాల మధ్య యుద్ధ వాతావరణాన్ని నెలకొల్పాయి. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టింది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ఉగ్రస్థావరాలపై భారత్ ఆర్మీ దాడి చేసిన సుమారు 100 మంది వరకు ఉగ్రవాదులను అంతం చేసింది. దీంతో భారత్‌పై పాక్ కూడా ప్రతికార దాడులకు పాల్పడుతోంది. ఈ నేపథ్యంలోనే భారత్‌లోని సరిహద్దు ప్రాంతాల్లో 15 సైనిక స్థావరాలపై పాక్ దాడులు చేసేందుకు ప్రయత్నించింది. అప్రమత్తమైన భారత సైన్యం వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టింది.ఇక తాజాగా జమ్మూ ఎయిర్‌పోర్ట్‌పై పాకిస్తాన్ డ్రోన్లతో దాడికి దిగింది. అప్పటికే సిద్ధంగా భారత సైన్యం ప్రత్యర్థి డ్రోన్లు, రాకెట్లను సమర్థవంతంగా అడ్డుకొని కూల్చివేసింది. ఈ నేపథ్యంలో జమ్మూ నగరం మొత్తం విద్యుత్ అంతరాయం కలిగింది. శత్రు సేనల నుంచి వస్తున్న డ్రోన్లను ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ సిస్టమ్ సాయంతో భారత సైన్యం కూల్చివేసింది. కొన్ని రాకెట్లను కూడా కూల్చేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే భారత్-పాకిస్తాన్ సరిహద్దు రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని భారత ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది.జమ్మూకశ్మీర్, రాజస్థాన్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలను కేంద్రం అలర్ట్ చేసింది. గుజరాత్ సముద్ర తీరం వెంబడి భద్రత అప్రమత్తం చేసింది. ఢిల్లీ, హర్యానా, బెంగాల్‌లో రాష్ట్రాల్లో భద్రత కట్టుదిట్టం చేసింది. పోలీసులు, పాలనాధికారులు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సెలవులు రద్దు చేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు ఇవ్వడం కుదరదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అత్యవసర పరిస్థితులు ఎదురైతే సిద్ధంగా ఉండాలని ఉద్యోగస్తులకు అన్ని జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాలైన జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్‌లో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. స్కూళ్లను కాలేజీలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇక హిమాచల్‌ప్రదేశ్‌లోనూ భారీగా భద్రత ప్రణాళిక ఏర్పాటు చేసింది. హమీపూర్, ఉనా, బిలాస్‌పూర్ భద్రతను పెంచింది. వీటితో పాటు సరిహద్దు రాష్ట్రాల్లోని ప్రముఖ దేవాలయాల దగ్గర తనిఖీలను ముమ్మరం చేసింది. దేశంలో యుద్ధ వాతావరణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, అత్యవసరమైతే స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలని హెచ్చరికలు జారీ చేసింది. అనవసర ప్రయాణాలు చేయొద్దని, అనవసరంగా బయటకు రావొద్దని సూచనలు జారీ చేసింది.పాక్ సరిహద్దుల్లో కీలక ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌లో పూర్తిగా యుద్ధవాతావరణం నెలకొంది. ముఖ్యంగా జమ్ము, రాజోరీ, ఉధంపూర్, శ్రీనగర్ ప్రాంతాలను చీకట్లు కమ్ముకున్నాయి. జమ్మూ లక్ష్యంగా పాకిస్తాన్ వేసిన మిస్సైల్స్‌ను భారత సైన్యం ఆకాశంలోనే పేల్చేసింది.ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం కూడా అలర్ట్ అయ్యింది. రాష్ట్రంలో బోర్డర్‌కు దగ్గరగా ఉన్న జిల్లాల్లో కఠినమైన భద్రతా చర్యలు చేపట్టింది. ప్రత్యేక నిఘా, బ్లాకౌట్‌లు అమలు చేస్తోంది. ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్, ఫజిల్కా, అమృతసర్, గుర్దాస్‌పూర్ జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించింది.

# ఐపీఎల్ రద్దు

## దిశగా అడుగులు

ముంబై, మే 9, భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత పెరిగింది. ఆపరేషన్ సింధూర్ తర్వాత పాకిస్తాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ క్రమంలో వరుసగా అనేక దుర్మార్గపు చర్యలకు పాల్పడుతోంది. దీనికి తగిన సమాధానం భారత్ నుంచి అందుతోంది. బుధవారం నాడు పాకిస్తాన్ భారతదేశంలోని అనేక నగరాల్లో డ్రోన్ దాడులను నిర్వహించింది. అయితే, భారతదేశం పాకిస్తాన్‌కు తగిన సమాధానం ఇచ్చి, ఆ దేశ క్షిపణులను, డ్రోన్‌లను కూల్చివేసింది. కానీ, ఈ దాడి ప్రభావం ఐపీఎల్ పై కనిపించింది. ధర్మశాల పంజాబ్ కింగ్స్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరగాల్సిన ఐపీఎల్ మ్యాచ్ మధ్యలో రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితిలో, ఈ లీగ్ జరుగుతుందా లేదా వాయిదా పడుతుందా అనేది ఇప్పుడు అతిపెద్ద ప్రశ్నగా మారింది. భారత్ ? పాకిస్తాన్ ఉద్రిక్తత ఐపీఎల్‌ను ప్రభావితం చేసింది. జమ్మూ, పఠాన్‌కోట్‌లలో వైమానిక దాడుల హెచ్చరికల తర్వాత పంజాబ్ కింగ్స్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరగాల్సిన ఐపీఎల్ మ్యాచ్‌ను మధ్యలో రద్దు చేశారు. అదే సమయంలో, మే 11న ధర్మశాలలో జరగాల్సిన మ్యాచ్‌ను ఇప్పటికే వేరే వేదికకు తరలించారు. కానీ, రెండు దేశాల మధ్య ఉద్రిక్తత పెరుగుతోంది. ఇటువంటి పరిస్థితిలో, మే 9 శుక్రవారం నాడు బీసీసీఐ అత్యవసర సమావేశం జరగనుంది. మే 8న ఐపీఎల్ మ్యాచ్‌లు రద్దు అయిన తర్వాత బీసీసీఐ, ఐపీఎల్ పాలక మండలి సమావేశం జరిగింది. దీనిపై ఈరోజు తుది నిర్ణయం వచ్చే అవకాశం ఉందిసైన్యం, పాకిస్తాన్ మధ్య ఘర్షణ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఐపీఎల్ కొనసాగుతుందా లేదా అనే దానిపై నిర్ణయం తీసుకునే ముందు ప్రభుత్వ సూచనల కోసం ఎదురుచూస్తున్నామని ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమల్ గురువారం చెప్పారు. ఇటువంటి పరిస్థితిలో, ఐపీఎల్‌ను మరింతగా ఆడాలా లేదా వాయిదా వేయాలా అనేది ప్రభుత్వం చేతుల్లోనే ఉంటుంది. అయితే, ఈ సీజన్‌ను ఎలాగైనా పూర్తి చేయడానికి బీసీసీఐ తన శాయశక్తుల ప్రయత్నించవచ్చు. లేకపోతే, ఆటగాని ముందు ఖాళీ కిటికీ దొరకడం చాలా కష్టం అవుతుంది. మార్చి నుంచి మే వరకు మాత్రమే కీలక దేశాలు అంతర్జాతీయ క్రికెట్ ఆడవని సంగతి తెలిసిందే.

# 13 న చార్మినార్ లో హెరిటేజ్ వాక్

హైదరాబాద్, మే 9, తెలంగాణలో మిస్ వరల్డ్ 2025 పోటీల నిర్వహణ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా హైదరా?బాద్ బ్రాండ్ వ్యాల్యూ ఓ రేంజ్ లో పెరుగనుందని రాష్ట్ర ప్రభుత్వం కోటి ఆశలు పెట్టుకుంది. ఈ క్రమంలో ప్రపందేశాల దృష్టి భాగ్యనగరంవైపు మళ్లించేందుకు సరికొత్త ఆలోచనలతో ముందుకెళుతోంది. తాజాగా హైదరాబాద్ ఓల్డ్ సిటీ రోడ్లపై మిస్ వరల్డ్ ప్రతినిధి బృందం హెరిటేజ్ వాక్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మిస్ వరల్డ్ ఈవెంట్ లో భాగంగా ఈ నెల13 న సాయంత్రం హైదరాబాద్ నగరంలోని చార్మినార్ , లాడ్ బజార్ లతోపాటు ఇక్కడ సాంస్కృతిక వైభవాన్ని,వైవిధ్యాన్ని చారిత్రక ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేసేలా హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నారు. లాడ్ బజార్ లో మిస్ వరల్డ్ ప్రతినిధులు స్థానిక కళాకారులతో మాట్లాడనున్నారు. 120 దేశాల మిస్ వరల్డ్ ప్రతినిధులు హాజరయ్యే ఈ హెరిటేజ్ వాక్ ను 150 కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం కానుంది.ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు ఈ ఈవెంట్ ను లైవ్ లో చూసేందుకు ఈవెంట్ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున విదేశీ పర్యాటకులను తెలంగాణకు ఆకర్షించేలా ప్రణాళిలు సిద్ధం చేసింది.చారిత్రక చార్మినార్ కట్టడం, లాడ్ బజార్ ప్రత్యేకతలను మిస్ వరల్డ్ ప్రతినిధులు వివరించి వరల్డ్ టూరిస్ట్ డెస్టినేషన్ స్పాట్ గా ప్రమోట్ చేయనున్నారు.నిజాం పాలనలో వెలసిన లాడ్ బజార్ కు 400 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. బాంగిల్స్ రాజధానిగా ఈ ప్రాంతం తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు పొందింది. రంగురంగుల పేర్లు, మణులు, జరీ పనితో కూడిన సాంప్రదాయిక గాజులు ఇక్కడ అదనపు ఆకర్షణగా చెప్పవచ్చు. ప్రతీ ఏటా పెళ్లిళ్ల సీజన్ లో ఈ లాడ్ బజార్ లో ఇసుకవేస్తే రాలనంతగా జనం పోటెత్తుతారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ నాణ్యమైన ముత్యాలు, నగలు సరసమైన ధరల్లో లభిస్తాయి. ఈ బజార్ కు హస్తకళా హబ్ గా కూడా పేరుంది. చిత్రకళ, నకాశీ పని, ఇస్లామిక్ ఆర్ట్ వంటి సాంప్రదాయిక హస్త, శిల్పకళ వస్తువులు ఇక్కడ లభిస్తాయి. లాడ్ బజార్ వీధుల్లో అత్తర్ సువాసనలు ఓ అద్భుతం, ఖురాన్ ప్రతులు, సాంస్కృతిక వస్తువులతో ఇది ఇస్లామిక్ ఆర్ట్ కి ప్రతీకగా నిలిచింది. ఓల్డ్ సిటీ యొక్క ఇటుకల రోడ్లు, సజీవమైన దుకాణాలు, సాంస్కృతిక ఆనవాళ్లు ప్రతి ఒక్కరినీ మంత్రముగ్దులను ముగ్ధులను చేస్తాయి.1591లో కుతుబ్ షాహీ రాజు ముహమ్మద్ కులీ కుతుబ్ షా నిర్మించిన చార్మినార్, హైదరాబాద్ సాంస్కృతిక గర్వాన్ని ప్రతిబింబిస్తుంది. నాలుగు మినార్లతో కూడిన ఈ స్మారకం ఇండో-ఇస్లామిక్ డిజైన్ కు నిదర్శనం. ప్లేగు నివారణ తర్వాత నగర స్థాపనకు గుర్తుగా నిర్మించబడింది. 56 మీటర్ల ఎత్తు, 45 మీటర్ల వెడల్పుతో ఇది హైదరాబాద్ కు "హార్ట్" గా ఉంది. మినార్లపై నుండి చూస్తే ఓల్డ్ సిటీ వీధులు, మక్కా మసీదు అద్భుత దృశ్యాలు కనిపిస్తాయి. ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తింపు కోసం ఇప్పటికే ప్రతిపాదనలు వెళ్లాయి.ఇది నిజాం కాలం నుండి నేటి వరకు హైదరాబాద్ కు తిరుగులేని ఐకాన్ గా నిలిచింది. చార్మినార్ వీధుల్లో 120 దేశా?లకు పైగా మిస్ వరల్డ్ ప్రతినిధులు హెరిటేజ్ వాక్ నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సాధారణ రోజుల్లో సైతం సమస్యాత్మక ప్రాంతం కావడం, అందులోనూ ప్రస్తుతం ఇండియా,పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తలు నెలకొన్న నేథపథ్యంలో ఓల్డ్ సిటీ హెరిటేజ్ వాక్ పై తెలంగాణ పోలీసుశాఖ ప్రత్యేక దృష్టిసారించింది.ఇప్పటికే హైదరాబాద్ కు ఉగ్రవాదుల నుండి దాడుల ముప్పు పొంచి ఉండటంతో , తే?డా వస్తే ప్రపంచ దేశాల ముందు హైదరాబాద్ తోపాటు దేశ ఖ్యాతి దెబ్బతినే అవకాశం ఉండటంతో ప్రభుత్వం హెరిటేజ్ వాక్ ను సీరియస్ గా తీసుకుంది. మిస్ వరల్డ్ ప్రతినిధులు వాక్ చేసే ప్రాంతాన్ని ఇప్పటి నుండి పోలీసులు క్షున్నంగా పరిశీలిస్తున్నారు. కొత్త వ్యక్తుల రాకపోకలపై నిఘాపెట్టారు. హెరిటేజ్ వాక్ కు 24 గంటల ముందునుండే భద్రతా బలగాలు హెరటేజ్ వాక్ జరిగే ప్రాంతాన్ని పూర్తిగా ఆధీనంలోకి తీసుకోనున్నాయి. మొత్తంగా ఓల్డ్ సిటీలో 120దేశాల ప్రతినిధులు వాక్ ఉత్కంఠగా మారింది.

# బ్యాంకింగ్ నుంచి వ్యవసాయంలో...

మహబూబ్ నగర్ , మే 9, నాగర్‌కర్నూలు జిల్లా చారుగొండ మండలం జూపల్లికి చెందిన రైతు రంగప్రసాద్‌కు 70 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. రంగప్రసాద్ తనకున్న వ్యవసాయ భూమిలో మొక్కజొన్న విత్తులు విత్తాడు. అది ఏపుగా పెరిగింది. ఆ విత్తనాలు పక్కనే టొమాటో మొక్కలు కూడా నాటాడు. ఇలా టొమాటో, మొక్కజొన్న తోడూ నీడగా ఎదగసాగాయి. ప్రస్తుతం వేసవి కావడంతో పక్కనే ఏపుగా పెరిగిన మొక్కజొన్న మొక్కలు టొమాటో మొక్కలకు కొండంత అండగా నిలిచాయి. మాడుపగిలే ఎండల నుంచి టొమాటో తోటను కాపాడుకోవటానికి రైతు రంగప్రసాద్ ఈ వినూత్న ఉపాయం ఇది. దూరం నుంచి చేసే ఎవరికైనా అది మొక్కజొన్న తోటలాగే కనిపిస్తుంది. కానీ దగ్గరికి వెళ్తే.. చేనంతా పచ్చగా టొమాటో పంట కనిపిస్తుంది.ఇలా వినూత్న పథంలో వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడితో మంచి లాభాలు గడిస్తున్న రంగప్రసాద్ గతంలో బ్యాంకింగ్ రంగంలో ఉన్నతోద్యోగిగా పనిచేసేవారట. ఆయన నాలుగేళ్ల క్రితం ఉద్యోగం మనేసి సేంద్రియ వ్యవసాయం ప్రారంభించారు. తనకున్న 70 ఎకరాల పొలంలో ఐఫామ్స్‌ను స్థాపించారు. రకరకాల పండ్ల చెట్లు, కూరగాయలు, నాటుకోళ్లు, మేకలు ఇలా రకరకాల పంటలు పండిస్తున్నారు. అంతేనా.. గచ్చిబౌలిలో సొంతంగా స్టోర్ తెరచి తన పొలంలో పండిన పంటలను నేరుగా వినియోగదారులకు విక్రయిస్తున్నారు.ఎండల దాటికి పంటలన్నీ ఎండిపోతున్న తరుణంలో రంగప్రసాద్ మాత్రం టొమాటో, క్యాబేజీ, బ్రకోలి, లెట్యూస్ వంటి పంటలు సాగుచేస్తున్నారు. అయితే ఆయన పండించే అన్ని పంటల్లోనూ ఉత్తర ? దక్షిణ వరుసలుగా మొక్కజొన్న విత్తులు నాటారు. ఇలా ప్రతి 30 రోజులకోసారి కొత్త కూరగాయల ప్లాట్‌లో మొక్కలు నాటుతూ ఏడాది పొడవునా కూరగాయలు పండిస్తున్నారు. కూరగాయల మొక్కలను నాటేటప్పుడే మొక్కజొన్న విత్తులు కూడా వరుసల మధ్య విత్తుతున్నట్లు ఆయన తెలిపారు. అవసరమైతే మధ్యలో 15 రోజులకోసారి కూడా మొక్కజొన్న విత్తుతామని, అందువల్లనే తన పంట ఎప్పుడు చూసినా రకరకాల ఎత్తుల్లో మొక్కజొన్న మొక్కలు పెరుగుతూ కనిపిస్తాయన్నారు. ఇవి ఏపుగా పెరిగి వాటికి పక్కన ఉన్న కూరగాయ మొక్కలకు నీడను, చల్లదనాన్ని అందిస్తుండటంతో ఎండను తట్టుకొనే శక్తి వస్తోందని అన్నారు. తక్కువ కాలంలో ఏపుగా పెరిగే మొక్కజొన్నతో 3 డిగ్రీల సెల్సియస్ మేరకు పొలంలో ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని.. ఫలితంగా కూరగాయల మొక్కలు సమృద్ధిగా పంటను అందిస్తాయని, ఇదే తన సృజనాత్మకత అని అంటున్నారు.

# స్లీపర్ సెల్స్‌పై డేగ కన్ను

హైదరాబాద్, మే 9, ఆపరేషన్ సింధూర్ తర్వాత టెర్రర్ స్లీపర్ సెల్స్ యాక్టీవ్ కాబోతున్నాయా? నిఘా వర్గాల హెచ్చరికలతో స్లీపర్ సెల్స్‌పై ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయా? గత అనుభవాల దృష్ట్యా స్లీపర్ సెల్స్‌పై హైదరాబాద్ పోలీసు యంత్రాంగం డేగ కన్నేస్తోంది. మిస్ వరల్డ్ పోటీలు.. యుద్ధ సంకేతాలతో భాగ్యనగరం పోలీసులను ముఖ్యమంత్రి రేవంత్ అలెర్ట్ చేశారు. ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొనేలా తెలుగు రాష్ట్రాలు సన్నద్ధమవుతున్నాయిపహల్గామ్ ఉగ్రదాడి తర్వాత దేశంలో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు ఇప్పటికే హెచ్చరికల జారీ చేశాయి. దాంతో.. కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమై.. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా భద్రత కట్టుదిట్టం చేయాలని, బలగాలు అప్రమత్తంగా ఆదేశించింది. ఈ క్రమంలోనే.. దేశంలో అలెర్ట్ కొనసాగుతోంది. పహల్గామ్‌లో ముష్కర కర్కశకాండ వెనుక లోకల్ స్లీపర్‌సెల్స్ హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్లీపర్ సెల్స్ హెల్ప్ లేకుండా ఇలాంటి దాడి చేయడం అసాధ్యమని భద్రతా వర్గాలు కూడా భావిస్తున్నాయి.అందుకు అనుగుణంగానే.. ఉగ్రవాదులు.. వారికి సహకరించినవారి ఇళ్లపై భారత ఆర్మీ ఇప్పటికే ఉక్కుపాదం మోపింది. ఇప్పుడు ఏకంగా.. ఆపరేషన్ సింధూర్‌తో ఖూబలోని ఐదు ఉగ్ర స్థావరాలతోపాటు పాకిస్తాన్‌లోని నాలుగు టెర్రర్ క్యాంపులపై ఎయిర్ స్ట్రైక్ చేసి పాక్ ఉగ్రమూకల పీచమణిచింది. అయితే, గతంలో దేశంలో ఎక్కడ ఉగ్ర కుట్రలు బయటపడ్డా వాటికి సంబంధించిన లింకులు హైదరాబాద్‌లోని స్లీపర్ సెల్స్‌కు కనెక్ట్ అయిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది.ఒకవైపు మిస్ వరల్డ్ పోటీలు.. మరోవైపు వార్ ఇండికేషన్స్‌తో హైదరాబాద్‌పై తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఆపరేషన్ సింధూర్, అనంతర పరిణామాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సమీక్ష చేశారు. తెలంగాణలో భద్రత కట్టుదిట్టం చెయ్యాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రధానంగా.. ఎయిర్‌పోర్ట్‌లు, విదేశీ రాయబార కార్యాలయాల దగ్గర భద్రత పెంచాలన్నారు. హైదరాబాద్ సహా తెలంగాణ అంతటా నిఘా వ్యవస్థ పటిష్టానికి ఆదేశించారు. కేంద్ర రక్షణ రంగ సంస్థల దగ్గర మరింత భద్రత పెంచాలన్నారు. తెలంగాణ పర్యటనకు వచ్చిన టూరిస్టులకు తగిన రక్షణ కల్పించాలని స్పష్టం చేశారు.అలాగే.. అత్యవసర పరిస్థితి ఎదురైతే నిత్యావసరాలకు ఇబ్బంది లేకుండా ఆహార నిల్వలు తగినంత ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. డెడికేటెడ్ మానిటరింగ్‌తో ఎప్పటికప్పుడు రిపోర్ట్‌లు ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తక్షణ నిర్ణయాలకు వీలుగా 24/7 అందుబాటులో అందుబాటులో ఉంటామని సీఎం, డిప్యూటీ సీఎం తెలిపారు. అటు.. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిఘా వ్యవస్థ పనితీరును సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. హైదరాబాద్ నగరంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు.మరోవైపు.. ఆపరేషన్ సింధూర్ తర్వాత పరిస్థితులు, సన్నద్ధతపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వివిధ శాఖల ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా.. విశాఖలోని తూర్పు నౌకాదళ కమాండ్ పరిధితో పాటు ఏపీలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న కీలకమైన రక్షణ రంగ సంస్థల దగ్గర భద్రత, తీరప్రాంత రక్షణపైనా చర్చించారు. ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కునేలా అన్ని స్థాయిల్లోనూ అధికారులు, సంస్థలు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వాల సన్నద్ధతపై కేంద్రం చేసిన సూచనలను పూర్తిగా అమలు చేయాలని.. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా తీర ప్రాంత జిల్లాల్లో భద్రతపై ప్రధానంగా దృష్టి పెట్టాలని మెరైన్ పోలీసులను ఆదేశించారు. నౌకాదళం, కోస్ట్‌గార్డు ఇతర రక్షణ దళాలతో సమాచారం పంచుకోవాలన్నారు. తిరుమల లాంటి ప్రదేశాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.మొత్తంగా.. భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న నేపథ్యంలో ఏపీ, తెలంగాణ అలెర్ట్ అయ్యాయి. రాబోయే ఎలాంటి పరిస్థితులైనా తట్టుకునేలా అన్ని శాఖల అధికారులను సన్నద్ధం చేస్తున్నాయి. అందులోనూ.. గత అనుభవాల దృష్ట్యా హైదరాబాద్‌లోని స్లీపర్ సెల్స్ యాక్టీవ్‌పై రేవంత్ సర్కార్ స్పెషల్ ఫోకస్ పెట్టడం ఆసక్తి రేపుతోంది.

# అడ్డగోలు అబార్షన్లు

నల్గొండ, మే 9, నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఆర్‌ఎంపీ క్లినిక్లు, అనుమతి లేని రక్త పరీక్షా కేంద్రాలు.. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్నాయి. విచ్చలవిడి వైద్యంతో ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.పరిధి దాటి వైద్యం చేస్తున్న కొందరు ఆర్‌ఎంపీలు పేదల ప్రాణాలు తీస్తున్నారు. ఆర్‌ఎంపీ బోర్డుతో కొందరు ఇష్టారీతిన వైద్యం చేస్తున్నారు. ప్రాథమిక చికిత్స చేయాల్సిన వారు రోజుల తరబడి వచ్చీరాని వైద్యం చేస్తున్నారు. రోగి ప్రాణాలకే ప్రమాదం వచ్చేలా వ్యవహరిస్తున్నారు.లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం. ఈ పరీక్షలు నిర్వహించినట్లు తేలితే కఠినశిక్షలు అనుభవించక తప్పదు. అందుకే వైద్య లు ఈ పరీక్షలు చేయడానికి నిరాకరిస్తుంటారు. పుట్టబోయే బిడ్డ ఆడా..మగా అన్నది తెలుసుకోవడానికి ప్రయత్నించడం కూడా నేరం. ఈ విషయంలో డాక్టర్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తుంటారు. ఎవరు ఎన్ని రకాలుగా ఒత్తిళ్లు తెచ్చినా పుట్టబోయే బిడ్డఆడా మగా అన్నది వెల్లడించరు.కానీ కొందరు అక్రమార్కులైన డాక్టర్లు మాత్రం దీన్నో ఆదాయవనరుగా చూస్తున్నారు. పుట్టబోయేది అమ్మాయి అని తేలితే కమిషన్లకు కక్కుర్తి పడి భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. కొంత మంది వైద్యరంగంలో మాఫి యాగా ఏర్పడి ధనార్జనే ధ్యేయంగా వ్యవహరించారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు సంబంధిత అధికారులు కన్నీళ్లు హడావుడి చేస్తున్నారు. తర్వాత చూసి చూడనట్లు వ్యవహిస్తున్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో హాలియా పట్టణ కేంద్రం లింగ నిర్ధారణకు, అబార్షన్లకు కేరాఫ్‌గా మారింది. ఆస్పత్రులు భ్రూణ హత్యలకు ప్రసిద్ధి చెందాయి. ఇటీవల తిరుమలగిరి సాగర్ ప్రాంతంలోనూ లింగనిర్ధారణ పరీక్షలు ఉన్నాయి. కొంతమంది ఆర్‌ఎంపీలు మీడియేటర్లుగా ఉంటూ ఈ దందా సాగిస్తున్నారు.అబార్షన్ చేయటానికి ఒక్కొక్కరి నుంచి రూ.25వేలు వసూలు..లింగ నిర్ధారణ పరీక్షలు చేసి..అబార్షన్ సాగర్ నియోజకవర్గ హాలియా పట్టణ కేంద్రం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలు వైద్యులుగా కన్నా కమిషన్ ఏజెంట్లుగానే ఎక్కువ సంపాదిస్తున్నారు. ఇక్కడ జరిగే మరో దారుణం.. కొన్నిసార్లు స్కానింగ్లో అమ్మాయన్న విష యం స్పష్టంగా తేలకపోయినాఅబార్షన్ డబ్బుల కోసం గర్భస్థ శిశువు అమ్మాయే అని చెబుతున్నారు కొందరు వైద్యులు.అబార్షన్ పూర్తయ్యాక అసలు విషయం తెలిసినా తల్లిదండ్రులు ఏం చేయలేక తేలుకు ట్టిన దొంగల్లా ఉండిపోతున్నారు. ఆడపిల్లా? మగపిల్లాడా అని చెప్పటానికి కోడ్ లాంగ్వేజ్..అసలు లింగనిర్ధారణ చేయడం, ఆడపిల్ల అని తేలితే అబార్షన్ చేయడం చట్టవిరుద్ధమని తెలిసినా.. ఆర్‌ఎంపీల మధ్య వర్తిత్వం లేకుండా వచ్చే గర్భిణులకు లింగనిర్ధారణ పరీక్షలు జరిపినప్పటికీ పుట్టబోయే బిడ్డ ఆడా, మగా అన్నది చెప్పరు.ఆర్‌ఎంపీ ద్వారా వస్తే మాత్రంఅపుట్టబోయేది ఎవరో తెలుసుకోవడం చిటికెలో పని. అయితే ఇది చట్టరీత్యా నేరం కాబట్టిఎవరూ నేరుగా మాట్లాడుకోరు. ఎలాంటి వైద్య పరమైన రసీదులూ ఉండవు. పుట్టబోయేది ఎవరో తెలుసుకునేందుకు డాక్టర్లకు, రోగులకు మధ్య ఓ కోడ్ లాంగ్వేజ్ ఉంటుంది. చిటికెనవేలు చూపిస్తే అబ్బాయని, రెండు వేళ్ళ చూపిస్తే పాప అన్నది అక్కడికి వచ్చిన అందరికీ అర్థమవుతుంది.ఆర్‌ఎంపీలు అనేకమంది ప్రయివేట్ నర్సింగ్ హోమ్లకు కమిషన్ ఏజెంట్లుగా పనిచేస్తూ భారీగా సంపాదిస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు,ఆడపిల్లంటే చిన్నచూపు, ప్రజల్లో అవగాహనారాహిత్యం వంటివి ఆర్‌ఎంపీలకు, అక్రమంగా డబ్బులు సంపాదిం చాలనుకునే డాక్టర్లకు వరంగా మారుతున్నాయి.

వైద్యారోగ్య శాఖ అధికారులు ప్రైవేటు ఆసుపత్రులపై అరకొర నిఘా వేస్తున్నారునిబంధనలు అతిక్రమించిన ఆసుపత్రులపై నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. 'దొరికితేనే దొంగ.. లేకపోతే దొర..' అన్న చందాన ఆసుపత్రి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అక్రమ మార్గం పట్టిన వైద్యులు, సిబ్బంది భ్రూణ హత్యలు చేసి శిశువులను చిదిమేస్తుంటే, ఆ అమానుషాన్ని ఆపాల్సిన వైద్యారోగ్య శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ముడుపులకు ఆశపడుతున్నారు. దీంతో సామాన్యుల ప్రాణాలు గాలిలో దీపాలవుతున్నాయి. ప్రైవేట్ హాస్పిటల్స్ కాసుల దందాలో భాగం అవుతున్న ఆర్‌ఎంపీలకు చెక్ పెడితే అక్రమ అబార్షన్ అపడమే కాదు నకిలీ వైద్యుల ఆగడాలను అరికట్టవచ్చంటున్నారు. పల్లెల్లో ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా ముందుగా గుర్తొచ్చేది ఆర్‌ఎంపీ డాక్టర్లే.దేవుళ్లను ఎంతగా నమ్ముతారో అంతకన్నా ఎక్కువగా గ్రామాల్లో ఆర్‌ఎంపీలను నమ్ముతారు. కుటుంబంలో ఎవరికీ ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా ఆర్‌ఎంపిల దగ్గరకు పరుగెత్తుకుని వెళ్తారు. అయితే ఆ గుడ్డి నమ్మకమే ఆర్‌ఎంపీ డాక్టర్లకు కాసుల వర్షం కురిపిస్తుండగా కొన్నిసార్లు రోగుల ప్రాణాల మీదకు తెచ్చిపెడుతుంది. పల్లెల్లో ఆర్‌ఎంపిల క్లినిక్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తుండగా ఓ తెలుగు సిని మాలో చూసినట్లు అర్హత లేని శంకర్ దాదా ఎంబీబీఎస్ డాక్టర్లు ఇంజక్షన్ల దగ్గర నుండి మొదలుకొని సున్తి వంటి చిన్నపాటి ఆపరేషన్ల వరకు ఎంచక్కా చేసేస్తున్నారు. మరికొందరు అదే క్లినిక్‌కు అనుబంధంగా మెడిక ల్ షాప్స్, పాథాలజి లాబ్స్ నిర్వహిస్తూ రోగ నిర్ధారణ పరీక్షలు చేసేస్తున్నారు.గ్రామాల లో ఆర్‌ఎంపీల వద్ద వైద్యం చేయించుకొని రోగం ముదిరిపోయాక డాక్టర్ల దగ్గరికి పరిగెత్తేవారు చాలా మందే ఉన్నారు. అసలు ఆర్‌ఎంపీల వైద్యంతోనే ప్రాణం మీదికి తెచ్చుకొనే వాళ్లు కూడా ఉన్నారు. దీనికి కారణం జిల్లాలో జనాభాకు తగ్గట్టు వైద్య లు లేకపోవడమే. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దగ్గరి నుంచి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి దాకా అన్ని స్థాయిల్లో సరైన వైద్యం అందుబాటులో లేదు.ఇది నల్లగొండ జిల్లా లో ఆర్‌ఎంపీలకు కలిసి వచ్చింది. జబ్బు చేశాక దూర ప్రయాణం చేయడానికి ఓపిక లేక కొందరు... ప్రైవేటు ఆస్పత్రులంటే బిల్లులకు జడిసి ఇంకొందరు ఊళ్లలో అందుబా టులో ఉండే ఆర్‌ఎంపీల దగ్గరే వైద్యం చేయించుకుంటున్నారు. ఇదే అదునుగా వారు రోగుల నుంచి డబ్బులు దండుకుంటున్నారు.పట్టణాల్లో ఉండే ప్రైవేటు, కార్పొరేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో.. వైద్యులతో కుమ్మక్కయి ఫలానా ఆస్పత్రికి వెళ్లండ ని రోగులను పంపిస్తున్నారు. ఆర్‌ఎంపీలు పంపిన రోగి వద్ద నుంచి ఆ ఆస్పత్రులు పరీక్షలు, స్కానింగ్లు అంటూ రూ.వేలకు వేలు గుంజుతున్నాయి.

అందులో కొంతమొత్తం వీరికి కమిషన్లా చెల్లిస్తున్నాయి. ఆర్‌ఎంపీలు, ప్రైవేటు ఆస్పత్రుల వ్యాపారం మూడు పూవులు, ఆరుకాయలుగా సాగుతోంది.పట్టణాల్లో ఆస్పత్రి యాజమాన్యాలు ఓ నలుగురు పీఆర్వోలను నియమించుకుని, ఊరూరా తిరిగి గ్రామాల్లో ఉండే ఆర్‌ఎంపీలను కలిసి సంబంధాలు పెట్టుకుంటు న్నాయి. రోగులను తమ ఆస్పత్రులకు పంపేలా ఒప్పందం కుదుర్చుకుంటున్నాయి.

వీటినే 'రెఫరల్' అంటారు.వీళ్లు పంపే రోగుల నుంచి వసూలు చేసే బిల్లుల్లో 30 నుంచి 40 శాతం ఆర్‌ఎంపీలకు రెఫరల్ చార్జీలుగా ఆస్పత్రి యాజమాన్యాలు ముట్టజెపుతున్నాయి. ఈ డబ్బుకు అలవాటు పడిన ఆర్‌ఎంపీలు అవసరం ఉన్నా లేకపోయినా తమ వద్దకు వచ్చే రోగులను పట్టణా ల్లోని ఆస్పత్రులకు పంపించడం మామూలైంది. ఈ మెడికల్ దందాతో సామాన్యులు దగా పడుతున్నారు.

# అయిన వాళ్లకే ఇందిరమ్మ ఇళ్లు

వరంగల్, మే 9, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గందరగో ళంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లావ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టు కింద మండలానికి ఒక ఊరు చొప్పున ఎంపిక చేసిన గ్రామాల్లోనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టారని, మిగిలిన గ్రామాల్లో రోజుకోతీరుగా నిబంధనల పేరుతో లబ్ధిదారుల ఎంపికలను తరచుగా మారుస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో నియోజకవర్గానికి ఏడాదికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని ప్రకటించారు.ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా పరిధిలో 482 గ్రామాలు ఉండగా, 6,35,872 మంది జనాభా ఉన్నారు. జనా భా సంఖ్య కు అనుగుణంగా గ్రామాల వారి గా తొలుత ఇండ్ల కేటాయింపు జరిగింది. ఆ మేరకు పంచాయతీ కార్యదర్శులు, గ్రామపంచాయతీ సిబ్బంది లబ్ధిదారుల నుండి స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 కేటగిరీలుగా విభజించి, క్షేత్రస్థాయికి వెళ్లి ఇండ్లు లేని లబ్ధిదారుల ఫోటోలను తీశారు.ఈ రకంగా రూపొందించిన జాబితా చాంతాడంతగా పెరిగిపోవ డంతో, నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మాత్రమే ఏడాదికి ప్రభుత్వం కేటాయిస్తుండడంతో మొదటి సంవత్సరానికి గాను లబ్ధిదారుల తగ్గించేందుకు వడపోవడానికి నిర్ణయించి, అర్హులైన జాబితాలో ఉన్న లబ్ధిదారులను ఐదు భాగాలుగా చేశారు. ఆ మేర కు మళ్లీ గ్రామాల్లో కేటాయింపు చేసిన ప్రకారం చూస్తే అర్హులైన వారు ఎక్కువగా ఉండడంతో, మళ్లీ వడపోత కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సంవత్సరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఎంపిక చేసిన అర్హులైన లబ్ధిదారుల్లో ఇండ్ల కేటాయింపు సంఖ్యకు తగ్గ ట్టుగా కుదించేందుకు కొత్త మార్గదర్శకాలను ప్రకటించారు. గతంలో ప్రభుత్వం నుండి ఇండ్లు పొందిన వారిని తొలగించారు. అలాగే ఇప్పటికే అనుమతి లేకుండా ఇండ్ల నిర్మాణం చేపట్టిన వారిని పక్కన పెట్టారు. ఆ తర్వాత ట్రాక్టర్, కారు ఉన్న వారిని తొలగించారు. అలాగే కుటుంబంలో ఎవరైనా ప్రభు త్వ ఉద్యోగి ఉంటే వారిని కూడా పక్కకు పెట్టారు.చివరకు ఒక్క కొడుకు ఉండి పక్క గృహం ఉంటే ఇల్లు మంజూరు చేయకూడదని నిర్ణయించారు. ఈ విధంగా వడ పోసి నప్పటికి గ్రామానికి కేటాయించిన ఇండ్ల సంఖ్యకు, మొదటి విడత అర్హులైన వారికి ఇండ్లు కేటాయించే పరిస్థితి కొన్నిచోట్ల లేకపోగా, మరి కొన్ని చోట్ల సంఖ్య ఎక్కువ ఉండి అర్హులైన లబ్ధిదారుల సంఖ్య తక్కువగా ఉండటంతో వచ్చే ఏడాది జాబితాలో ఉన్న వారిని చేర్చుతున్నారు. ఇలా చేర్పులు మార్పులతోనే కాలం వెళ్లదీస్తుండడంతో ఇప్పటికీ అర్హులైన లబ్ధిదారుల ఎంపిక వ్యవహారం ఓ కొలిక్కి రావడం లేదంటున్నారు.దీనితో పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో మినహా ఇతర గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు వ్యవహారం రోజుకో తీరుగా మారుతూ గందరగోళంగా తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందిరమ్మ కమిటీ ప్రతిపాదించిన వారికి పలు గ్రామాల్లో చోటు దక్కడం లేదని, ఇంకొన్ని చోట్ల అనర్హులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ఎంపిక చేస్తున్నారని విమర్శలు వస్తు న్నాయి. అయితే మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ ఇవ్వలేదని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.తాతల కాలం నుండి పాతకాలం మట్టి ఇంట్లోనే ఉంటున్న. మట్టి కొంతమేర కూలిపోతే రేకులు వేసుకొని కాలం వెళ్లదీస్తున్నాం. ఇది తప్ప నాకు ఎక్కడ కూడా సెంటు భూమి లేదు. అయినా నాకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించలేదు. మా ఊర్లో అత్యంత పేదల్లో నేనొక్కడిని. ఫోటో తీసుకుని వెళ్లారు. ఇల్లు గురించి అడిగితే ఎవరు సరిగ్గా సమాధానం చెప్పడం లేదు. దయచేసి నాకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి పుణ్యం కట్టుకోండి.

## నెలకు 4 కోట్ల అద్దె...

హైదరాబాద్, మే 9, తాజాగా.. టాప్ ఐటీ సేవల సంస్థల్లో ఒకటైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ హైదరాబాద్ నగరంలో ఓ కార్యాలయ స్థలాన్ని లీజుకు తీసుకుంది. నానక్‌రామ్‌గూడ రాజపుష్ప పారడిగ్మ్‌లో ఏకంగా 10 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని టీసీఎస్ 15 సంవత్సరాల కాలానికి లీజుకు తీసుకుంది. అయితే ఆఫీస్ స్పేస్ నెలవారీ అద్దె తెలిస్తే షాక్ అవ్వాల్సిందే. ఈ స్థలం కోసం టీసీఎస్ నెలకు రూ. 4.37 కోట్ల అద్దె చెల్లించనుంది. అంతేకాకుండా, ఆరు నెలల అద్దెకు సమానమైన రూ. 26.2 కోట్లను సెక్యూరిటీ డిపాజిట్‌గా ముందే చెల్లించింది. మొ?త్తం ఏడాది కాలానికి 52.44 కోట్లు అద్దె రూపంలో చెల్లించనుంది. రెంటల్ అగ్రిమెంట్ ప్రకారం.. ప్రతి ఏడాది 12 శాతం చొప్పున అద్దె పెరుగుదల ఉంటుంది.ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ అయిన రాజపుష్ప గ్రూప్ అభివృద్ధి చేసిన రాజపుష్ప పారడిగ్మ్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నడిబొడ్డున ఈ కమర్షియల్ బిల్డింగ్ నిర్మించింది. 2022లో నిర్మాణం పూర్తయిన ఈ భవనంలో 19 అంతస్తులు ఉన్నాయి. ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ఫుడ్ కోర్ట్, గ్రీనరీ, జిమ్, ఏటీఎం వంటి ఆధునిక సౌకర్యాలు కల్పించారు.

# ఎల్ ఆర్ ఎస్ తో 200 కోట్ల పైగా ఆదాయం

హైదరాబాద్, మే 9, తెలంగాణలో హాట్ టాపిక్‌గా ఉన్న లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం.. లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ ఎల్‌ఆర్ఎస్ గడువు ముగిసింది. అయితే ఇకపై కూడా ప్రజలు ఎల్‌ఆర్ఎస్ ఫీజులు చెల్లించవచ్చని.. కాకపోతే రాయితీ వర్తించదని అధికారులు తెలిపారు. హెచ్ఎండీఏ పరిధిలో ఎల్‌ఆర్ఎస్ కింద రూ.218 కోట్ల ఆదాయం సమకూరింది. ఇటీవల పెంచిన మూడు రోజుల గడువు కూడా ముగియడంతో ఇక నుంచి ఎల్‌ఆర్ఎస్ ఫీజులపై రాయితీ ఉండదని అధికారులు స్పష్టం చేశారు.ఎల్‌ఆర్ఎస్ గడువు ముగిసినా సరే.. సమస్యలు మాత్రం అలానే ఉన్నాయి. కొందరు ఎల్‌ఆర్ఎస్ రుసుము చెల్లించి రెండు నెలలు గడిచినా ప్రొసీడింగ్స్ ఇంకా పూర్తి కాలేదు. దాంతో నెలల నుంచి ప్రొసీడింగ్స్ కోసం ఇంకా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొని ఉందిన. అయితే ఉన్నతస్థాయిలో.. హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడంతో ఇప్పటికీ ఎల్1 అనుమతుల్లో జాప్యం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.ఎల్‌ఆర్ఎస్ ప్రారంభమైనప్పటి నుంచి గడువు ముగిసే వరకు హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 70 వేల మందిపైనే రుసుము చెల్లించగా...కేవలం 4 వేల వరకు మాత్రమే ప్రొసీడింగ్స్ జారీ చేశారు. రుసుము చెల్లించిన దరఖాస్తులకు సంబంధించిన వివరాలను తొలుత క్షేత్రస్థాయిలో (ఎల్1 క్లియరెన్స్) పరిశీలిస్తారు.ప్రారంభంలో రెవెన్యూ నుంచి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇరిగేషన్ నుంచి ఏఈ, తర్వాత హెచ్ఎండీఏ నుంచి జేపీవో లేదా ఏపీవో పరిశీలించి నివేదికను అనుమతులకు పంపిస్తారు. అయితే ఇప్పటికే ఎల్1 తనిఖీలు పూర్తయినా.. ప్రొసీడింగ్స్ ముందుకు కదలడం లేదు. ఇందు కోసం చాలామంది హెచ్ఎండీఏ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఫీజు చెల్లించిన వారందరికీ నెల రోజుల్లో ప్రొసీడింగ్స్ జారీ చేస్తామని అధికారులు చెబుతున్నారు.వాస్తవానికి ఎల్‌ఆర్ఎస్ గడువు.. మార్చి 31కే ముగిసింది. అయితే అప్పటికి కూడా చాలా మంది ఎల్‌ఆర్ఎస్ చేయించుకోకపోవడంతో ప్రభుత్వం మరో గడువు ఇచ్చింది. ఏప్రిల్ 30 వరకు ఎల్‌ఆర్ఎస్ గడువు పెంచారు. మేనెల ప్రారంభం నాటికి గడువు ముగిసినా.. ఇంకా కొంతమంది మిగిలే ఉన్నారు. అందుకే.. ప్రభుత్వం మరో 3 రోజులు ఛాన్స్ ఇచ్చింది. ఇప్పటి వరకు 25 శాతం రాయితీతో ఎల్‌ఆర్ఎస్ చేయించుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు గడువు ముగియడంతో.. రాయితీ వర్తించదు.ప్రభుత్వం అధికారికంగా లేని లేఅవుట్లను అధికారికంగా మార్చేందుకు తెచ్చిన స్కీమే ఎల్‌ఆర్ఎస్. అలాంటి భూములు ఉన్నవారు.. ఆ భూములకు పక్కా లెక్కలు రాయించుకొని, వాటిని చట్టబద్ధంగా పొందుతారు. అలా పొందేందుకు బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే.. అనగా 2020లో ఈ ఎల్‌ఆర్ఎస్ స్కీమ్ వచ్చింది.

# రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

నల్గొండ రాబోయే 4 సంవత్సరాలలో రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదవారికి కట్టించి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా ,నకిరేకల్ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో నిర్మించిన నమూనా ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు.

అనంతరం అక్కడే ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పేదవాడు బలోపేతం అయ్యేందుకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తున్నామని తెలిపారు.

పూర్తి పారదర్శకంగా ఇల్లు లేని, కనీసం గోడ కూడా కట్టుకోలేని వారికి మొదటి విడతలో ఇండ్లను కేటాయిస్తున్నామని చెప్పారు. రాబోయే నాలుగు సంవత్సరాలలో విడతలవారీగా అర్హులైన పేదవారందరికీ ఇండ్లు ఇస్తామని, మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇండ్లు ఇవ్వడం జరిగిందని ,ఇంకా 3 విడతలుగా ఇండ్లను ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేదవారందరికీ 20 లక్షల ఇండ్లను 5 లక్షల రూపాయల వ్యయంతో కట్టించి ఇస్తామన్నారు.

భూ సమస్యలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టం దేశానికే రోల్ మోడల్ కానుందని అన్నారు. జూన్ 2 నుండి ప్రతి మండలం, ప్రతి రెవెన్యూ గ్రామానికి తహసిల్దార్ స్థాయి అధికారులు వచ్చి న్యాయమైన భూ సమస్యలను పరిష్కరించనున్నారని తెలిపారు. భూ భారతిలో పెండింగ్లో ఉన్న తొమ్మిది లక్షల ఇరవై ఆరువేల సాదా బైనమాల దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారందరికీ శాశ్వతంగా పరిష్కారమయ్యేలా ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి హక్కు లు కల్పించనున్నామన్నారు.భూ భారతి చట్టాన్ని దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునే విధంగా తీర్చిదిద్దామని, ధరణి కేవలం కొద్ది మందికి మాత్రమే ఉపయోగపడిందని, భూ భారతిలో సమస్యలన్నిటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భూ భారతి లో నకిరేకల్ మండలాన్ని పైలెట్ మండలం గా తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు.

గత ప్రభుత్వం పేదవాడి కోరికలన్ని తుంగలో తొక్కి , వారి స్వార్థం కోసం తాపత్రయపడడం తప్ప ఎలాంటి ఉపయోగపడే పని చేయలేదని, 45 శాతం ఇండ్లకు మిషన్ భగీరథ నీళ్లు రావటం లేదని,తాము అధికారంలోకి వచ్చాక 650 కోట్లు ఖర్చు చేసి తాత్కాలికంగా తాగునీటి ఏర్పాట్లు చేసి తాగు నీటిని అందిస్తున్నామన్నారు. లక్ష పదివేల కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం నిర్మిస్తే కూలిపోయిందని అన్నారు.

గడచిన 15 నెలల్లో తెలంగాణ రాష్ట్రంలో వైద్యంపై 11800 కోట్లు ఖర్చు చేశామని, గత ప్రభుత్వం సంవత్సరానికి 5650 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని తెలిపారు. విద్యలో భాగంగా హాస్టల్స్, పాఠశాలలు కట్టించడమే కాకుండా, 58 నియోజకవర్గాలలో 11600 కోట్లతో ప్రతి నియోజకవర్గానికి 200 కోట్ల రూపాయలతో ఒక్కొక్కటి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను కట్టిస్తున్నామన్నారు. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని 80% డైట్ చార్జిలను పెంచామని, 200% కాస్మోటిక్ చార్జీలు పెంచామన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకు ఎల్ పీజీ కనెక్షన్, రాజీవ్ ఆరోగ్య శ్రీ కింద పరిమితిని పదిక్షలకు పెంచడం,మహిళలకు ఉచిత బస్సు, ఒక్కొక్కరికి ఆరు కేజీలు చొప్పున సన్న బియ్యం వంటి పథకాలను తమ ప్రభుత్వం అమలు చేస్తున్నదని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన నకిరేకల్ శాసనసభ్యుల కోరిక మేరకు నకిరేకల్ మండలానికి నూతన తహసిల్దార్ కార్యాలయ భవనాన్ని మంజూరు చేశారు .అదేవిధంగా మండలంలో పెండింగ్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# పెళ్లి ట్రాక్టర్ బోల్తా..ఇద్దరు మృతి

గుడివాడ గుడ్లవల్లేరు మండలం విన్నకోటలో విషాదం నెలకొంది. పెళ్లి ట్రాక్టర్ బోల్తా ఇద్దరు బాలురు మృతి చెందారు. ఘటనలో మరో ఐదుగురికి గాయాలు అయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా వుంది. నందివాడ మండలం గాజులపాడులో జరిగిన వివాహ వేడుక ముగించుకొని 20 మందితో తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. డ్రైవర్ జేబులో సెల్ఫోన్ తీసేందుకు ప్రయత్నిస్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పింది. ప్రమాదంలో ముత్యాల అరుణ్(16), కనకవల్లి అభిషేక్(15) మృతి చెందారు. గుడ్లవల్లేరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అంబటి రాయుడుకు వార్నింగ్

హైదరాబాద్, మే 9 భారత్, పాకిస్థాన్ మధ్య భీకర దాడులు జరుగుతున్నాయి. పహల్గాం ఉగ్రదాడికి కౌంటర్?గా భారత్ ఆపరేషన్ సిందూర్?తో ప్రతీకారం తీర్చుకోగా.. ఆపరేషన్ సిందూర్?కు కౌంటర్?గా భారత్ పై పాక్ దాడులకు పాల్పడింది. పాక్ దాడులను భారత త్రివిధ దళాలు ఎక్కడికక్కడ తిప్పికొట్టాయి. ప్రాణాలు ఫణంగా భారత జవాన్లు వీరోచితంగా పోరాడుతున్నారు. ఈ క్రమంలో భారత జవాన్ల ధీరత్వాన్ని యావత్ దేశమే కొనియాడుతోంది. జవాన్ల ధైర్యసాహసాలను పలువురు సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు ప్రశంసిస్తున్నారు. ఈ క్రమంలో టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు చేసిన ట్వీట్ తీవ్ర వివాదస్పదంగా మారింది. పాక్ దాడులకు భారత్ అంతే ధీటుగా సమాధానం ఇస్తోన్న వేళ.. 'కన్నుకు కన్ను సమాధానం కాదు' అంటూ రాయుడు చేసిన ట్వీట్ దుమారం రేపుతోంది. 'కన్నుకు కన్ను తీసుకుంటే ప్రపంచమంతా గుడ్డిదవుతుంది' అని రాయుడి చేసిన ట్వీట్?పై నెటిజన్లు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. ఇదిలా ఉండగానే.. "న్యాయం జరగాలి కానీ మానవత్వాన్ని మరచిపోకూడదు. దేశాన్ని ప్రేమిస్తున్నప్పటికీ గుండెల్లో దయ ఉండాలి" అని మరో ట్వీట్ చేసి అగ్నికి ఆజ్యం పోశాడు. రాయుడు ట్వీట్లు చూసి ఆగ్రహంతో రగిలిపోతున్న నెటిజన్లు.. అమాయకుల ప్రాణాలను పొట్టనబెట్టుకుంటున్న ఉగ్రవాదులపై జాలి, దయ ఏంటంటూ మండిపడుతున్నారు. నరరూప రాక్షసులు ఉగ్రవాదులపై జాలి, దయ చూపిస్తూ.. సైనికుల త్యాగాలను కించపర్చేలా మాట్లాడుతోన్న అంబటి రాయుడిపై నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు. 'ఒరేయ్ అంబటి రాయుడు.. నువ్వు పాకిస్తాన్ వెళ్లిపో' అని కొందరు.. 'వీడిని జనసేన నుంచి తరిమేయండి పవన్ కల్యాణ్ గారు" అని ఇంకొందరు కామెంట్లతో విరుచుకుపడుతున్నారు. ఎప్పుడో ఏదో ఒక ఇష్యూతో వార్తల్లో ఉండటం రాయుడికి అలవాటేనని కొందరు ఎద్దేవా చేస్తున్నారు. కాగా, క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న తర్వాత అంబటి రాయుడు పాలిటిక్స్ లోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ స్థాపించిన జనసేన పార్టీలో ప్రస్తుతం రాయుడు కొనసాగుతున్నాడు.

పాకిస్థాన్ దుష్ట పన్నాగాలపై భారతదేశం ఘాటుగా స్పందిస్తున్న వేళ రాయుడు, "కన్నుకు కన్ను అంటే ప్రపంచమంతా అంధకారమవుతుంది." అని ట్వీట్ చేశాడు. ఆయన పోస్టుపై నెటిజన్లు ఫైర్ అయ్యారు. ఒక నెటిజన్ వెంటనే ట్వీట్‌ను తొలగించమని కోరాడు. మరొకరు, మనం అలా అనుకుంటున్నంత వరకు మన రెండు కళ్ళు పోతాయని అన్నారు.వివాదం పెరుగుతున్న విషయాన్ని గమనించిన రాయుడు మరో పోస్ట్ చేసి నష్ట నివారణకు ప్రయత్నించాడు. ఆయన రాశారు–"జమ్మూ కాశ్మీర్, పంజాబ్, భారత సరిహద్దులోని ఇతర ప్రాంతాలలో అందరి భద్రత, శాంతి కోసం ప్రార్థన చేస్తున్నాను. దీనితో ప్రభావితమైన ప్రతి ఒక్కరికి బలాన్ని, భద్రతను , త్వరితగతిన కోలుకునే శక్తి ఇవ్వాలని ఆశిస్తున్నాను. జై హింద్." అని పోస్టు చేశాడు. ఏప్రిల్ 22న పహల్గాంలో పాకిస్తాన్ ఉగ్రవాదులు 26 నిర్దోషులను చంపారు. దీనికి ప్రతిగానే భారతదేశం, పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద కేంద్రాలపై దాడి చేసింది. మొత్తం 9 ఎయిర్ స్ట్రైక్‌లు చేసింది. ఈ ఎయిర్ స్ట్రైక్‌లో పాకిస్తాన్‌లోని ఉగ్రవాద కేంద్రాలను నాశనం అయ్యాయి. అప్పటి నుంచి పాకిస్తాన్ ఆగ్రహంతో ఊగిపోతోంది. ఏదోలా భారత్‌ను దెబ్బతీయాలని విఫలయత్నం చేస్తోంది. పాకిస్థాన్ చేస్తున్న అన్ని దుస్సాహసాలను భారత్ విజయవంతంగా తిప్పికొడుతోంది.

# మురళి నాయక్ మృతికి సీఎం చంద్రబాబు సంతాపం

తాడేపల్లి దేశ రక్షణలో శ్రీ సత్యసాయి జిల్లా, పెనుకొండ శాసనసభ నియోజకవర్గం, గోరంట్ల మండలానికి చెందిన మురళి నాయక్ అనే సైనికుడు ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు.. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళి నాయక్ కు నివాళులు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని అన్నారు.

# ముగ్గురు పోలీసులకు మంత్రి సీతక్క నివాళులు




వరంగల్ ములుగు జిల్లా వాజేడులో మందుపాతర పేలుళ్లలో మరణించిన ముగ్గురు పోలీసులకి మంత్రి సీతక్క ఘన నివాళులు అర్పించారు. వరంగల్ జిల్లా కేంద్రంలో వారి మృతదేహాలను సందర్శించి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారుఏ. మరణించిన పోలీసుల కుటుంబాలను ఓదార్చారు మంత్రి సీతక్క.

## గాయపడిన వృద్ధురాలకు సహాయం అందించి...మానవత్వం చాటుకున్న గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము....

## రోడ్డు ప్రమాద బాధితురాలినీ తన వాహనంలో ఆసుపత్రికి తరలింపు...

## ఆస్పత్రికి వెళ్లి ప్రమాద బాధిత వృద్ధురాలిని పరామర్శించిన ఎమ్మెల్యే రాము

గుడివాడ 09:రోడ్డు ప్రమాద బాధిత వృద్ధురాలిని తన వాహనం ద్వారా ఆసుపత్రికి పంపించి... వేగంగా వైద్య చికిత్సలు అందేలా చర్యలు తీసుకొని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మానవత్వం చాటుకున్నారు.

గుడివాడ రూరల్ మండలం బొమ్ములూరులో ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో వాహనంపై ఉన్న నందివాడ మండలం పెద్దలింగాల గ్రామానికి చెందిన అచ్చమ్మ అనే వృద్ధురాలు కింద పడిపోయి, గాయాలతో బాధపడుతుంది. గుడ్లవల్లేరు మండలం విన్నకోటలో ట్రాక్టర్ ప్రమాద బాధితులను పరామర్శించేందుకు అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము..... ప్రమాదాన్ని చూసి, గాయపడిన వృద్ధురాలు పరిస్థితిని గమనించి తన వ్యక్తిగత సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో హుటాహుటిన వృద్ధురాలు అచ్చమ్మను ఆయన కారులో గుడివాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద బాధితురాలికి వేగంగా సహాయం అందేలా ఎమ్మెల్యే రాము ఆసుపత్రి డాక్టర్లకు ఫోన్ చేసి చర్యలు తీసుకున్నారు.విన్నకోట పర్యటన ముగించుకున్న అనంతరం గుడివాడలోని ఆసుపత్రికి చేరుకొని చికిత్స పొందుతున్న వృద్ధురాలు అచ్చమ్మను ఎమ్మెల్యే రాము పరామర్శించారు.వృద్ధురాలి ఆరోగ్య పరిస్థితి వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

వృద్ధురాలు ప్రాణాలు కాపాడేందుకు ఎమ్మెల్యే రాము చేసిన సహకారానికి అచ్చమ్మ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. అంబులెన్స్ వచ్చేవరకు వేచి ఉంటే కొంత ఆలస్యం అయ్యి అచ్చమ్మ పరిస్థితి మరింత విషయం అయ్యేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.అడక్కుండానే సహాయం అందించిన ఎమ్మెల్యేకు అచ్చమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు చెప్పారు. అచ్చమ్మకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు

## నేషనల్ డిఫెన్స్ ఫండ్ కు ప్రజా ప్రతినిధుల విరాళం

హైదరాబాద్ పాకిస్థాన్లోని ఉగ్రవాద శిబిరాలపై సైనిక దాడి నేపథ్యంలో నేషనల్ డిఫెన్స్ ఫండ్ కు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు ఒక నెల వేతనం విరాళంగా ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో చర్చించారు. సీఎం సూచన మేరకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీతో చర్చించి ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించనున్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## ఐపీఎల్ వాయిదా

## దేశం కంటే క్రికెట్ గొప్పేం కాదు

ముంబై, మే 9 ఇండియా–పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులలో క్రికెట్ ఫ్యాన్స్ ను ఉర్రూతలూగిస్తూ వస్తున్న ఐపీఎల్ నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. ఐపీఎల్ రద్దు అవుతందని, లేదా నిరవధిక వాయిదా ఉంటుందనే ఊహాగానాల నడుమ మ్యాచ్ ల నిర్వహణపై బీసీసీఐ క్లారిటీ ఇచ్చింది. అసలు ఈ ఐపీఎల్ సీజన్ కంటిన్యూ అవుతుందా లేక పూర్తిగా రద్దవుతుందా అనే విషయంపై క్లారిటీ ఇచ్చింది బీసీసీఐ.నిరవధిక వాయిదా అంటూ వస్తున్న వార్తలపై క్లారిటీ ఇచ్చింది ఃఅఅఎ. ఇప్పటికిప్పుడు ఒకే ఒక్క వారం రోజులు మాత్రం మ్యాచులు నిలిపివేస్తున్నామని.. వారం రోజుల తర్వాత అప్పటి పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. దేశం కంటే.. మన దేశ సైనికుల కంటే క్రికెట్ గొప్పది కాదంటూ కూడా స్పష్టం చేసింది బీసీసీఐ.గురువారం (మే 8) అర్ధంతరంగా ధర్మశాలలో పంజాబ్ – ఢిల్లీ మ్యాచ్ ను వాయిదా చేసిన బీసీసీఐ చర్చోపచర్చల తర్వాత ఐపీఎల్ పై శుక్రవారం (మే 9) క్లారిటీ ఇచ్చింది. ఎఖఒ 2025 ను వారం రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఇవాళ (శుక్రవారం మే 9) జరగాల్సిన లక్నో – బెంగళూరు మ్యాచ్ వాయిదా పడింది. "టాటా ఐపీఎల్ 2025 షెడ్యూల్ ను వారం రోజుల పాటువాయిదా వేస్తున్నట్లు బీసీసీఐ నిర్ణయం తీసుకుంది" అని సెక్రెటరీ దేవజిత్ సైకియా ప్రకటించారు. తదుపరి షెడ్యూల్ ను ఇండియా–పాక్ మధ్య ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఉద్రిక్తతలు తగ్గటం లేదా దీనిపై పూర్తి క్లారిటీ వచ్చిన తర్వాత షెడ్యూల్ ప్రకటిస్తామని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో క్రికెట్ కంటే దేశమే ముఖ్యమని, ప్రభుత్వానికి, సైనికులకు సంపూర్ణ మద్ధతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్ లో ప్రాణాలకు తెగించి పోరాడిన సైనికుల పక్షాన బీసీసీ నిలుస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. క్రికెట్ దేశ ప్రజల ప్యాషన్ అయినప్పటికీ.. దేశ భద్రత, ప్రయోజనాలతో పోల్చినప్పుడు దేశమే ముఖ్యమని పేర్కొన్నారు. బీసీసీఐ నిర్ణయాన్ని అర్థం చేసుకుని సహకరిస్తున్న బ్రాడ్ కాస్టర్ జియో స్టార్ కు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా టైటిల్ స్పాన్సర్ టాటాతో పాటు అసోసియేట్ స్పాన్సర్స్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## అంబాలాలో యుద్ధ సైరన్లు

ఛండీఘడ్, మే 9 హర్యానా రాష్ట్రం.. అంబాలాలో యుద్ధ సైరన్లు మోగించారు ఎయిర్ పోర్స్ అధికారులు. 2025, మే 9వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల 20 నిమిషాల సమయంలో.. అంబాలాలోని ఎయిర్ ఫోర్స్ నుంచి ఈ సైరన్లు మోగించారు అధికారులు. పాకిస్తాన్ దేశం నుంచి దాడి జరిగే అవకాశం ఉంది.. ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలి అంటూ హెచ్చరికలు జారీ చేశారు అధికారులు. జనం అంతా ఇళ్లల్లోకి వెళ్లిపోవాలని.. కిటికీలకు దూరంగా ఉండాలని.. కరెంట్ ఆఫ్ చేసుకోవాలని సూచిస్తూ.. ఎయిర్ ఫోర్స్ నుంచి హెచ్చరికలు వచ్చాయి. 9వ తేదీ తెల్లవారుజామున చండీఘడ్ లోనూ ఇలాగే సైరన్లు మోగిస్తూ.. హెచ్చరికలు జారీ చేశారు సైనిక అధికారులు. ఆ తర్వాత అంబాలా ఎయిర్ ఫోర్స్ క్యాంప్ నుంచి ఇలాంటి హెచ్చరికలు రావటంతో.. జనం అంతా ఇళ్లల్లోకి వెళ్లిపోయారు. రోడ్లు అన్నీ ఖాళీ అయ్యాయి. జనం ఇళ్లల్లోకి వెళ్లిపోయారు.అంబాలా సిటీలో ఎయిర్ ఫోర్స్ స్టేషన్ ఉంది. అంబాలా సిటీ అనేది పాకిస్తాన్ సరిహద్దులకు స్ట్రాటజికల్ లోకేషన్ లో ఉంది. ఇక్కడి నుంచి రాఫెల్ యుద్ధ విమానాలు సైతం ఆపరేట్ అవుతుంటాయి. అంబాలా సిటీలోని ఎయిర్ ఫోర్స్ స్టేషన్ అనేది భారత్ కు అత్యంత కీలకం. పాకిస్తాన్ ఇప్పుడు అంబాలా సిటీని టార్గెట్ చేస్తూ డ్రోన్, మిస్సైల్ దాడులు చేయొచ్చనే ఉద్దేశం, అనుమానాలతో ముందస్తుగా ఈ యుద్ధ సైరన్స్ మోగించింది. అంబాలా సిటీలో యుద్ధ సైరన్స్ మోగించటంతోపాటు.. ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు ఆర్మీ అధికారులు. దాడులు జరిగే ప్రమాదం ఉందని.. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు అంబాలాలోని ఎయిర్ ఫోర్స్ స్టేషన్ అధికారులు.

## రంగంలోకి టెరిటోరియల్ ఆర్మీ

న్యూఢిల్లీ మే 9 పహల్గామ్ ఉగ్రదాడి.. దానికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ భద్రతను మరింత పటిష్టం చేసేందుకు, సాధారణ సైన్యానికి సహాయం అందించేందుకు టెరిటోరియల్ ఆర్మీని రంగంలోకి దించేందుకు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదికి విస్తృత అధికారాలను కల్పిస్తూ.. రక్షణ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. టెరిటోరియల్ ఆర్మీ రూల్స్ 1948లోని రూల్ 33 ప్రకారం రక్షణ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త అధికారాల ద్వారా ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది.. టెరిటోరియల్ ఆర్మీలోని అధికారులను, సిబ్బందిని అత్యవసర భద్రతా విధుల కోసం లేదా సాధారణ సైన్యం కార్యకలాపాలకు మద్దతుగా ఉపయోగించవచ్చు.రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం, టెరిటోరియల్ ఆర్మీ రూల్ అధికారాలను వినియోగిస్తూ.. కేంద్ర ప్రభుత్వం టెరిటోరియల్ ఆర్మీలోని ప్రతి అధికారిని అవసరమైన కాపలా కోసం లేదా సాధారణ సైన్యానికి మద్దతుగా లేదా అనుబంధంగా ఉండేందుకు పిలిచే అధికారాన్ని ఆర్మీ చీఫ్‌కు మంజూరు చేస్తోందని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న 32 ఇన్ఫాంట్రీ బెటాలియన్ల (టెరిటోరియల్ ఆర్మీ) నుంచి 14 బెటాలియన్లను సదరన్ కమాండ్, ఈస్టర్న్ కమాండ్, వెస్టర్న్ కమాండ్, సెంట్రల్ కమాండ్, నార్తర్న్ కమాండ్, సౌత్ వెస్టర్న్ కమాండ్, అండమాన్ నికోబార్ కమాండ్, ఆర్మీ ట్రైనింగ్ కమాండ్ (ఆర్ట్రాక్) ప్రాంతాల్లో మోహరించనున్నారుఅయితే బడ్జెట్‌లో నిధులు అందుబాటులో ఉంటే లేదా అంతర్గత పొదుపుల ద్వారా నిధులు సమకూర్చిన తర్వాత మాత్రమే ఈ మోహరింపునకు ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుంది. రక్షణ మంత్రిత్వ శాఖ కాకుండా ఇతర మంత్రిత్వ శాఖల అభ్యర్థన మేరకు యూనిట్లను మోహరిస్తే.. ఆ ఖర్చు సంబంధిత మంత్రిత్వ శాఖల ఖాతాలోనే జమ చేయబడుతుందని.. రక్షణ మంత్రిత్వ శాఖ బడ్జెట్ కేటాయింపులో చేర్చబడదని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఆర్మీ చీఫ్‌కు లభించిన ఈ అధికారాలు.. దేశ భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి, ఎలాంటి సవాళ్లనైనా సమర్థవంతంగా ఎదుర్కోవడానికి భారత సైన్యానికి మరింత వెసులుబాటును కల్పిస్తాయి.

# అమరులైన వారికి పరిహారం ఎంతో తెలుసా

హైదరాబాద్, మే 9 భారత సైన్యంలో అగ్నివీర్‌గా పనిచేస్తూ అమరుడైన సైనికుడి కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుంది. అయితే ఇది సాధారణ జవాన్ అమరుడైతే వచ్చే సొమ్ము కంటే తక్కువగా ఉంటుంది. అయితే జీవిత బీమా, ఎక్స్‌గ్రేషియా, సర్వీసులో మిగిలి ఉన్న కాలానికి సంబంధించిన జీతం, సేవా నిధి ప్యాకేజీ, ఆర్మ్‌డ్ ఫోర్సెస్ బ్యాటిల్ క్యాజువాలిటీ ఫండ్ నుంచి అదనపు సహాయం, తక్షణ ఆర్థిక సహాయం వంటివి ఆ అగ్నివీర్ కుటుంబానికి అందుతాయి. అయితే ఇవన్నీ కలిపితే సుమారు రూ. 1 కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకు పరిహారం అందుతుందని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది.పాకిస్తాన్ చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో జమ్మూ కాశ్మీర్‌లో భారత్, పాక్ మధ్య జరిగిన కాల్పుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం గడ్డం తాండ పంచాయతీలోని కళ్లితండాకు చెందిన మురళీ నాయక్ అనే అగ్నివీర్ అమరుడయ్యాడు. సాధారణంగా భారత త్రివిధ దళాల్లో సైనికులుగా పనిచేస్తూ.. విధి నిర్వహణలో శత్రువులతో పోరాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారికి.. కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ రకాల పరిహారం, సహాయం, అవార్డులు వంటివి లభిస్తాయి. అయితే కొన్నేళ్ల కింద కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం.. భారత త్రివిధ దళాల్లో చేరేవారి కోసం అగ్నివీర్ అనే పథకాన్ని తీసుకువచ్చింది. ఈ అగ్నివీర్ పథకం కింద భారత సైన్యంలో చేరే జవాన్లు కేవలం 4 ఏళ్ల పాటు మాత్రమే సేవలు అందిస్తారు. ఆ తర్వాత అందులో 25 శాతం మందిని మాత్రమే తీసుకుని.. మిగిలిన వారిని పక్కనపెడతారు. ఒకవేళ విధుల్లో ఉన్న అగ్నివీర్ అమరుడైతే ఎలాంటి సహాయం అందుతుంది అనేది ఈ స్టోరీలో చూద్దాం.భారత సైన్యంలో అగ్నివీర్ పథకం కింద చేరిన సైనికుడు సర్వీసులో అమరుడైతే.. వారి కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయంతోపాటు వివిధ రూపాల్లో అండగా నిలుస్తుంది. అమరుడైన అగ్నివీర్ కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండేందుకు పలు కీలక గైడ్‌లైన్స్‌ను కేంద్రం రూపొందించింది.

జీవిత బీమా:

అగ్నివీర్‌గా చేరిన ప్రతీ సైనికుడికి రూ. 48 లక్షల విలువైన జీవిత బీమా కల్పిస్తారు. ఒకవేళ సర్వీసులో అగ్నివీర్ మరణిస్తే ఆ మొత్తం వారి కుటుంబ సభ్యులకు అందిస్తారు. ఈ జీవిత బీమా ప్రీమియంను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఈ జీవిత బీమా అనేది శిక్షణలో ఉన్నపుడైనా, యుద్ధంలో అయినా, సహజ మరణానికి అయినా వర్తిస్తుంది.విధి నిర్వహణలో భాగంగా అమరుడైన అగ్నివీర్ కుటుంబానికి అదనంగా రూ. 44 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తారు. ఇది జీవిత బీమాకు సంబంధం లేకుండా అగ్నివీర్ కుటుంబానికి అందే అదనపు ఆర్థిక సహాయం.

# కావాల్సినంత పెట్రోల్ ఉంది...

హైదరాబాద్, మే 9 దేశవ్యాప్తంగా ఇంధనం, ఒఖఉ సరఫరాలు పుష్కలంగా ఉన్నాయని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ శుక్రవారం ప్రకటించింది. "ఇండియన్ ఆయిల్ దేశవ్యాప్తంగా తగినంత ఇంధన నిల్వలను కలిగి ఉంది. మా సరఫరా లైన్లు సజావుగా బాగానే పని చేస్తున్నాయి. భయాందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇంధనం, ఒఖఉ అవుట్‌లెట్లు అన్నీ అందుబాటులో ఉన్నాయి" అని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపిందిప్రజలు ప్రశాంతంగా ఉండాలని, అనవసరమైన భయాందోళన చెందకుండా ఉండాలని సూచించింది. దీని వల్ల సరఫరా కార్యకలాపాలు సాగించడానికి, అందరికీ నిరంతరాయంగా పెట్రోల్‌ను సరఫరా చేయడానికి సహాయపడుతుందని కంపెనీ నొక్కి చెప్పింది. "ప్రశాంతంగా ఉండటం, అనవసరమైన రద్దీని నివారించండి. మీకు సేవ చేయడంలో సహాయపడండి. ఇది మా సరఫరా లైన్లను సజావుగా ఉండేలా చేస్తుంది. అందరికీ నిరంతరాయంగా పెట్రోల్ లభించేలా చేస్తుంది." అని చీ (గతంలో ట్విట్టర్)లో పోస్ట్‌లో పేర్కొంది.రెండు అణ్వాయుధ దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య ప్రజలు ఇంధనాన్ని నిల్వ చేసుకోవడానికి బారులు తీరుతున్నారు. పెట్రోల్ బంకుల వద్ద క్యూలు ఉంటున?నాయి. ఈ వీడియోలు సోషల్ మీడియా వైరల్ అవుతున్నాయి. దీన్ని చూసిన తర్వాత ఇంధన సంస్థ ఈ ప్రకటన చేసింది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (ఖనీఐ) అంతటా తొమ్మిది ప్రదేశాల?లో ఉన్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని భారత్ దాడి చేసింది. ఈ 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పాకిస్థాన్‌లో అలజడి రేగింది.

## యుద్ధభూమిలో జవాను మురళి నాయక్ వీరమరణం

### సంతాపం వ్యక్తం చేసిన మంత్రి లోకేష్



తాడేపల్లి అపరేషన్ సిందూర్ లో భాగంగా జమ్మూ కశ్మీర్ యుద్ధభూమిలో పోరాడుతూ మన రాష్ట్రానికి చెందిన మురళి నాయక్ వీరమరణం పొందడం నన్ను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని మంత్రి అన్నారు. . శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం గడ్డంతాండ పంచాయతీ కళ్లి తాండా గ్రామానికి చెందిన మురళి నాయక్ చూపిన ధైర్య,సాహసాలు రాష్ట్రానికే గర్వకారణం. మురళీ నాయక్ పార్థివ దేహానికి రాష్ట్రప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపిస్తాం. ఆయన కుటుంబానికి అన్నివిధాలా అండగా నిలుస్తామని అన్నారు.

# మిస్ వరల్డ్ పోటీలు... అంతా సిద్ధం

హైదరాబాద్, మే 9 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ప్రపంచ సుందరి పోటీలకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది. మే 09 శనివారం సాయంత్రం గచ్చిబౌలి స్టేడియంలో వైభవంగా ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. మిస్ వరల్డ్ సంస్థతో కలిసి తెలంగాణ ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. విదేశీ ప్రసార మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కల్పించడంతో రాష్ట్ర ఖ్యాతిని మరింత పెంచే ప్రయత్నం చేస్తోంది. ప్రపంచ దేశాల సుందరీమణులతో పాటు అంతర్జాతీయ మీడియా ఫోకస్ కూడా ఇక్కడ ఉండడంతో భాగ్యనగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దారు అధికారులు.మిల్ వరల్డ్ పోటీల నిర్వహణద్వారా రాష్ట్ర ప్రతిష్టను పెంచడంతో పాటూ పెట్టుబడుల ఆకర్షణకు అందాల పోటీలు వినియోగించుకోవాలని భావిస్తోంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం. అందుకే వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందడంతో పెట్టుబడుల సాధన, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని భావిస్తోంది.మే 10 నుంచి 31 వరకు ఈవెంట్ కొనసాగుతుంది. వివిధ దేశాల నుంచి వచ్చే అతిథులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని.. ఇప్పటికే 80శాతానికి పైగా అతిథులు, పోటీదారులు హైదరాబాద్ చేరుకున్నారని సైబరాబాద్ జాయింట్ అఖ గజారావ్ భూపాల్ వెల్లడించారు. వారికి కేటాయించిన హోటల్స్ దగ్గర కూడా భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అతిథులు ఉండే పరిసరాలను రెడ్ జోన్, గ్రీన్ జోన్‌గా పెట్టామన్నారు. అనుమతి లేకుండా ఎవరికి లోపలకు అనుమతి ఉండదని, తెలంగాణలో చాలా ప్రదేశాలను ప్రత్యేక అతిథులు సందర్శిస్తారని తెలిపారు. మిస్ వరల్డ్ పోటీల కోసం ఎలాంటి ట్రాఫిక్ డైవర్షన్లు ఉండవని స్పష్టం చేశారు. అఓ , గవర్నర్, మంత్రులు, ఎఎఖ, ఎఎఎఖలకు ప్రోటోకాల్ ఉంటుందని తెలిపారు. ఇతర జిల్లాల నుంచి కూడా ప్రత్యేక ఫోర్స్ తప్పించామని తెలిపారు. మే 31న జరగనున్న మిస్ వరల్డ్ ఫైనల్స్ కి సంబంధించి కూడా భద్రతా పరమైన చర్యలు చేపట్టామని అఖ గజారావ్ భూపాల్ పేర్కొన్నారు.ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటికే 100 మందికి పైగా సుందరీమణులు హైదరాబాద్ చేరుకున్నారు. మిస్ వరల్డ్ లిమిటెడ్‌కు చెందిన ప్రతినిధులు, సహాయకులు ఇప్పటికే వచ్చేశారు. రానున్న రెండు రోజుల్లో వివిధ దేశాల నుంచి మరింతమంది ప్రతినిధులు నగరానికి రానున్నారు. పోటీలకోసం సిద్ధమైన గచ్చిబౌలి స్టేడియంలో గురువారం రిహార్సల్స్ ఉత్సాహంగా సాగాయ్. నగరంలో వివిధ ప్రాంతాల్లో జరిగే ఈ వేడుకలను వీక్షించే అవకాశం సామాన్యులకు కల్పిస్తోంది ప్రభుత్వం. ఈ మేరకు టూరిజం వెబ్‌సైట్ ఫ్టబిబిజూబ://బినీబీతీతిబఎ.బివశ్రీజీనిణజీనిజీ.ఐనీల. తిని/వలవనిబిబడబతినిణశ్రీవ/ఎతిబబడ లినీతీశ్రీటడ వలవనిబి లో రిజిస్టర్ చేసుకోవచ్చని సూచించింది. పోటీల జరిగే ఒక్కో కేంద్రంలో వెయ్యి మంది సామాన్యులు వీక్షించేందుకు అవకాశం కల్పిస్తున్నారు మరోవైపు వివిధ దేశాలకు చెందిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ మే16న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం పిల్లల మర్రిని సందర్శించనున్నారు. ఈమేరకు జిల్లా పిల్లల మర్రిలో అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. 750 సంవత్సరాల చరిత్రఉన్న పిల్లల మర్రి చెట్టు, పురావస్తు మ్యూజియం, రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని అందగత్తెలు సందర్శించనున్నారు.

## అమలాపురంలో రైతుకు అండగా వైసిపి నిరాహారదీక్ష

అమలాపురం అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం లో రైతుకు అండగా వైసిపి రిలే నిరాహారదీక్ష నిర్వహించింది. ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్ష సాగింది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు జరిగాయి. అరకొర కొనుగోళ్ళు కాకుండా పండిన ధాన్యం మొత్తం కొనాలని డిమాండ్ చేసారు. తడిచి రంగు మారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేసారు. అధిక సంఖ్యలో వైసీపీ నేతలు ,మాజీ ఎమ్మెల్యేలు,కార్యకర్తలు పాల్గొన్నారు.జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ రైతుల పక్షాన వైసిపి ఎప్పుడు అండగానే నిలుస్తుంది. ధాన్యం కొనుగోలుకు మద్దతు ధర ఇవ్వకపోతే వైయస్సార్ శ్రేణులు పాకిస్తాన్ లాంటి కూటమి ప్రభుత్వాన్ని కూల్చడం కోసం ఉద్యమిస్తామని అన్నారు.

# పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం నశించాలి

## శ్రీకాళహస్తిలో జర్నలిస్టుల ర్యాలీ

కాళహస్తి మే 9 పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం నశించాలంటూ శ్రీకాళహస్తిలో జర్నలిస్టులు కదం తొక్కారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై సంఘీభావంగా గురువారం పట్టణ నాలుగు మాడ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించొద్దని నినదించారు. అంతర్జాతీయంగా పాక్ ను ఒంటరి చేయాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్ పేరిట పహల్గామ్ ఘటనలో పర్యాటకుల ప్రాణాలు బలిగొన్న ఉగ్రవాదులను మట్టుపెట్టడం హర్షించదగ్గ పరిణామమంటూ కొనియాడారు. పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని కూకటి వేళ్ళతో సహా పెకలించేంతవరకు ఆపరేషన్ సిందూర్ కొనసాగించాలని ఆకాంక్షించారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతంలో కీలక భూమిక పోషించిన భారత ప్రభుత్వానికి, ఆర్మీకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి కార్తీక్ నాయుడు, వీఆర్వో ఈశ్వర్, సీనియర్ పాత్రికేయులు, షేక్ రిజ్వాన్ పఠాన్, షేక్ షోహన్, బాలచంద్ర, హరిబాబు, కామేష్, చంద్రశేఖర్, రఫీ, ధన శేఖర్, వెంకటేష్, జయశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మర్ కోచింగ్ క్యాంప్ లలో క్రీడాకారులను తీర్చిదిద్దాలి: అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు



**సికింద్రాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్, మే 09: సమ్మర్ కోచింగ్ క్యాంప్ ల ద్వారా క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించి క్రీడాకారులను తీర్చిదిద్దాలని అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు సంబంధిత కోచ్ లను ఆదేశించారు. శుక్రవారం ఆయన సికింద్రాబాద్ జోన్‌లోని వివిధ ప్లే గ్రౌండ్‌లు, స్విమ్మింగ్ పూల్స్ ను సంబంధిత జోన్ గేమ్స్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంప్ లకు మంచి స్పందన లభిస్తుందని, గ్రేటర్ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 6 నుండి 16 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు సమ్మర్ కోచింగ్ క్యాంప్ లను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం ఆరు జోన్లలో వివిధ క్రీడా విభాగాల్లో నిష్ణాతులైన 77 మంది పార్ట్ టైం కోచ్ లు, 800 మంది గౌరవ వేతన కోచ్ ల ద్వారా సమ్మర్ కోచింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నామని తెలిపారు. 44 విశాలమైన బహుళ క్రీడా సముదాయాలు, 29 స్విమ్మింగ్ పూల్స్, 13 ఆట స్థలాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ లలో 44 రకాల ఆటలలో శిక్షణను ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.

# సైన్యానికి అండగా నిలబడాలి

ముంబై, మే 9 కిస్థాన్ తన ఉగ్రవాద కార్యకలాపాలను కాపాడుకునేందుకు నేరుగా భారత ఆర్మీతో పాటు సరిహద్దు గ్రామాల్లోని సాధారణ పౌరులపై మిస్సైల్స్, డ్రోన్ అటాక్స్ ప్లాన్ చేస్తూ పూర్తిగా నిరాశకు గురవుతోంది. మె?దటి నుంచి పూర్తిగా సన్నద్ధంతో ఉన్న భారత ఆర్మీ పాక్ చర్యలను అదే స్థాయిలో తిప్పికొడుతూ భారీగా ఆస్తి నష్టంతో పాటు పాక్ ప్రభుత్వ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తోంది. ఈ చర్యలను దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో పాటు ప్రజలు, ప్రభుత్వాలు స్వాగతిస్తున్నాయి.ఈ క్రమంలో రాష్ట్రీయ సేవా సంఘ్( ఖీూ) కూడా స్వాగతించింది. దేశంలోని పౌరులందరూ తమ దేశభక్తిని చూపించాలని సమయం ఇదేనంటూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రజలందరికీ పిలుపునిచ్చారు. ఈ క్రమంలో స్థానిక అధికార యంత్రాంగంతో పాటుగా సాయుధ దళాలకు తమ సహకరాన్ని అందించాలని సూచించారు. వారికి ఏ సమయంలో ఎలాంటి సహాయం కావాలన్నా ముందుకు రావాలని, దేశ ఐక్యతకు రక్షణకు తమ వంతు సహకారం ప్రజలు ఈ సమయంలో అందించాలన్నారు. గడచిన రెండు రోజులుగా పాక్ చర్యలను అంతర్జాతీయంగా ఎండగడుతూనే మరో పక్క ఆర్మీ ధీటుగా చర్యలను కొనసాగిస్తూ ఆపరేషన్ సిందూర్ ని ముందుకు తీసుకెళ్లటాన్ని మోహన్ భగవత్ ప్రశంశించారు. పాక్ ప్రేరేపిస్తున్న ఉగ్రవాదం, వారు చేస్తున్న దాడుల్లో పహల్గామ్ బాధిత కుటుంబాలకు దీంతో న్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు. పాక్ భూభాగంలో పీవోకేలోని ఉగ్రవాదుల స్థావరాలపై చేసిన దాడులను తాము పూర్తిగా సమర్థిస్తున్నామని అన్నారు మోహన్ భగవత్. ఈ క్రమంలో దేశం ఆర్మీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. పాక్ ఆర్మీ సామాన్యులపై, ఆధ్యాత్మిక స్థలాలపై, పౌరుల నివాసాలపై చేసిన దాడుల్లో మరణించిన వ్యక్తుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి అత్యవసర సమయంలో మనమందరం జాగ్రత్తగా ఉంటూ.. సామాజిక ఐక్యత, సామరస్యాన్ని దెబ్బతీసేందుకు దేశ వ్యతిరేక శక్తులు చేసే కుట్రలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు మోహన్ భగవత్.

# ఢిల్లీలో హై అలర్ట్..

న్యూఢిల్లీ, మే 9 ఇండియా- పాక్ ఉద్రిక్తతల నడుమ దేశ రాజధాని ఢిల్లీ ఎమర్జెన్సీ పరిస్థితులకు సిద్ధమైంది. ఢిల్లీ వ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారు అధికారులు. అత్యవసర పరిస్థితులు ఎప్పుడు వచ్చినా ఎదుర్కునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పౌరులను అలర్ట్ చేసేందుకు భద్రతా దళాలు ఢిల్లీలో సైరన్ లు ఏర్పాటు చేశారు. రక్షణ శాఖ ఆధ్వర్యంలో అధికారులు ఢిల్లీలో సైరన్ టెస్ట నిర్వహించారు. ఐటీఓ లోని ఖచిఆ (పబ్లిక్ వర్క్స్ డిపార్ట్మెంట్) బిల్డింగ్ పై సైరన్ ను ఇన్ స్టాల్ చేసి పరీక్షించారు. మధ్యాహ్నం 3 గంటలకు సైరన్ ను 15 నుంచి 20 నిమిషాల పాటు మోగించారు.పాకిస్తాన్ మిస్సైల్స్, బాంబులు ప్రయోగించే అవకాశం ఉన్నందున రాజధాని వ్యాప్తంగా సైరన్ లు ఏర్పాటు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సైరన్ లను మోగిస్తారు. ఆ సమయంలో ప్రజలు బయటకు రాకుండా సురక్షిత ప్రాంతాలలో ఉండాలనే ఉద్దేశంతో సైరన్ మోగిస్తారు.భద్రతా దళాల అధికారులు సైరన్ లను ఏర్పాటు చేస్తున్న సమయంలో ఢిల్లీ మంత్రి పర్వేశ్ వర్మ కూడా సమీక్షించారు. సైరన్ పరీక్షిస్తున్నప్పుడు ప్రజలు ఆందోళనకు గురి కావద్దని ముందుగానే సందేశం పంపారు. ఢిల్లీలోని అన్ని ఎత్తైన భవనాలపై సైరన్ లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్క సైరన్ సుమారు 8 కిలోమీటర్ల వరకు వినిపిస్తుంది. శుక్రవారం రాత్రి 40 నుంచి 50 సైరన్ లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏదైన అత్యవసర పరిస్థితుల్లో సైరన్ మోగిస్తామని, వెంటనే ప్రజలు ఇళ్లల్లోకి సురక్షిత ప్రాంతాలలోకి వెళ్లి తల దాచుకోవాలని సూచించారు.

# సైన్యానికి సంఘీభావం..

## తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్

జగిత్యాల,పహల్గాం దురాగతానికి ప్రతీకారంగా పాకిస్థాన్ పై భారత్ సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కు తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ సంఘీభావం వ్యక్తం చేసింది.శుక్రవారం జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయంలో భారత సైన్యానికి సంఘీభావం గా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మితాయిలు పంచిపెట్టి సంబురాలు జరిపారు.అనంతరం సీనియర్ సిటీజేన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ తీవ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న భారత దేశానికి,భారత సైన్యానికి ప్రతి భారతీయుడు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. భారతదేశ ఆడ బిడ్డల నుదిటి సింధూరంను తుడిచి వేయలనుకునే ఉగ్రమూకలకు ఆపరేషన్ సిందూరే సమాధానమన్నారు.ఈ ఆపరేషన్ సిందూర్ విజయవంతం సంబరాల కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,ఉపాధ్యక్షులు బొల్లం విజయ్,పి.సి.హన్మంత రెడ్డి,ఎం.డి.యాకూబ్,కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు,ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.ఆశోక్ రావు,
సత్యనారాయణ, దిండిగాల విఠల్,దేవేందర్ రావు,నారాయణ, ఇంద్రయ్య,సయ్యద్ యూసుఫ్,ఎం.డి.ఇక్బాల్,యాకూబ్ హుస్సేన్, జాన్సన్,కరుణ,విజయ లక్ష్మి,రాధ,జిల్లా,డివిజన్,మండల

# ఎస్.హెచ్.జీ లకు బ్యాంక్ రుణాల్లో జిల్లాకు అవార్డ్

**వరుసగా రెండో సారి**

**ఇందిరా మహిళా శక్తి లక్ష్య సాధనలో రుణాలు కీలకం**

**డీఆర్డీఓ, సిబ్బందికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందన**

**ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయాలి**



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మే -09 (ప్రజాబలం ప్రతినిధి)**ఎస్ హెచ్ జీ లకు బ్యాంక్ లింకేజీ రుణాలు అందించడంలో ఉత్తమ సేవలు అందించిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ బాధ్యులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి లక్ష్య సాధనలో భాగంగా ఎస్ హెచ్ జీ లకు బ్యాంక్ లింకేజీ రుణాలు ఇప్పించిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, సిబ్బందిని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందించి, అన్ని విభాగాల్లో ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. బ్యాంకులింకేజి ద్వారా స్వశక్తి సంఘ సభ్యులకు ఋణాలు ఇప్పించడంతో వారు ఆర్థికంగా ఎదుగుతున్నారని వివరించారు. జిల్లాలో బ్యాంకులింకేజి 2024-25 సంవత్సరం నకు గాను లక్ష్యం 7969 సంఘాలు రూ. 533.73 కోట్లు కాగా 4376 సంఘాలు రూ,, 542.30 కోట్లతో 102% ప్రగతి సాధించినందున.. అలాగే ఫర్ గ్రూప్ ఫైనాన్స్ రూ 12.48 లక్షలు ఇవ్వటంలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉండటం వలన రాష్ట్ర స్థాయిలో జిల్లాకు అవార్డు రావటం వచ్చిందని తెలిపారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క , ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్, సీఈవో సెర్ప్ దివ్య దేవరాజన్ నుంచి డి ఆర్ డి ఓ, అదనపు డి ఆర్ డి ఓ, డిపిఎం తదితరులు, జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ సరిత స్వీకరించారని తెలిపారు.

99.74 శాతం రికవరీ....

బ్యాంకులింకేజి రికవరీ 99.74%, రాష్ట్రంలో జిల్లా రెండవ స్థానంలో ఉందని, 2023- 24 ఆర్థిక సంవత్సరంలో కూడా లక్ష్య సాధనలో భాగంగా బ్యాంకు లింకేజి 106 శాతం సాధించినందుకు గాను జిల్లాకు అవార్డు ఇచ్చారని, ఎస్ హెచ్ జి లకు ఎంటర్ ప్రైజేస్ గ్రౌండింగ్ 100 శాతం చేశారని కలెక్టర్ వెల్లడించారు.

రుణాలతో ఆర్థిక ప్రగతి..

మహిళా సంఘాల బాధ్యులు జిల్లాలో బ్యాంకులింకేజి ద్వారా ఋణం తీసుకుని నూనె మిల్లులు, బిర్యాని పాయింట్స్, టిఫిన్ సెంటర్, పచ్చళ్ళు, మిల్లెట్స్ పిండి, లడ్డు ఇతర పదార్థాలు , కిరాణం దుకాణాలు, బ్యూటి పార్లర్లు , సారీ సెంటర్స్, జిరాక్స్ సెంటర్స్ ,క్యాంటిన్, ఈవెంట్ మేనేజ్ మెంట్, డైరీ ఉత్పత్తులు, గేదెల పెంపకం వివిధ రకాల ఆధాయాభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఆర్థిక ప్రగతి సాదిస్తూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఆ పిల్లల ఉన్నత విద్యాభ్యాసానికి కూడా రుణాలు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు.ఈ ఆర్థిక సంవత్సరం కూడా ఇందిరా మహిళా శక్తి లక్ష్యం ఈ 2025-26 సంవత్సరం డిసెంబర్ లోపు పూర్తి చేసి రాష్ట్రంలో జిల్లాని ప్రథమ స్థానంలో ఉంచాలని కలెక్టర్ ఆకాంక్షించారు.కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి శేషాద్రి, అదనపు అధికారి శ్రీనివాస్, డిపిఎంలు సీసీలు జిల్లా సమాఖ్య బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నగర ప్రజల అవసరాలను తీర్చేందుకు మై జిహెచ్ఎంసి యాప్




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్, మే 09:నగర ప్రజల అవసరాలను తీర్చేందుకు మై జిహెచ్ఎంసి యాప్ సమస్యల పరిష్కారం తో పాటు అవసరమైన సేవలు పొందేందుకు మై జిహెచ్ఎంసి ఉపయోగించుకోవచ్చు. ఈ యాప్ ద్వారా శానిటేషన్, ఇంజనీరింగ్, హెల్త్, స్ట్రీట్ లైట్, రోడ్స్, డ్రెయిన్ క్లీనింగ్, రోడ్ స్వీపింగ్ సమస్యల పై ఫోటో గ్రాప్ తో పాటుగా జియో లొకేషన్ ద్వారా ఫిర్యాదు చేస్తే డైరెక్ట్ గా పరిష్కారం కోసం సంబంధిత అధికారికి చేరుకుంటుంది. తమ సమస్య పరిష్కారం అయ్యిందో లేదో తెలుసుకోవడానికి చెక్ చేసుకునే వెసులుబాటు తో పాటుగా ఫీడ్ బ్యాక్ సబ్మిట్ చేసుకోవచ్చు. గ్రేటర్ ప్రజలు సర్వీసెస్ కూడా పొందవచ్చు. ట్రేడ్ లైసెన్స్, ప్రాపర్టీ టాక్స్, భవన నిర్మాణ వ్యర్థాలు తొలగింపు కోసం వెహికిల్ బుకింగ్ సింగిల్ క్లిక్ ద్వారా చేసుకోవచ్చు. క్రెడిట్, డెబిట్ కార్డు, యుపిఐ ద్వారా పేమెంట్ చేసుకునే అవకాశం ఈ యాప్ ద్వారా చేసుకోవచ్చు. వీటితో పాటుగా జిహెచ్ఎంసి కార్యాలయాల లొకేషన్, వెదర్ అలెర్ట్, ఇంకా చాలా అవసరమైన సేవలు పొందవచ్చు. గ్రేటర్ ప్రజల సౌకర్యం కోసం ఈ యాప్ మరింత ఈజీగా ఉపయోగం చేసుకొనే విధంగా ఉన్నందున ప్రజలు వినియోగించుకొని సేవలతో పాటు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారం పొందవచ్చునని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ కోరారు.

మై జిహెచ్ఎంసి యాప్ ను ఆండ్రాయిడ్, ఐఓఎస్ ఈ రోజు మీ మొబైల్ లోని ప్లే స్టోర్ ద్వారా డౌన్ లోడ్ చేసుకొని సమస్యలు, సేవలు పొందవచ్చునని కమిషనర్ పేర్కొన్నారు. ఉపయోగించుకునే విధానం ఫోటో క్లిక్ ద్వారా మీ సమస్యను పంపవచ్చును. మీ సమస్య పరిష్కారం స్టేటస్ ను ట్రాక్ చేసుకొని ఏదైనా, ఎక్కడైనా స్టేటస్ ను చెక్ చూసుకోవచ్చు. సమస్య పరిష్కారం అయిన వెంటనే ఫీడ్ బ్యాక్ ఇవ్వవచ్చును. లొకేట్ వార్డు ఆఫీస్ ఆప్షన్ లోకి వెళ్తే జిహెచ్ఎంసి ఆఫీస్ ల లొకేషన్ తెలుసుకోవచ్చు. ట్రేడ్ లైసెన్స్, పెట్ డాగ్ లైసెన్స్ కోసం అప్లై చేసుకునే ఫ్యూ క్లిక్ తో వెసులుబాటు ఉంటుంది.సిటీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు.

# జిల్లాలో వేగంగా ధాన్యం సేకరణ

## జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 09 :** జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి ఆఖరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 251 కేంద్రాలు ద్వారా 7 వేల 990 మంది రైతుల వద్ద నుండి 65 వేల 970 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 39 కోట్ల 13 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు.రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు అదనపు బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నిత్యం 4 వేల నుండి 6 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 355 లారీల ద్వారా 1 వేయి 600 నుండి 8 వేల టన్నుల ధాన్యం కరీంనగర్లోని 56 మిల్లులకు, జిల్లాలోని 16 మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 5 కోట్ల రూపాయల నుండి 8 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు ఆటోమెటిక్ యంత్రంతో శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల వద్దకు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకురావాలని,అకాల వర్షాల సమయంలో కేంద్రాలలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించుకోవాలని తెలిపారు.ధాన్యం కొలతలు పరీక్షించి గ్రేడ్ ఎ,సాధారణ రకాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు,నీడ, ఓ.ఆర్.ఎస్.,గోనె సంచులు,టార్పాలిన్లు ఇతర అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.





# తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్ను మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 09 :** టూర్ ప్రోగ్రామ్లో భాగంగా జిల్లాలోని జైపూర్లో గల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ అతిథి గృహంలో రాత్రి బసకు విచ్చేసిన తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్ను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా న్యాయమూర్తులు, డి.సి.పి. ఎ. భాస్కర్, సింగరేణి అధికారులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

# జవహర్నగర్లో ముగ్గురు కార్మికుల దుర్ఘటన బాధకారం...... మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

## బాధిత కుటుంబాలకు పరిహారం



**ముషీరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్, మే 09: జవహర్నగర్లో జరిగిన విషాదకర ప్రమాదంలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి విచారం వ్యక్తం చేసారు. జవహర్నగర్లో జరిగిన విషాద ఘటనపై శుక్రవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శానిటేషన్అధికారులు, రామ్కి ప్రాజెక్టు యాజమాన్యంతో సమావేశమై సమీక్షించారు.

ఈ సందర్భంగా రామ్కీ ప్రాజెక్టు యాజమాన్యం ప్రమాద కారణాలను మేయర్ కు వివరించారు. భవిషత్ లో ఇలాంటివి పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రాంకీ ప్రాజెక్ట్ డైరెక్టర్ అగర్వాల్ ఈ ఘటనపై స్పందిస్తూ, ఇది అనుకోని ప్రమాదమని, అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పబ్లిక్ వర్క్స్ కాంట్రాక్టు నిబంధనల ప్రకారం ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 15 లక్షల పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా, మొదటివిడతగా ఒక్కొక్కరికి రూ. 4 లక్షల పరిహారం ఈరోజే మంజూరు చేసినట్లు మేయర్ కు వివరించారు.

మేయర్ స్వయంగా నగరంలో పారిశుధ్య పరిస్థితిని సమీక్షించి,నగర శుభ్రతపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాబోయే మిస్ వరల్డ్ పోటీలో %స్రష్టఎష% భాగస్వామ్యం అవుతు

న్న %శీ%దున నగరాన్ని మరింత శుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే దిశగా ప్రతి చర్య మార్గదర్శిగా ఉండాలని మేయర్ తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రతిరోజు సమీక్షిస్తానని, పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా లేనట్లయితే తీవ్ర చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. ప్రతిరోజు నివేదికలను తనకు అందజేయాలని మేయర్ సూచించారు.

ఆ దిశగా ఇప్పటికే 700 బిన్లు ఏర్పాటు చేసామని, త్వరలో మరో 300 బిన్లు ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత అధికారులు మేయర్ కు తెలిపారు.

ఈ సమావేశంలో శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్ , రామ్ కీ ప్రాజెక్ట్ డైరెక్టర్ అగర్వాల్,ఫస్యా, తదితరులు పాల్గొన్నారు.

# అబలకు అత్యవసరంగా రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్న సబ్ ఇంజనీర్ ఎక్కల్ దేవి హరిప్రసాద్

కోరుట్ల, ఓ అబలకు అత్యవసరంగా రక్తదానం చేసి ప్రాణభిక్ష పెట్టి జగిత్యాల జిల్లా మన్నెగూడెం విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ ఎక్కల్ దేవి హరిప్రసాద్ మానవత్వాన్ని చాటుకున్నారు. రక్తదాత సబ్ ఇంజనీర్ ఎక్కల్ దేవి హరిప్రసాద్ వైద్యులు, ఉద్యోగులు, రోగి బంధువులు, మిత్రులు అభినందించారు. వివరాల్లోకి వెళితే కోరుట్ల పట్టణంలోని రేని ఎమర్జెన్సీ ఒ క్రిటికల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మెట్ పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన రాజుబాయి అనే మహిళకు అత్యవసరంగా ఓ నెగటివ్ రక్తం అవసరం అని వైద్యులు చెప్పడంతో అరుదుగా దొరికే ఓ నెగటివ్ రక్తాన్ని కుటుంబ సభ్యులు రక్తదాత కోసం వెతుకుతూ ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సుర్గి శ్రీనివాస్ రక్తదాత అనుసంధాన కర్త ఉదయ్ కుమార్ ను సంప్రదించగా మన్నెగూడెం విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ ఎక్కల్ దేవి హరిప్రసాద్ ను సంప్రదించారు. స్పందించిన సబ్ ఇంజనీర్ ఎక్కల్ దేవి హరిప్రసాద్ మెట్ పల్లిలోని బ్లడ్ బ్యాంక్ కి వెళ్లి రక్తదానం చేశారు. కుటుంబ సభ్యులతో ఫంక్షన్ కి వెళ్ళవలసి ఉండగా రక్తం అవసరం సమాచారం ఫోన్ చేయగానే వెంటనే బ్లడ్ బ్యాంక్ కి వెళ్లి మన్నెగూడెం సబ్ ఇంజనీర్ ఎక్కల్ దేవి హరిప్రసాద్ రక్తదానం చేశారు. సొంతింటి వాళ్ళకే ఆపదలో ఆదుకునేందుకు ఆలోచించే ఈ రోజుల్లో ఒక్కక్షణం ఆలోచించ కుండా అరుదుగా దొరికే ×ఓ నెగటివ్ రక్తం అవసరం అని చెప్పగానే వెంటనే స్పందించి కుటుంబ సభ్యులతో బ్లడ్ బ్యాంక్ కి వచ్చి రక్తదానం చేసిన మన్నెగూడెం విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ ఎక్కల్ దేవి హరిప్రసాద్ ను బ్లడ్ బ్యాంక్ డాక్టర్ రాజనీకర్ రెడ్డి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ - సుర్గి శ్రీనివాస్,రక్తదాతఅనుసంధాన కర్త ఉదయ్ కుమార్, విద్యుత్ ఉద్యోగులు, రోగి బంధువులు, స్నేహితులు అభినందించారు.

# జలమండలి లైన్ మెన్ల చిత్ర విచిత్ర లీలలు




**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 9 మే 2025**గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ మునిసిపాలిటీ నాయకులు శుక్రవారం రోజున నెక్నంపూర్ పరిధి అల్కాపూర్ రోడ్డు 1 పరిసరప్రాంత ప్రజలను కలుసుకొని స్థానిక సమస్యల సేకరణ సందర్భముగా:

1. జలమండలి లైన్ మెన్ లు వారి ఇష్టానుసారం వ్యవహరిస్తూ ఇష్టం ఉన్న ప్రాంతంలో 2 గంటల మంచినీటి సరఫరా గావిస్తూ, మిగతా ప్రాంతాల్లో వేళా పాల లేకుండా అరగంట మాత్రం సరఫరా గావిస్తూ చిత్ర విచిత్ర లీలలు చూపుతున్నారని వాపోయారు. ఇకపోతే స్పోర్ట్స్ పార్కులో గల నీటి రిజర్వాయర్ ను నామమాత్రంగా ఫిబ్రవరి 6న మొదలు పెట్టి ఇప్పటికి నీటి సరఫరా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తపరిచినారు.



2. ప్రఖ్యాతి చెందిన అలకపూర్ కాలనీలో దరిదాపు అన్ని ఖాళీస్థలం లతో పాటు వీధులన్నీ కుప్పి తొట్టి మాదిరి చెత్తా చెదరంతో ఉండడం అందుకు మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పరిపాటిగా ఉందని వ్యక్తపరిచారు.

3. విద్యుత్ సరఫరా సరిగా లేదని, వీధి దీపాలు అసలు వెలగడం లేవని చిమ్మ చీకటిలో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోయారు.

ప్రభుత్వ అధికారులు పైన తెలిపిన సమస్యల పరిష్కార మార్గం చేపట్టాలని బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సీతారం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, అందే లక్ష్మణ్ రావు, బొమ్ము ఉపేందర్నాథ్ రెడ్డి, షేక్ ఆరిఫ్ మహమ్మద్, రాజేంద్ర ప్రసాద్, సుమనళిని, బొడ్డు శ్రీధర్, కలీల్ లు కలసి కట్టుగా డిమాండ్ చేస్తున్నారు.

# బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (మే 9 ప్రజాబలం )** అందోల్ నియోజకవర్గం అందోల్ మండలం డాకూర్ గ్రామానికి చెందిన పీర్ల సుధాకర్, తండ్రి మొగులయ్య, వయసు 60 సంవత్సరాలు వృత్తి వ్యవసాయం,నిన్న గురువారం మే 8 2025, మధ్యాహ్నం అందాజా రెండున్నర గంటల సమయంలో ఆందోల్ జోగిపేట వైపు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తుండగా తన బైక్ నెంబర్ (15 %ఖీు% 2338) స్పెండర్ బైక్ పై వెళుతూ, బైకును అదుపు చేయలేక, హైవేపై ఉన్న రైలింగును గుద్దుకొని, కిందపడి తలకు బలమైన రక్తదాయకమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందడం జరిగిందని, మృతుని భార్య పీర్ల గీత, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని స్థానిక పోలీసులు తెలిపారు...

# రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేయాలని బ్యాంకర్లతో సమావేశం



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి( మే 9 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా అందోల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఆందోల్ మండలంలో, రాజీవ్ యువ వికాసం పథకం, మండల స్థాయ బ్యాంకర్లతో వివిధ గ్రామాలకు చెందిన, అన్ని కార్పొరేషన్లకు వచ్చిన, అన్ని పతాకాలకు చెందిన లబ్ధిదారుల దరఖాస్తులను, బ్యాంకర్ల ముందు ఉంచి, లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేయాలని సమావేశం నిర్వహించారు, దరఖాస్తులు చేసిన లబ్ధిదారులతో మాట్లాడి, లక్షా, రెండు, లక్షలు మరియు మూడు, మరియు నాలుగు, లక్షల వరకు చెందిన పథకాలకు ఆర్థిక సహాయం చేయాలని, బ్యాంకు వారి సమ్మతి కోరుతూ, సమావేశము నందు ఉంచి బ్యాంకర్లకు తెలిపారు,, ఆ తర్వాత ఉన్న వారిని గుర్తించి, ఎంపిక చేయవలసిందిగా, సమావేశం నందు నిర్ణయించినారు, ఇట్టి కార్యక్రమ సమావేశానికి మండల అభివృద్ధి అధికారి, రాజేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, అన్ని బ్యాంకులకు చెందిన సిబ్బంది, మండల పంచాయతీ అధికారి సోమనారాయణ, మండల స్థాయి సిబ్బంది పాల్గొన్నారు

## విశాఖ తీర ప్రాంతంలో అగ్ని ప్రమాదం పచ్చదననీ హరిస్తున్న అగ్ని

రుషికొండ సమీపంలో ఉన్న రామానాయుడు స్టూడియో ఎదురుగా సముద్ర తీరం ని ఆనుకొని ఉన్న తాటి చెట్ల మధ్య చెలరేగిన మంటలు.అగ్ని ప్రమాదంలో సుమారు 30 చెట్లు వరకు ఖాళీ బూడిదైనవి సంఘటన స్థలానికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకున్న ఫైర్ సిబ్బంది ఈ అగ్ని ప్రమాదం సహజంగానే జరిగిందా? లేదా మనుషుల నిర్లక్ష్యం వల్ల జరిగిందా అనేది తెలియాల్సిఉంది

# ప్రభుత్వం పంపిణీ చేసిన భూమికి హద్దులు నిర్ణయించండి.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఇల్లంతకుంట, ( ప్రజాబలం ),** ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపూర్ గ్రామానికి చెందిన అంబేద్కర్ సంఘ సభ్యులు శుక్రవారం రోజున ఇల్లంతకుంట తాసిల్దార్ కు ఒక వినతి పత్రం సమర్పించడం జరిగింది.

ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘ సభ్యులు మాట్లాడుతూ 1978 సంవత్సరంలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ దళితులకు నివాస స్థలాల పట్టాలు ఇవ్వడం జరిగిందని అందులో భాగంగా కొన్ని ప్లాట్ లకు సంబంధించి భూ సేకరణ చేసి పంపిణీ చేయకుండా అలాగే వదిలేశారని గత రెండు సంవత్సరాల క్రితం దళితులు విజ్ఞప్తి మేరకు అప్పటి తాసిల్దార్ సర్వే చేసి హద్దులు నిర్ణయించడం జరిగింది కానీ అదే సర్వే నెంబర్ లో ఉన్న ఒక రైతు ఈ భూమి తనదే అని ప్రభుత్వం తప్పుగా సర్వే చేసిందని కోర్టు ద్వారా అంబేద్కర్ సంఘ సభ్యులకు నోటీసులు ఇవ్వడం జరిగిందని, రెవెన్యూ అధికారులు మరొకసారి అట్టి భూమిని మళ్లీ సర్వే చేసి హద్దులు నిర్ణయించి,1978లో పట్టాలు జారీచేశారో దానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలని స్థానిక తాసిల్దార్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ అధ్యక్షులు పసుల నరేష్ కుమార్, సీనియర్ నాయకులు పసుల వెంకన్న, గన్నేరం నర్సయ్య, అంబేద్కర్ సంఘ సభ్యులు అనిల్, సంజిత్, అనిల్, శ్రీనివాస్, లచ్చయ్య, మల్లేశం గ్రామ దళితులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ వ్యవస్థలను నిర్లక్ష్యం చేసిన పార్టీలకు బుద్ధి చెప్పాలి. దామెర సత్యం.




**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఇల్లంతకుంట, ( ప్రజాబలం ),** శుక్రవారం రోజున ఇల్లంతకుంట మండల కేంద్రంలో మానకొండూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2024-26 సంవత్సరములకు గాను సభ్యత్వం పొందిన పార్టీ శ్రేణులకు రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి దామెర సత్యం పార్టీ డిజిటల్ సభ్యత్వ కార్డులను అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి దామెర సత్యం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అతి త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, అందుకోసం తెలుగుదేశం పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని, తెలుగుదేశం పార్టీ పైన కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని స్థానిక నాయకులు, కార్యకర్తలు తిప్పి కొట్టాలని, అందుకోసం ఇప్పటినుండే తెలుగుదేశం పార్టీని బలోపేతం చేస్తూ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునివ్వడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో బి ఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీలో పంచాయతీరాజ్ వ్యవస్థలను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని, గ్రామాలలో పాలకవర్గాలు లేకపోవడం వల్ల అభివృద్ధి కుంటుపడిందని, తెలుగుదేశం పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలలో అధిక స్థానాలు గెలుచుకునే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని దామెర సత్యం కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల కన్వీనర్ గజబింకార్ ఎల్లోజి, సీనియర్ నాయకులు చర్ల ప్రతాప్, అనుపురం చిరంజీవి, శ్రీనివాస్, కుమ్మరి నర్సయ్య, ఇమ్మడోజు మల్లికార్జున్, మహిళా నాయకురాళ్లు వసంత రాజవ్వ, కులాల లక్ష్మీ తారవ్వ, అనసూయ, తిరుపతమ్మ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గ్రామ సభల ద్వారా అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను ఎంపిక చేయాలి.

## మండల సిపిఎం పార్టీ డిమాండ్.




**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, బోయినపల్లి, ( ప్రజాబలం ),** శుక్రవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలో మండల అభివృద్ధి అధికారికి సిపిఎం పార్టీ మండల పక్షాన వినతి పత్రం సమర్పించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారుల జాబితా తయారు చేసే అధికారులు సర్వే చేయడం జరుగుతుంది. దీనివల్ల అసలైన అర్హుల పేర్లు లబ్ధిదారుల జాబితాలు రాకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం ఎంతో దూర దృష్టితో నిజమైన ఇండ్లు లేని నిరుపేదలకు ఇవ్వాలని లక్ష్యంతో ముందుకు పోతున్న తరుణంలో మండలంలో అవకతవకలు జరుగుతున్న సందర్భంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి వ్యవసాయ భూములు ఉన్నవాళ్లకు, ఆస్తులు ఉన్నవాళ్లు కాకుండా ఏమీ లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లకు ఎంపిక చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను కమిటీల ద్వారా కాకుండా గ్రామాలలో ప్రజల మధ్య గ్రామ సభలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి నిరుపేదలకు న్యాయం చేయాలని పత్రిక ముఖంగా మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురజాల శ్రీధర్ డిమాండ్ చేశారు.

## జోహార్ మురళీనాయక్

అమరావతి పాకిస్తాన్ తో జరుగుతున్న యుద్దంలో సత్యసాయి జిల్లా కల్లితండాకు చెందిన జవాను మురళీ నాయక్ వీర మరణం పొందడం తీవ్ర వేదనను కల్గించిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు.దేశ రక్షణ కోసం ప్రాణాలు విడిచిన మురళీ నాయక్ వీర మరణం తెలుగు ప్రజలకే కాక దేశ ప్రజలందరికీ స్ఫూర్తి దాయకం. పాకిస్తాన్ తో యుద్ధంలో మురళీ నాయక్ ప్రదర్శించిన ధైర్యసాహసాలకు బిగ్ సెల్యూట్. మురళీ నాయక్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుడ్ని ప్రార్థిస్తున్నాను. మురళీ నాయక్ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. మురళీ నాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు.

## దేశంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ ముందు జాగ్రత్త చర్యలు.

## వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి మీద రెడ్ క్రాస్ సింబల్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** ప్రభుత్వ ఆదేశాల మేరకు యుద్ధమేఘాలు కమ్ముకున్న వేళ అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల మీద 12 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పు తెలుపు రంగు మీద నాలుగు అడుగుల ఎరుపు రంగులో రెడ్ క్రాస్ గుర్తు వేయడం జరిగింది. ఇందులో భాగంగా వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి భవనం మీద వేయడం జరిగింది. యుద్ధ సమయంలో అత్యవసర వైద్య సేవలు అందించే ఆసుపత్రుల మీద దాడులు చేయకూడదనే జెనీవాలో కుదుర్చుకున్న అంతర్జాతీయ యుద్ధ నియమాల్లో భాగంగా ఈ విధమైన గుర్తు వేయడం జరిగిందని వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ పెంచలయ్య తెలిపారు.

## వేసవి క్రికెట్ శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులకు ఉచితంగా పాలు, గుడ్లు, అరటి పండ్లు పంపిణీ చేసిన పొలాస రాజేశం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** శుక్రవారం రోజున హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మరియు కరీంనగర్ జిల్లా క్రికెటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని బాలానగర్ కోర్టు వద్ద గల కీర్తిశేషులు డాక్టర్ లింగాల నర్సింగరావు స్థలంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ లో క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్న అండర్ -14,16,19,21 వయసుగల క్రీడాకారులకు శ్రీ రాజరాజేశ్వర క్యాటరింగ్ ప్రోప్రైటర్ పొలాస ( వంటల) రాజేశం మరొకసారి సేవా దృక్పథంతో దాదాపు 150మంది క్రికెట్ క్రీడాకారులకు పాలు, గుడ్లు, అరటి పండ్లు అందించారు. ఈ సందర్భంగా పొలాస రాజేశం మాట్లాడుతూ ఇటువంటి ఏ కార్యక్రమైనా నా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని ఆయన పేర్కొన్నారు. వేసవి కాలంలో విద్యార్థులు సమయం వృధా చేయకుండా క్రీడలపై దృష్టి పెట్టాలని వారికి తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని వేములవాడ మున్సిపల్ మాజీ కౌన్సిలర్, క్రికెటర్ నిమ్మ శెట్టి విజయ్ అన్నారు. అలాగే ఏ సందర్భం వచ్చిన తన మంచి మనసుతో సేవా కార్యక్రమాలు చేస్తున్న పొలాస రాజేశం ను బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు ఈర్లపల్లి రాజు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమ్మర్ క్యాంపు నిర్వహకుడు పెద్దిరాజు మాట్లాడుతూ ఈ యొక్క క్యాంపు నెల రోజుల పాటు కొనసాగుతుందని శిక్షణ పొందుతున్న విద్యార్థులకు త్వరలోనే అండర్ -14,16,19,21 క్రికెట్ క్రీడాకారుల ప్రతిభను బట్టి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆడించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు ఈ అవకాశం కల్పించినందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మరియు కరీంనగర్ జిల్లా క్రికెటర్ అసోసియేషన్ కు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం రోజున క్రీడాకారులకు పాలు, గుడ్లు, అరటి పండ్లు అందించిన పోలాస రాజేశం కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రికెట్ క్రీడాకారులు ప్రసాద్, పిల్లి నిఖిల్, టిల్లు, శ్రీకాంత్ రెడ్డి, బైరి సతీష్, రాజేందర్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్ దిగ్విజయం కావాలని, భారత త్రివిధ దళాలు క్షేమంగా ఉండాలని రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** మే 9వ తేదీ, 2025- భారత- పాకిస్తాన్ సరిహద్దుల్లో కొనసాగుతున్న ఇరుదేశాల యుద్ధంలో భారత వైమానిక దళం, నావికాదళం మరియు సైన్యానికి దైవిక బల రక్షణ మరియు ఆశీస్సులు ఉండాలని తెలంగాణ ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయ శాఖ సూచనలను అనుసరించి దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.



శౌర్యానికి, ధైర్యానికి ప్రతీకలైన భారత సైనికుల భద్రత, ఆరోగ్యం మరియు వారి శ్రేయస్సు కోసం, అలాగే భారతదేశవ్యాప్తంగా శాంతి మరియు సామరస్యం నెలకొనాలని రాజన్న ఆలయం నందు చండీ సహిత, రుద్ర హోమం శుక్రవారం రోజున నిర్వహించడం జరిగింది.

## తెలంగాణ సిఐసిగా

## డా. జీ.చంద్రశేఖర్ రెడ్డి పదవి ప్రమాణ స్వీకారం

హైదరాబాద్ మే 9: తెలంగాణరాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషన్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ గా డా. జి చంద్రశేఖర్ రెడ్డి ఎఈూ ( ఖీబిట) నేడు మధ్యాహ్నం 12.05 గంటలకు పదవి బాధ్యతలు స్వీకరించారు. రాజ్ భవన్ దర్బార్ హాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జి.చంద్రశేఖర్ రెడ్డిచే రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణ రావు,...., శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, రాష్ట్ర రైతు కమీషన్ చైర్మన్ కోదండ రెడ్డి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, డీజీపీ జితేందర్, రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుమిదిని, విజిలెన్స్ కమీషనర్ ఏం.జీ.గోపాల్, సీ.ఏం.ఓ. అధికారులు శేషాద్రి, శ్రీనివాస రాజు, మాణిక్ రాజ్,శ్రీనివాసులు, రాజ్ భవన్ కార్యదర్శి దాన కిషోర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మహేష్ దత్ ఎక్కా, సీనియర్ ఐఏఎస్ అధికారులు రఘునందన్ రావు, బుద్ధ ప్రకాష్, వినయ్ కృష్ణా రెడ్డి, అడిషనల్ ద మహేష్ భగవత్ తదితరులు హాజరయ్యారు. డా. చంద్ర శేఖర్ రెడ్డి ఈ పదవిలో మూడు సంవత్సరాలపాటు లేదా 65 ఏళ్ల వరకు ఉంటారు.

## కేటీఆర్ సమక్షంలో బిఆర్ఎస్ లో చేరిన జిల్లా ముస్లిం నాయకులు మహమ్మద్ రసూల్



**ఖమ్మం మే 09 (ప్రజాబలం బ్యూరో)** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కొత్త మిట్టపల్లి పర్యటనకు వచ్చిన సందర్భంలో అపూర్వ స్వాగతం లభించింది కొత్త మిట్టపల్లిలో శు క్రవారం జరిగిన డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ దివంగత రాయల వెంకట శేషగిరిరావు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కేటీఆర్ హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా రేజెర్ల (అంజనాపురం)కు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తదితర ప్రముఖులతో కలిసి చేరుకోగా పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే, సత్తుపల్లి నియోజకవర్గ ఇంఛార్జి సండ్ర వెంకటవీరయ్యల నాయకత్వంలో ఇండిపెండెంట్ గా ఖమ్మం పార్లమెంటుకి పోటీ చేసిన ముస్లిం నాయకులు మహమ్మద్ రసూల్ మరియు బంధువులు మిత్రులు అభిమానులు పెద్ద సంఖ్యలో జాయిన్ అయ్యారు మొదటగా ఖమ్మం నుంచి సుమారు 100 కార్లలో తల్లాడ వరకు ర్యాలీగా వెళ్లి బిఆర్ఎస్ పార్టీలో చేరారు ఈ సందర్భంగా కేటీఆర్ కండువగప్పి పార్టీలో స్వాగతించారు ఈ సందర్భంగా రసూల్ మాట్లాడుతూ పార్టీలో రావడం చాలా సంతోషంగా ఉందని పార్టీ ఏ విధంగా నన్ను ఉపయోగించుకున్న ఆ విధంగా పార్టీ కి కట్టుబడి ఉంటానని అన్నారు ఈ కార్యక్రమంలో దరిపల్లి వీరబాబు రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు

## అదనంగా డబ్బులు ఇవ్వాలని వారసుల దౌర్జన్యం



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మే 9** :మందమర్రి మండల తుర్కపల్లి గ్రామంలో 30 సంవత్సరాల క్రితం ప్లాటు కొనుక్కొని ఇల్లు కట్టుకొని ఉంటున్న కుటుంబంపై భూమి అమ్మిన సదరు వ్యక్తి వారసులు దౌర్జన్యం చేస్తూ దాడులకు దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన అనంతరం విలేకరుల సమావేశంలో బాధిత కుటుంబం మేడి శ్రీమతి కొడుకు శ్రావణ్ లు మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం అగ్గు బాలయ్య సారంగపల్లి నివాసి తన వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి ప్లాట్లు చేయగా ప్లాటు కొనుక్కొని అందులో ఇల్లు నిర్మించుకొని ఉంటున్నామన్నారు. గ్రామపంచాయతీ కూడా ఇంటికి నెంబర్ కూడా కేటాయించారని తెలిపారు. ఇల్లు శిధిలమైపోవడంతో నూతనంగా ఇంటిని నిర్మించుకుందామనే ఆలోచనతో ఉండగా అగ్గు బాలయ్య కొడుకు అగ్గు మల్లయ్య భార్య ఆగ్గు లక్ష్మి కూతురు సంధ్య కుటుంబ సభ్యులందరూ కలిసి మాకుటుంబ సభ్యులపై దాడి చేసి ఇది మా పట్టా భూమిని మీ పేరు పై పట్టాలేదని ప్రస్తుతం ఉన్న భూమి విలువకు తగ్గట్టుగా మరింత అదనంగా డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దౌర్జన్యానికి దిగారని తెలిపారు. వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చి వ్యవసాయతర భూమిగా రికార్డుల్లోకి మార్చకపోవడంతోనే ఈ సమస్య తలెత్తుందని అధికారులు గమనించి మా కుటుంబంపై భూమి అమ్మిన అగ్గు బాలయ్య కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేయాలని స్థానిక పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ కి ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే రాజిరెడ్డి కి నివాళులు అర్పించిన మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాబలం ప్రతినిధి ఉప్పల్ నియోజకవర్గం మే 9:**ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు.

ఆయన మరణవార్త తెలుసుకున్న పలువురు మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హబ్సిగూడలోని నివాసానికి చేరుకొని రాజి రెడ్డి పార్థివ దేహానికి నివాళు లర్పించారు.

ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి మృతి పట్ల మంత్రి శ్రీధర్ బాబుతో పాటు కాంగ్రెస్ నాయకుడు, మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి లు సంతాపం తెలియజేశారు.

ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గానికి విశేష సేవలు అందించిన రాజిరెడ్డి మరణం విచారకరమని పేర్కొన్నారు. రాజిరెడ్డి నిబద్ధత గల ప్రజా నాయకుడిగా ప్రజల మనస్సుల్లో ఎప్పటికీ నిలిచి ఉంటారని చెప్పారు. రాజిరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## జిల్లా లో సజావుగా జరుగుతున్న ధాన్యం కొనుగోలు

## నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా మద్దతు ధరకు కొనుగోలు

## జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, : జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతుందని, కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు.శుక్రవారం జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస బాల పెల్లి పి.ఎ.సి.ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు వివరాలు, అందుబాటులో ఉన్న తార్పలిన్ కవర్లు, గన్ని బ్యాగులు, కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలింపు తదితర వివరాలను జిల్లా కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్

జగిత్యాల రూరల్ మండలంలో బాల పల్లి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతుందని, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నామని, ప్రతిరోజు మిల్లులకు పంపుతున్నామని,రవాణా నిమిత్తం లారీల కొరత ఎక్కడా లేదని జిల్లా కలెక్టర్ తెలిపారు. రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని అన్నారు.

కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం 17 తేమ శాతం రాగానే కాంటా వేసి కొనుగోలు చేసి సంబంధిత మిల్లులకు తరలించాలని అన్నారు.

ధాన్యం రవాణా అంశంలో వాహనాల కొరత, హామా లీల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రైతులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఈ తనిఖీల్లో జిల్లా కలెక్టర్ వెంట జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, జగిత్యాల రూరల్ మండల తహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసానికి సిబిల్ స్కోర్ తప్పనిసరి నిబంధనను సడలించాలి.

### బి ఆర్ ఎస్ సీనియర్ నేత నిమ్మ శెట్టి విజయ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాసానికి సిబిల్ స్కోర్ తప్పనిసరి నిబంధనను సడలించాలని వేములవాడ పట్టణ బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నిమ్మ శెట్టి విజయ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్ తప్పనిసరి నిబంధనను ముడి పెట్టడం వల్ల నష్టపోయేది అత్యధికంగా ఎస్సీ, ఎస్టి, బీసీ బిడ్డ లేనని, తక్షణమే ఆ నిబంధనను ఎత్తివేయాలని కోరారు. గతంలో తీసుకున్నటువంటి వ్యక్తిగత రుణాలలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా అత్యధిక శాతం దరఖాస్తుదారులకు సిబిల్ స్కోర్ తగ్గింది అన్నారు. ప్రభుత్వ పథకాలు,రుణాలు ఇవ్వడానికి ప్రభుత్వం మెలికలు పెట్టడం ఏ మాత్రం సబబు కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం కు ఇచ్చే రుణాలకు మెలిక పెట్టే ఆలోచనను విరమించుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నిమ్మశెట్టి విజయ విజ్ఞప్తి చేశారు.

## అత్యవసర చికిత్స అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 9:**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. సి. ఉమ గౌరి,
జిల్లా కోఆర్డినేటర్ హెల్త్ సర్వీసెస్ డా. సునిత గారితో కలిసి మేడ్చల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో వైద్య సేవల మెరుగుదల, తక్కువ సమయంలో అత్యవసర చికిత్స అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, సిబ్బందికి నిబంధనలపై అవగాహన పెంపొందించేందుకు శిక్షణ కార్యక్రమాల గురించి చర్చించారు.

అలాగే గర్భిణీ స్త్రీలకు మెరుగైన సేవలు, పిల్లల టీకా కార్యక్రమాలపై మరింత దృష్టి పెట్టాలనేది సమావేశ ముఖ్యాంశం.

సమావేశంలో వైద్య సిబ్బంది సమస్యలు, వీలైన పరిష్కార మార్గాలు కూడా చర్చించబడ్డాయి డా. సి. ఉమ గౌరి గారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో పని చేయాలని, జిల్లా ఆరోగ్య వ్యవస్థను మరింత శక్తివంతం చేయడానికి ప్రతీ వైద్య సిబ్బంది తమ పాత్రను నిబద్ధతతో నెరవేర్చాలని సూచించారు.

## నాణ్యత ప్రమాణాలకు పెట్టింది పేరు ఎస్ ఆర్ కే డైరీ

### కాంగ్రెస్ పార్టీ హుజరాబాద్ నియోజకవర్గం వొడితల ప్రణవ్ బాబు.




**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి మే 9** నాణ్యత ప్రమాణాలకు పెట్టింది పేరుగా ఎస్ ఆర్ కే డైరీ పాలు పాల పదార్థాలు అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు అన్నారు. హుజురాబాద్ పట్టణంలో ఎస్ ఆర్ కె డైరీ పార్లర్ ను ప్రణవ్ బాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రణవ్ బాబు మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలకు పెట్టింది పేరుగా ఎస్ ఆర్ కే డైరీ నాణ్యమైన పాలు పాల పదార్థాలను అందిస్తూ పాడి రైతులకు, వినియోగదారులకు సేవలు అందిస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ కె డైరీ సీఈవో రాజేందర్ రావు, జమ్మికుంట బ్రాంచ్ మేనేజర్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ ఆర్ కె సిబ్బంది పాల్గొన్నారు.

## మే 17 లోపు లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు::జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మే 09:(ప్రజాబలం ప్రతినిధి)** మే 17 లోపు లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ దరఖాస్తులు ఆహ్వానిస్తుందని, మే 5 నుంచి మీ సేవా కేంద్రాలలో 100 రూపాయలు చెల్లించి దరఖాస్తు, ప్రాస్పెక్టస్ పొందవచ్చని, మే 17 లోపు ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను మీసేవ కేంద్రాల్లోని సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.ఇంటర్ లో గణితం లో 60 శాతం మార్పులు సాధించిన వారు, ఐటిఐ డ్రాఫ్ట్ మెన్(సివిల్) , డిప్లమా (సివిల్), బీటెక్ (సివిల్) లేదా సమానమైన అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు 50 పని దినాలలో (మే 26 నుంచి జూలై 26 ) శిక్షణ ఇస్తామని, శిక్షణ కోసం ఓసి అభ్యర్థులు పదివేల రూపాయలు బీసీ అభ్యర్థులు 5000 రూపాయలు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 2500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని , మరిన్ని వివరాలకు 9849081489, 7032634404, 9441947339 ఫోన్ నెంబర్ల నందు సంప్రదించాలని కలెక్టర్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

### జెడ్ ప్లస్ భద్రత కోసం హైకోర్టుకు జగన్

విజయవాడ తనకు జెడ్ప్లస్ కేటగిరీ భద్రతను పునరుద్ధరించేలా కేంద్ర హోం శాఖను ఆదేశించాలంటూ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. తనకున్న ప్రాణహానిని తాజాగా, స్వతంత్రంగా మదింపుచేసి భద్రతను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగత భద్రతాధికారులు, జామర్లు, ఇల్లు, కార్యాలయం వద్ద భద్రత, పనిచేసే బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని సమకూర్చాలని లేదా సొంత వాహనాన్ని వినియోగించుకొనేందుకు అనుమతిచ్చేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంపై శుక్రవారం విచారణ జరుగనుంది.

## రైతు ఆదాయం పెంపొందేలా అవగాహన కల్పించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 09 :** రైతులు శాస్త్రీయ పంట సాగులే కాకుండా భూసారం సంరక్షించుకునే విధంగా వాణిజ్య, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి అధిక ఆదాయం పొందే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన,జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అనిత, మ్యాట్రిక్స్ సి.ఈ.ఓ. ఉదయ్కుమార్ లతో కలిసి వ్యవసాయ డివిజనల్ అధికారులు,మండల వ్యవసాయ అధికారులు, మండలం వ్యవసాయ విస్తరణాధికారులు, ఉద్యానవన-పట్టు పరిశ్రమశాఖ అధికారులు, సూక్ష్మ నీటిపారుల శాఖ జిల్లా సమన్వయకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...శాస్త్రీయ పంటలైన వరిధాన్యం వంటి పంటలను మార్పు లేకుండా సాగు చేయడం వలన భూసారం దెబ్బతింటుందని, పంట మార్పిడి విధానాన్ని అవలంభించడం వలన భూసారం పెంపొందించడంతో పాటు భూగర్భ జలాలను కాపాడుకోవచ్చని తెలిపారు.పప్పు ధాన్యాలు, మొక్కజొన్న,కూరగాయల సాగు, వాణిజ్య, ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా అధిక దిగుబడితో ఆదాయం పొందడమే కాకుండా భూసారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.ప్రతి సంవత్సరం పంట సాగు ప్రారంభం ఆలస్యం కావడంతో అకాల వర్షాల కారణంగా నష్టం జరుగుతుందని,ముందుస్తుగా పంట సాగు ప్రారంభించినట్లయితే ప్రకృతి వలన కలిగే నష్టాల నుండి బయట పడవచ్చని తెలిపారు.ఖరీఫ్ సన్నరకం వడ్ల పంట సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని,రబీ సీజన్ లో పంట మార్పిడిని ప్రోత్సహించి అధిక ఆదాయం పొందేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారులు తమ పరిధిలో ఫెర్టిలైజర్,విత్తనాల నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని,ఆన్లైన్లో నమోదు చేసిన వివరాలు, ఆఫ్లైన్ నిల్వలను పరిశీలించాలని, మండలంలో కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాణిజ్య,ప్రత్యామ్నాయ పంటల ద్వారా అధిక దిగుబడి సాధించి ఆదాయం పొందుతున్న రైతుల ద్వారా రైతువేదికలలో సమావేశాలు ఏర్పాటు చేసిన రైతులకు పంట సాగు మెళకువలు,దిగుబడి, మార్కెటింగ్, కనీస మద్దతు ధర ఇతర అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు.అటవీ జంతువుల నుండి పంట నష్టానికి అవకాశం ఉన్న ప్రాంతాలలో పామాయిల్ పంట సాగు చేసేలా రైతులకు వివరించాలని, గిరిజన ప్రాంతాలు, అటవీ, పోడు భూములలో వెదురు సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని,మిగతా అనువైన ప్రాంతాలలో కూరగాయలు సాగు చేసేలా చూడాలని తెలిపారు. పప్పుధాన్యాలు పంట సాగులో దిగుబడి అంచనా వేసి అధిక మొత్తంలో ఉన్నట్లయితే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరతో కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అవకాశం ఉన్న రైతులు పామాయిల్ సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని, ప్రతి రోజు పంట సాగు ప్రక్రియను పర్యవేక్షిస్తూ ప్రతి చర్యను ఆన్లైన్లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. పంట సాగులో సందేహాలు, అనుమానాలు ఉన్నా, క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్ విజయం పై బిజెపి సంబరాలు

### -ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మే 9:**జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ టూరిస్టుల పై ఉగ్రవాదుల దాడికి నిరసనగా ఆపరేషన్ సింధూర్ విజయవంతం పై మందమర్రి పట్టణంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు ధార రవి సాగర్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు అందుగుల శ్రీనివాస్ పాల్గొన్నారు. పాత బస్టాండ్ ఏరియాలో ర్యాలీ నిర్వహించి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. అనంతరం నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వ ఉగ్రవాద స్థావరాలపై చేసిన దాడి ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం పై గట్టి చప్పట్లతో అభినందనలు తెలుపుతూ రాజకీయాలకు అతీతంగా పార్టీలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రజలందరూ ఉగ్రవాదుల చర్యలకు బుద్ధి చెప్పే విధంగా సైనిక చర్యలు ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు అని అన్నారు.దేశ సమగ్రతకు పాటుపడుతున్న సైనిక చర్యలకు మద్దతు ఇస్తు వారికి మానసిక ధైర్యం ఇచ్చే విధంగా కార్యక్రమాలు చేయాలని ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమంలో మార్తా కుమార్, దీక్షితులు, వినయ్, రంగు శ్రీనివాస్, జకుల కంకయ్య, బస్టాండ్ వ్యాపార సంఘం నాయకులు తదితరు పాల్గొన్నారు.



## వీరశైవులకు రుద్ర భూములను ప్రభుత్వం తక్షణమే కేటాయించాలి

### వీరశైవ లింగాయత్ టిడిపి సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు బాడదా కౌశిక్

తుగ్గలి రాష్ట్ర వ్యాప్తంగా వీరశైవ లింగాయత్ లకు రుద్ర భూములను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కేటాయించాలని వీరశైవ లింగాయత్ టిడిపి సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు బాడదా కౌశిక్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం రోజున విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వీరశైవులు అధికంగా గల ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం వీరశైవులకు ప్రత్యేక స్మశానవాటికలను (రుద్రభూమి) కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల మంది,ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,80,000 మంది మరియు పత్తికొండ నియోజకవర్గం లో దాదాపు 6000 మంది వీరశైవులు ఉన్నారని ఆయన తెలియజేశారు.వీరశైవ లింగాయత్ లకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని,ప్రభుత్వం ద్వారా రుణాలు కూడా మంజూరు చేయాలని ఆయన తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా వీరశైవులు ఆర్థికంగా మరియు రాజకీయంగా ఎదిగేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన తెలియజేశారు.రాష్ట్రవ్యాప్తంగా గల వీరశైవ లింగాయత్ లు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన తెలియజేశారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి జిల్లా మరియు మండల అధికార యంత్రాంగం ద్వారా వీరశైవ లింగాయత్ లకు రుద్ర భూములను తక్షణమే కేటాయించాలని వీరశైవ లింగాయత్ టిడిపి సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు బాడద కౌశిక్ ప్రభుత్వాన్ని కోరారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com